గ్రూప్-1 మెయిన్ వాయిదా వేయండి

- 'ప్రిలిమినరీ'పై ఉన్న కేసులు పరిష్కరించండి
- టీజీపీఎస్సీ చైర్మన్‌కు అభ్యర్థుల వినతి

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మెయిన్ పరీక్షనాటికి ప్రిలిమినరీ పరీక్ష 'కీ'పై వివిధ కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులను పరిష్కరించాలని, సాధ్యంకాని పక్షంలో మెయిన్ పరీక్షను వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డిని కోరారు. శుక్రవారం ఆయనకు వేర్వేరుగా లేఖలు అందజేశారు. షెడ్యూల్ ప్రకారం గ్రూప్-1 మెయిన్ పరీక్ష అక్టోబర్ 21న ఉన్నదని అభ్యర్థులు తెలిపారు. ప్రిలిమినరీ పరీక్ష 'కీ'లో దొర్లిన తప్పులపై పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారని గుర్తుచేశారు. ఆ కేసులన్నింటినీ మెయిన్ పరీక్షనాటికి పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీ సంతోష్, ప్రశాంత్‌రెడ్డి, సాయికృష్ణ, నరేశ్, అరుణ్‌కుమార్, నిశాంత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, రవి, భద్రు, చంద్రమౌళి, వినోద్‌కుమార్, కిరణ్, సంపత్ పాల్గొన్నారు.

గుర్తింపు పొందిన కాలేజీల్లోనే చేరండి

- నమస్తే తెలంగాణ కథనానికి స్పందించిన ఇంటర్‌బోర్డు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): గుర్తింపు పొందిన కాలేజీలోనే విద్యార్థులు చేరాలని ఇంటర్‌బోర్డు సూచించింది. గుర్తింపు పొందిన కాలేజీల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, వాటిలోనే అడ్మిషన్లు పొందాలని కోరింది. 'ఆ విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకం' పేరుతో శుక్రవారం నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. ఇప్పటివరకు 340కి పైగా కాలేజీలు గుర్తింపును దక్కించుకోకపోవడం, ఆయా కాలేజీల్లో లక్షలకుపైగా విద్యార్థులున్నారని ప్రస్తావించింది. దీంతో ఇంటర్‌బోర్డు డైరెక్టర్ శృతి ఓజా శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. జూనియర్ కాలేజీల్లో ఫస్టియర్ ప్రవేశాల గడువును 7 వరకు పొడగించామని పేర్కొన్నారు. ఇదే చివరి అవకాశమని, అర్హులైన విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు.

ప్రభుత్వరంగ సంస్థలకు ఐఆర్ ఎప్పుడు?

- 8 నెలలుగా ఉద్యోగుల ఎదురుచూపులు

హైదరాబాద్, ఆగస్టు30 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందుగా తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు ఐఆర్‌ను ప్రకటించింది. అది ఇప్పటికీ ప్రభుత్వ రంగసంస్థలు, సమాఖ్యలు, సహకార సంఘాల్లో అమలు చేయని పరిస్థితి నెలకొన్నది. ఆయా సంస్థల్లోని ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటి పీఆర్సీ పదవీకాలం జూలై 2022తో ముగియడంతో 2023అక్టోబర్‌లో రెండో పీఆర్సీని ఏర్పాటు చేశారు. 5శాతం ఐఆర్‌ను ప్రకటించారు. అయితే ఐఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సహకార సంఘాలు, ఫెడరేషన్లు, విశ్వవిద్యాలయాల బోధనేతర సిబ్బందికి మాత్రం చెల్లించడం లేదు. దీనిపై ఇప్పటికే తెలంగాణ పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అనేక పర్యాయాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇదే విషయమై ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయగా, ఆయా సంస్థల్లోని ఉద్యోగులకు సైతం ఐఆర్ చెల్లించాలని ఆర్థికశాఖకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆదేశాలు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం గమనార్హం.

ఏనుమాముల మార్కెట్‌కు కొత్త పత్తి

- క్వింటాకు రూ.7,011

కాశీబుగ్గ, ఆగస్టు 30: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం కొత్త పత్తి వచ్చింది. సాధారణంగా అక్టోబర్ నుంచి కొత్త పత్తి మార్కెట్‌కు వస్తుంది. మద్దతు ధర కూడా అప్పుడే ప్రారంభమవుతుంది. ఈ సారి నెల రోజుల ముందే పత్తి మార్కెట్‌కు రావడంతో రైతులు, కార్మికులు, వ్యాపారులు సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు కాంటాలకు పూజలు చేసి పత్తి కొనుగోలుకు కాంటా పెట్టారు. కేంద్రం క్వింటాకు మద్దతు ధర రూ. 7521 ప్రకటించగా.. ఏనుమాముల మార్కెట్‌లో క్వింటాకు రూ.7011 ధర పలికింది. హనుమకొండ జిల్లా ఐలోని మండలం వెంకటాపూర్‌కు చెందిన పిండి రవి 8 బస్తాలు తీసుకురాగా.. కుమారస్వామి అడ్తి ద్వారా గోకుల్ కాటన్ వ్యాపారి కొనుగోలు చేశారు. పాత పత్తికి క్వింటాకు రూ.7,500 ధర పలికింది.

ఆరిపోయిన గృహ'జ్యోతి'

- పెండింగ్ బిల్లులు వసూలు చేయాలని ఉత్తర్వులు
- జీరో బిల్లు వస్తేనే గృహజ్యోతి వర్తించినట్టు లెక్క
- ఫిబ్రవరి నుంచి బకాయిలు చెల్లించాల్సిందే
- జగిత్యాలలో 50 వేలకు పైగా పెండింగ్ కనెక్షన్లు
- బకాయిలు రూ. 7.25 కోట్ల పైమాటే
- మోసపోయామని వినియోగదారుల ఆవేదన



జగిత్యాల, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నట్టు చెప్పుకుంటున్న ప్రతి పథకం లోపభూయిష్టంగానే కనిపిస్తున్నది. ఒక విధానం అంటూ లేకుండా ఇష్టారాజ్యంగా అమలు చేస్తున్న పథకాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించే వారికి కరెంట్ బిల్లులు మాఫీ చేస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నది. అయితే, విద్యుత్తుశాఖకు ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను పరిశీలిస్తే.. గృహజ్యోతి పథకం సైతం ఆరిపోయినట్టుగానే కనిపిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించిన వారి కరెంట్ బిల్లులను షరతులు లేకుండా మాఫీ చేస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత మార్చి నెల నుంచి గృహజ్యోతి పథకం అమలును ప్రారంభించింది. అయితే, చాలామంది లబ్ధిదారులకు పథకం వర్తించలేదు. మార్చిలో జగిత్యాలలో వేలమందికి పథకం వర్తించలేదు. రాష్ట్రవ్యాప్తంగానూ ఎంతోమంది అర్హులకు కరెంటు బిల్లులు వచ్చాయి. దీంతో నిరసనలు వెల్లువెత్తాయి. స్పందించిన ప్రభుత్వం అర్హులు ఎవరూ బిల్లులు చెల్లించాల్సిన పనిలేదని, అలాంటి వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కోరింది. బిల్లులు చెల్లించక్కర్లేదని సీఎం నుంచి కలెక్టర్ల వరకు అందరూ చెప్పడంతో వినియోగదారులు బిల్లు చెల్లించడం మానేసి పథకానికి మరోమారు దరఖాస్తు చేసుకున్నారు.

పెండింగ్ బిల్లులు వసూలు చేయాలని ఆదేశాలు

దాదాపు ఆరు నెలలుగా జీరో బిల్లు జనరేట్ కాని వారికి సంబంధించిన బకాయిలను వినియోగదారుల నుంచి వసూలు చేయాలని ప్రభుత్వం నుంచి విద్యుత్తుశాఖకు ఉత్తర్వులు అందాయి. జీరో బిల్లు ఎప్పటి నుంచి జనరేట్ అవుతోందో అప్పటి నుంచే గృహజ్యోతి పథకం వర్తిస్తుందని, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే, జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించి జీరో బిల్లు రానివారి నుంచి బిల్లులు వసూలు చేయాలని ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన విద్యుత్తు అధికారులు బకాయిల వసూలుకు నడుంబిగించారు.

50 వేల కనెక్షన్లలో బకాయిలు

ఒక్క జగిత్యాలలోనే బిల్లు చెల్లించని బిల్లులు చెల్లించని లబ్ధిదారుల సంఖ్య 50 వేల వరకు ఉంటుందని అంచనా. జగిత్యాల జిల్లా పరిధిలో గృహ అవసరాలకు సంబంధించి 3,29,043 మంది వినియోగదారులు ఉన్నారని, వీరిలో 1,99,270 మందికి గృహజ్యోతికి సంబంధించిన జీరో బిల్లు జనరేట్ అయిందని చెప్తున్నారు. అంటే, 50,338 బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో వారి నుంచి ఈ ఆరు నెలలకు సంబంధించి రూ.7.25 కోట్లు వసూలు చేయాల్సి ఉందని అంటున్నారు.

లబోదిబోమంటున్న వినియోగదారులు

గృహజ్యోతి పథకంలో అర్హులైన వినియోగదారుల నుంచి పెండింగ్ బిల్లులు వసూలు చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో ప్రజలు లబోదిబోమంటున్నారు. అర్హత ఉన్న వారికి బిల్లులు మాఫీ చేస్తామని, కరెంట్ బిల్లులు కట్టాల్సిన అవసరం లేదని చెప్పడం, ఆరు నెలలు గడిచాక తీరా ఇప్పుడు మొత్తం బిల్లులు ఒకేసారి చెల్లించాలని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

> **అంతా మోసం**
>
> మాది జగిత్యాల. నా భర్త ఎనగంటి రవి కుమార్. ఔసుల పని చేస్తడు. నేను బీడీ కార్మికురాలిని. మాకు ముగ్గురు పిల్లలు. మేం శ్రీరాంనగర్‌లో కిరాయికి ఉంటున్న. నాలుగు బల్బులు, మూడు ఫ్యాన్లు మాత్రమే ఉన్నయ్. పెద్దగా కరెంట్ వాడకం ఉండదు. బిల్లుకూడా ఎక్కువ రాదు. గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నా జీరో బిల్లు రాలేదు. సీఎం, మంత్రులు చెప్తున్నరని మున్సిపల్ ఆఫీస్‌కు వెళ్లి మళ్లీ దరఖాస్తు చేసుకున్నం. అయినా ఆరు నెలల నుంచి నెలనెలా బిల్లు వస్తూనే ఉంది. ఏ నెల కూడా మేం 200 యూనిట్లకు ఎక్కువ వాడుకోలే. మాఫీ అయితదని అనుకున్నం. మొన్న కరెంట్ బిల్లు వచ్చింది. 93 యూనిట్లు వాడుకున్నందుకు రూ. 320 వచ్చింది. ఈ బిల్లుతో పాటు, పాత ఐదు నెలల బిల్లుల బకాయిలు మొత్తం రూ.1800 కట్టాలని బిల్లు ఇచ్చినాయన చెప్పిండు. లేదంటే కరెంటు కట్ చేస్తమని చెప్పి వెళ్లిండు. ఇదేం పద్ధతి.. ఇదేం లెక్క.. మాఫీ అంటిరి. బిల్లు కట్టకుండ్రి అంటిరి. ఇప్పుడు ఒకటేసారి ఆరు నెలల బిల్లు కట్టమంటే ఎట్ల? సర్కార్ ముచ్చటనే అర్థమైత లేదు.
>
> –ఎనగంటి మౌనిక, గృహిణి, జగిత్యాల

సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు: భట్టి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు ఖరారు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో సిటీ పోలీస్, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్-2024ను భట్టి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కంటే తమిళనాడు, కర్ణాటకలో సెక్యూరిటీ గార్డుల వేతనాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో దేశంలోనే ఉత్తమమైన వేతనాలను సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. ప్రైవేట్ సెక్యూరిటీ అనేది వేగంగా విస్తరిస్తున్న రంగమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు 3.5 లక్షలు వరకు ఉండగా, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు 4 లక్షల మంది ఉన్నట్టు తెలిపారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాలతోపాటు వివిధ అంశాల్లో వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌కు ఈ బడ్జెట్‌లో రూ. 10 వేల కోట్లు కేటాయించినట్టు గుర్తుచేశారు. రీజనల్ రింగ్ రోడ్డు, ఫోర్త్ సిటీ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతిచోట పోలీసుల కంటే ప్రైవేట్ సెక్యూరిటీ ఎక్కువగా కనిపిస్తుందని, పారిశ్రామిక, పట్టణీకరణతో వీరి పాత్ర మరింత పెరుగనున్నదని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఏడీజీ(శాంతి భద్రతలు)మహేశ్ భగవత్, ఏసీపీ విక్రమ్ సింగ్ మాన్, ప్రతినిధులు పాల్గొన్నారు

హామీలు నెరవేర్చాకే.. భట్టి రావాలి

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్



గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని ఆగస్టు 30: సింగరేణి కార్మికులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాకనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గోదావరిఖని పర్యటనకు రావాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం కోసం రూ.20 లక్షల వడ్డీలేని రుణం హామీలను అమలు చేస్తారో? లేదో? చెప్పాలన్నారు. బొగ్గు గనుల వేలంలో పాల్గొంటారా? లేక కేంద్రంతో మాట్లాడి తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించేలా ఒప్పిస్తారా? అనేది డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గతేడాది సింగరేణి 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించిన నేపథ్యంలో కనీసం 4000 కోట్ల లాభాలు వచ్చే అవకాశం ఉన్నదని చెప్పారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు గడిచినా సింగరేణి లాభాలను ప్రకటించకపోవడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. తక్షణమే లాభాలు ప్రకటించి ప్రతి కార్మికుడికి 35శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోయగూడెం, సత్తుపల్లి బొగ్గు బ్లాకులను ప్రైవేట్ పరం చేస్తారా? కార్మికులకు అప్పగిస్తారా? తేల్చిచెప్పాలన్నారు. ప్రభుత్వమే గనుల వేలంలో పాల్గొనాలని కొన్ని కార్మిక సంఘాలు కోరడం విడ్డూరమని, సింగరేణి యాజమాన్యంతో లోపాయికారితనంతోనే ఈ విధంగా మాట్లాడుతున్నాయని ఆక్షేపించారు. సమావేశంలో టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్మూర్తి, సీనియర్ వైఎస్ ప్రెసిడెంట్ కొమురయ్య, నాయకులు శ్రీనివాస్, పల్లె సురేందర్, సాయి, పులిపాక శంకర్, రోడ్డ సంపత్, గుండు శ్రావణ్, కొమురయ్య పాల్గొన్నారు. వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో టీబీజీకేఎస్, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీపై డిప్యూటీ సీఎం స్పష్టత ఇవ్వాలని, సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం బాకీ పడిన రూ.29 వేల కోట్లను చెల్లించాలని, వెంటనే లాభాల వాటా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సింగరేణిలో బదిలీ వర్కర్లకు తీపికబురు

2,364 మంది జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరణకు ఆమోదం

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : సింగరేణిలో బదిలీ వర్కర్లకు సంస్థ శుభవార్త చెప్పింది. 2,364 మందిని జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తున్నట్టు సీఎండీ బలరాం తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించనున్నట్టు వెల్లడించారు. సింగరేణిలో కారుణ్య, డిపెండెంట్ ఉద్యోగ నియామక ప్రక్రియలో తొలుత బదిలీ వర్కర్లుగా తీసుకుంటారు. ఉద్యోగంలో చేరిన తర్వాత ఆయా బదిలీ వర్కర్లు సంవత్సరంలో 190 రోజులు భూగర్భగనుల్లో, ఉపరితల గనులు, ఇతర విభాగాల్లో 240 రోజులు విధులు నిర్వహిస్తే వారిని జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజ్ చేస్తారు. సీఎండీ బలరాం మాట్లాడుతూ.. జనరల్ మజ్దూర్లుగా ఎంపికైనవారు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

ఫార్మాసిటీ భూసేకరణపై ప్రభుత్వం అప్పీల్

- ఏడాది ఆలస్యంపై రైతుల అభ్యంతరం
- విచారణ 2 వారాలకు వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఫార్మాసిటీ భూసేకరణపై మళ్లీ అభ్యంతరాలు స్వీకరించాలంటూ నిరుడు ఆగస్టులో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావు ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ భూసేకరణ ప్రక్రియను పూర్తిస్థాయిలో రద్దు చేయకుండా పరిహార ప్రకటనను మాత్రమే నిలిపివేస్తూ సింగిల్ జడ్జి తీర్పు చెప్పారని అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఆ తీర్పు వెలువడే నాటికి ఉన్న మార్కెట్ విలువ ప్రకారంగా యాచారం మండలంలోని మేడిగడ్డ గ్రామ రైతులకు పరిహారం చెల్లించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. దీనిపై పిటిషనర్ల తరపు న్యాయవాది స్పందిస్తూ.. సింగిల్ జడ్జి తీర్పుపై ప్రభుత్వం తీరుబడిగా ఏడాది తర్వాత అప్పీల్ వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ అప్పీల్‌ను కొట్టేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో అప్పీల్ దాఖలు జాప్యమవడంపై అడ్వకేట్ జనరల్ క్షమాపణ చెప్పారు. అనంతరం ప్రభుత్వ అప్పీల్‌పై తమకున్న అభ్యంతరాలను వివరిస్తూ కౌంటర్ వేస్తామని పిటిషనర్ల న్యాయవాది చెప్పడంతో తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది.

ప్రజావాణికి 680 దరఖాస్తులు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 680 దరఖాస్తులు అందినట్టు అధికారులు పేర్కొన్నారు. ఎస్సీ వెల్ఫేర్ 215, విద్యుత్ 98, రెవెన్యూ 94, మైనారిటీ వెల్ఫేర్ 90, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి 64, ఇతర శాఖలకు సంబంధించి 119 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులు స్వీకరించారు.

పీఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): బీపీఈడీ, యూజీడీపీఈడీ కోర్సులోని సీట్ల భర్తీకి నిర్వహించే ఫిజికల్ ఎడ్యుకేషన్ తుది విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. 31 నుంచి సెప్టెంబర్ 3 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 3న అర్హులైన వారి జాబితాను ప్రదర్శిస్తారు. 4, 5న వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 6న ఆప్షన్లు సవరించుకోవచ్చు. 8న సీట్లను కేటాయిస్తారు. సీట్లు పొందినవారు 9 నుంచి 12 వరకు రిపోర్ట్‌చేయాలని ప్రవేశాల కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు సూచించారు.

భాషాపండితులను అప్‌గ్రేడ్ చేయండి

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): భాషాపండితుల అప్‌గ్రేడేషన్‌తో మిగిలిపోయిన 800 పోస్టులను సైతం అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని ఆర్‌యూపీపీ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సీ జగదీశ్ ప్రభుత్వాన్ని కోరారు. 10వేల మంది అప్‌గ్రేడ్ కాగా, కేవలం 800 మంది మాత్రమే మిగిలారని, వారికి సైతం న్యాయం చేయాలని కోరారు. మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి రమేశ్, నాయకులతో కలిసి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను శుక్రవారం సచివాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

అమ్మో.. ఒకటో తారీఖు!

జీతాలు అందక చిరుద్యోగుల విలవిల

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : వారంతా చిరుద్యోగులు. ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్నామన్న పేరే తప్ప ఉద్యోగ భద్రత ఉండదు. నెలంతా పనిచేస్తే వచ్చేది రూ.15 నుంచి 20వేల లోపే. శ్రమదోపిడీకి చిరునామాగా మారిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రేవంత్ సర్కారు ముప్పుతిప్పలు పెడుతోంది. నెలంతా పనిచేస్తే ఇవ్వాల్సిన వేతనాలు, గౌరవభృతి, పారితోషికాలను చెల్లించడం లేదు. ఒకటో తారీకున జీతాలిస్తామన్న రేవంత్ ప్రభుత్వం కొలువుదీరి 8 నెలలు గడిచినా పరిస్థితిలో మార్పురాలేదు. రాష్ట్రంలోని కొంతమంది ఉద్యోగులకు నెలల తరబడి వేతనాలు అందడం లేదు.

వేతనాలు అందనిది వీరికే..

- మోడల్ స్కూళ్లలోని అవర్లీ బేస్డ్ టీచర్లకు జూలై వేతనం అందలేదు. మరో 17 పాఠశాలల్లో జూన్ వేతనం ఇప్పటికీ అందని ద్రాక్షలాగా మారింది. ఇదే మోడల్ స్కూళ్లలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు.
- ఇంటర్ విద్యలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు రెండు నెలలుగా వేతనాలు అందడం లేదు.
- కేజీబీవీ టైప్-4 సిబ్బందికి గత నాలుగు నెలలుగా వేతనాలు రాలేదు.
- గురుకులాల్లో గెస్ట్ ఫ్యాకల్టీకి జూన్, జూలై, ఆగస్టు మాసాల వేతనం అందలేదు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీల్లోని బోధనా సిబ్బందిదీ ఇదే పరిస్థితి.
- స్పోర్ట్స్ అకాడమీల్లో పనిచేస్తున్న సిబ్బంది మూడు నెలలుగా వేతనాలు పొందలేదు.
- వైద్యశాఖలోని టీవీవీపీ పరిధిలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు అందలేదు. ప్రభుత్వం ఏజెన్సీలకు ఫిబ్రవరి వరకు బిల్లులు చెల్లించింది. ఆ తర్వాత పెండింగ్ పెట్టడంతో కాంట్రాక్టర్లు సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వ లేదు.

కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు ఘోర అవమానం

- ఎంపీ చామల, మల్లన్న, వేములను అడ్డుకున్న పోలీసులు
- చెయ్యిపై, భుజంపై చెయ్యేసి పక్కకు లాగిన వైనం
- అలిగి వెళ్లిపోయిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల
- పోలీసులకు కామన్ సెన్స్ ఉండదా అంటూ అసహనం



భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి బతిమిలాడుతున్నా వెనక్కి వెళ్లిపోతున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లాలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు ఘోర అవమానం జరిగింది. ఓ కార్యక్రమంలో భాగంగా వచ్చిన ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని పోలీసులు వేర్వేరుగా అడ్డుకున్నారు. శుక్రవారం భువనగిరి పార్లమెంట్ పరిధిలోని నీటిపారుదల పనుల పురోగతిపై సమీక్ష సమావేశం ఏర్పాటుచేశారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెలికాప్టర్‌లో భువనగిరికి చేరుకున్నారు. వారికి స్వాగతం పలికేందుకు ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హెలిపాడ్ వద్దకు వేర్వేరుగా వెళ్తుండగా, మెటల్ డిటెక్టర్ పాయింట్ వద్ద గుర్తించని పోలీసు అధికారులు వారిని అడ్డుకున్నారు. చెయ్యి, భుజం పట్టుకొని పక్కకు నెట్టారు. దాంతో నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోతుండగా అక్కడే ఉన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బుజ్జగించి వెనక్కి రప్పించే ప్రయత్నం చేశారు. అయినా ఆయన వినిపించుకోలేదు. 'పోలీసులకు కామన్ సెన్స్ ఉండదా? ఎవరు ఎమ్మెల్యే, ఎవరు కాదు అనేది తెల్వదా?' అంటూ వీరేశం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత స్వాగతం పలికేందుకు రావాలని పలువురు ఆయనకు ఫోన్ చేసినా రాకుండా వేదికపైనే ఉండిపోయారు. ఇదే సమయంలో ఏసీపీతో తీన్మార్ మల్లన్న పంచాయితీ పెట్టుకున్నారు. మా జిల్లాలో పని చేస్తూ మమ్మల్ని గుర్తుపట్టరా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ముఖాలు చూడుర్రి.. బట్టలు చూడకుర్రి' అంటూ ఎంపీ చామల అసంతృప్తిని వ్యక్తం చేశారు.

పని చేస్తున్నాం.. వేతనం వస్తదా?

- టీవీవీపీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన
- కొనసాగింపు ఉత్తర్వుల్లో రెండు నెలలుగా జాప్యం

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : 'తమ ఒప్పంద సేవలను కొనసాగిస్తూ ఇప్పటివరకు ఉత్తర్వులు రాలేదు. అయినా రెండు నెలలుగా పని చేస్తున్నాం. మాకు జీతం వస్తుందా? లేదా? అని వైద్యశాఖలోని టీవీవీపీ పరిధిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన ఇది. టీవీవీపీ(తెలంగాణ వైద్య విధాన పరిషత్)పరిధిలో దాదాపు 6 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈసీజీ, ఎక్స్‌రే టెక్నీషియన్లు, డ్రైవర్లు, ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వో, బార్బర్లు.. ఇలా పలు విభాగాల్లో వీరు విధులు నిర్వహిస్తున్నారు. ఏటా మార్చి నుంచి మార్చి వరకు వీరి ఒప్పందాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుంది. అయితే, ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వం వీరి ఒప్పందాన్ని పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇవ్వలేదు. గతంలో ఈ విషయాన్ని వైద్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఎన్నికల వేళ సాధ్యం కాదంటూ.. పాత ఒప్పందాన్ని మరో మూడు నెలలు పొడిగించారు. జూన్‌తో ఇది కూడా ముగిసింది. దీంతో రెండు నెలలుగా ఉద్యోగులు ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే విధుల్లో కొనసాగుతున్నారు. రెండు నెలలుగా వీరికి వేతనాలు కూడా అందలేదు. ఎలాంటి ఉత్తర్వులు లేకున్నా పనిచేస్తున్నామని, ఈ రెండు నెలల జీతం ఇస్తరో లేదోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

> **16ఏండ్లుగా పని చేస్తున్నాం**
>
> రాష్ట్రవ్యాప్తంగా 16 ఏండ్లుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా కొనసాగుతున్నాం. ఈ సంవత్సరం ఇంకా ఆర్డర్ రాకపోవడంతో అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి. తమకు రావాల్సిన రెండు నెలల పెండింగ్ వేతనం ఇవ్వాలి.
>
> – బైరపాక శ్రీనివాస్, యూఎంహెచ్‌ఈయూ రాష్ట్ర కార్యదర్శి

దవాఖానల్లో సరిపడా డెంగ్యూ కిట్లు

- వైద్యశాఖ వివరణ

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో డెంగ్యూ పరీక్షల కోసం దవాఖానల్లో సరిపడా కిట్లు ఉన్నాయని డీజీ ఎంఎస్‌ఐడీసీ తెలిపింది. 'జ్వరాలతో చస్తున్నా పట్టించుకోరా?' శీర్షికన గురువారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన వార్తకు వైద్యశాఖ వివరణ ఇచ్చింది. ఇప్పటి వరకు 12.82 లక్షల డెంగ్యూ టెస్టింగ్ కిట్లను దవాఖానలకు పంపిణీ చేశామని తెలిపింది. సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. సీఎంఎస్‌లలో నిల్వలు కూడా ఉన్నాయని పేర్కొంది. దీంతో పాటు డీఎంఈ, డీపీహెచ్, టీవీవీపీ పరిధిలోని దవాఖానలు తమకు కేటాయించిన బడ్జెట్ నుంచి కావాల్సిన మందులు కొనుగోలు చేస్తున్నాయని వివరించింది.

జనగామ యూత్ కాంగ్రెస్‌లో వర్గపోరు



జనగామలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా కట్టిన ఫ్లెక్సీని చింపేసిన ప్రత్యర్థి వర్గం

జనగామ చౌరస్తా, ఆగస్టు 30: జనగామ యూత్ కాంగ్రెస్‌లో వర్గపోరు భగ్గుమన్నది. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభిగౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు లొక్కుంట్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలతో ఏర్పాటుచేసిన ఈ ఫ్లెక్సీని ప్రత్యర్థి వర్గ నాయకులు చింపివేశారు. శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ విషయంపై అభిగౌడ్, ప్రవీణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ చామలకు వస్తున్న ప్రజాదరణను చూసి ప్రత్యర్థివర్గం నాయకులు తట్టుకోలేక ఫ్లెక్సీలను చింపుతున్నారని తెలిపారు. గతంలో పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పుట్టినరోజు వేడుకల సందర్భంగా కూడా తాము ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను ఇదేవిధంగా ప్రత్యర్థివర్గం నాయకులు చింపినట్టు పేర్కొన్నారు. అనంతరం జరిగిన ఘటనపై జనగామ అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యర్థి వర్గం నాయకులపై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

సలహాదారులుగా తెలంగాణేతరులు

కీలకశాఖల్లో ఇతర ప్రాంతాల వారి నియామకం

రాష్ట్రేతరులకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): కొత్తగా ఏర్పడిన తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ వారికే కీలక బాధ్యతలు అప్పగించింది. కానీ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర రాష్ట్రాల వారికి బాధ్యతలు అప్పగిస్తున్నది. ఇందుకు తాజా ఉదాహరణ తెలంగాణ పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి సంస్థ (టీజీ రెడ్కో). దీనికి వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉద్యమకారుడైన జానయ్య ఉండేవారు. ఆయన పదవీ విరమణ చేసినప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం ఎక్స్‌టెన్షన్ ఇచ్చింది. ఇటీవల జానయ్య స్థానంలో విజయవాడకు చెందిన వావిల్ల అనిలను నియమించారు. ఆమె డీఈ స్థాయి అధికారిణి. కేసీఆర్ హయాంలో రెడ్కో సహా విద్యుత్తు పంపిణీ, ఉత్పత్తి సంస్థల్లో శాఖల అధిపతులందరూ తెలంగాణవారే ఉండేవారు. ఇప్పుడు మొత్తం విద్యుత్తు శాఖ లో తెలంగాణ స్థానికత ఉన్నవారే లేరని ఉద్యోగులు చెప్తున్నారు. ప్రభుత్వంలోని కీలక మంత్రి సిఫారసు చేయడంతో ఆమెకు పదవి దక్కిందని చెప్తున్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆయా పదవులు పొందినవారిలో బయటి రాష్ట్రాలవారే ఎక్కువ మంది ఉన్నారు. అనిలవావిల్లను రెడ్కో వైస్‌చైర్మన్, ఎండీ నియమించగా.. అంతకుముందే శాసనసభ సలహాదారుగా సూర్యదేవర ప్రసన్నకుమార్ (ఈయన ఇప్పుడు ఏపీ అసెంబ్లీకి వెళ్లిపోయారు), నీటిపారుదల రంగ సలహాదారుగా ఏపీ మాజీ ప్రధానకార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, మరో సలహాదారుగా ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి శ్రీనివాస రాజు, రాష్ట్ర మీడియా, సమాచార సలహాదారుగా కర్రి శ్రీరాం తదితరులను నియమించారు.

అసిస్టెంట్ ఇంజినీర్స్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): టీజీ జెన్‌కోలో 339 అసిస్టెంట్ ఇంజినీర్స్ పోస్టుల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జూలై 14న ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలో నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలను https://tggenco.comలో అభ్యర్థులు చూసుకోవచ్చని టీజీ జెన్‌కో సీఎండీ శుక్రవారం తెలిపారు.

• రైతు చెవిలో మాఫీ పువ్వు



మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

NAMASTE TELANGANA


www.ntnews.com /ntdailyonline

శనివారం SATURDAY 31.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4

సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 87 ‖ వెల (Price) రూ.6.50

శనివారం, సూర్యోదయం: 6-02, సూర్యాస్తమయం: 6-31. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం కృష్ణ పక్షం తిథి: త్రయోదశి రాత్రి 3-41 వరకు. నక్షత్రం: పుష్యమి రాత్రి 5-56 వరకు. వర్జ్యం: లేదు. రాహుకాలం: ఉదయం 9-09 నుంచి ఉదయం 10-42 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 6-03 నుంచి ఉదయం 7-42 వరకు. అమృతకాలం: పగలు 12-47 నుంచి పగలు 2-30 వరకు. శని త్రయోదశి.

• దవాఖానలో పశువులు



కుటుంబం సాకుగా రుణమాఫీ చేయకపోవడాన్ని నిరసిస్తూ జగిత్యాల జిల్లా వెల్లుల్లలో చెవిలో పూలతో కుటుంబ ధ్రువీకరణ పత్రాన్ని అధికారులకు అందజేస్తున్న రైతు మారు మురళీధర్‌రెడ్డి

ఒక్కరోజే ఎన్ని సమస్యలో...

రాష్ట్రమంతా డెంగ్యూ ప్రబలి ప్రైవేటు దవాఖానల్లో బెడ్లు కూడా దొరకని పరిస్థితి ఉండగా.. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ సర్కారు దవాఖానలో ఇట్ల పశువులు తిరుగుతున్నయ్



• పోరుబాటలో రైతన్న పాదయాత్ర

రుణమాఫీ పేరుతో తమకు జరిగిన అన్యాయంపై ఆదిలాబాద్ రైతులు పోరుబాట పట్టారు. తాంసి మండలం కప్పర్ల నుంచి పాదయాత్ర చేపట్టిన రైతులు మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు.



• వానకాలం వరి కూడా ఎండిపాయె!

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలో కరువు ఛాయలు నెలకొన్నాయి. ఎస్సారెస్పీ కాలువల ద్వారా ప్రభుత్వం చెరువులు నింపకపోవడంతో ఎండిన వరి పైరును చూపుతున్న మర్రికుంట తండా రైతు బానోతు యాకూబ్.

• గృహజ్యోతికి బిల్లుల మోత



అన్ని అర్హతలున్నా, గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్నా ఆరునెలలుగా కరెంటు బిల్లులు వస్తూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు జగిత్యాల పట్టణానికి చెందిన బీడీ కార్మికురాలు ఎనగంటి మౌనిక. ఇప్పుడు ఆరు నెలల కరెంట్ బిల్లులు ఒక్కసారే కట్టాలంటూ ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు.

• ఎరువుల కోసం బారులు



యూరియా కోసం అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద 40 గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం యూరియా కూపన్ల కోసం ఇలా బారులు తీరారు. రోజంతా క్యూలో నిలబడితే ఆధార్ కార్డుకు 5 యూరియా బస్తాలే ఇస్తున్నారని వారు వాపోయారు.

• పేదల బస్తీపైకి రేవంత్ బుల్డోజర్



ఓవైపు అధికారపార్టీ నేతలకు నోటీసులతో సరిపెడ్తున్న హైడ్రా పేదల ఇండ్లపైకి మాత్రం బుల్డోజర్లను తోలుతున్నది. శుక్రవారం హైదరాబాద్ లోని రాంనగర్ మణెమ్మ బస్తీపైకి బుల్డోజర్లు విరుచుకు పడ్డాయి. ఆక్రమణల సాకు చూపి నివాసాలను కూల్చివేశాయి.



• వసతిగృహంలో పురుగుల అన్నం

రంగారెడ్డి జిల్లా పాలమాకుల కస్తూర్బా గాంధీ హాస్టల్ విద్యార్థులు శుక్రవారం రోడ్డెక్కారు. 'పురుగుల అన్నం పెడుతున్నరు. అడిగితే కొడుతున్నరు' అని విద్యార్థులు వాపోయారు.

హామీలు ఘనం.. అమలు మోసం - ప్రజలు ఆగం.. తెలంగాణ ఆగమాగం

కాంగ్రెస్‌పై కేసీఆర్ కదన భేరి!

9 నెలల్లోనే రాష్ట్రం పరిస్థితి ఉల్టాపల్టా

- పోరాడి సాధించిన తెలంగాణ ఈనగాచి నక్కలపాలా? పదేండ్ల కృషి గంగపాలా?
- సిరుల పంటల రాష్ట్రంలో రైతుకంట కన్నీరా? దళితుల నోటికాడి కూడు లాగేస్తారా?
- బషీర్‌బాగ్ కాల్పులు మరిచి, మళ్లీ ప్రపంచబ్యాంకు ముందు సర్కారు మోకరింపా?
- ఇక మీరు రంగంలోకి దూకక తప్పదు.. గ్యారెంటీలపై ప్రభుత్వం మెడలు వంచాలి
- కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ సీనియర్ల వినతి.. సూత్రప్రాయంగా అంగీకరించిన అధినేత
- సెప్టెంబర్ 10 తర్వాత సమాలోచన.. తెలంగాణ ఉద్యమ తరహాలో కార్యాచరణ



హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు, తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసంపై బీఆర్‌ఎస్ త్వరలోనే యుద్ధ భేరి మోగించనున్నదా? తెలంగాణ ఉద్యమం తరహాలో పెను కార్యాచరణను తీసుకోనున్నదా? మోసపోయి గోసపడుతున్న తెలంగాణ ప్రజల కోసం వినూత్న పోరాట రూపాలను తీర్చిదిద్ది, కేసీఆర్ స్వయంగా ముందుండి పాల్గొననున్నారా? పార్టీలో ఇప్పుడు ఈ చర్చే జరుగుతున్నది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఇచ్చిన సమయం ఇక చాలని, ఇంకా చూస్తూ కూర్చుంటే తెలంగాణ కుప్పకూలే ప్రమాదం ఉన్నదని బీఆర్‌ఎస్ సీనియర్లు ఇప్పటికే కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. 'మీరు తెచ్చిన తెలంగాణ ఆగమైపోకుండా ఉండేందుకు మీరే స్వయంగా రంగంలోకి దిగాల్సిన తరుణం ఆసన్నమైంది. కాంగ్రెస్ మెడలు వంచి హామీలు అమలు చేయించాల్సిన, ప్రజలకు ఊరట కలిగించాల్సిన సమయం వచ్చింది. ఇంకా మనం మౌనం వహించడాన్ని ప్రజలు ఆమోదించడం లేదు'' అని సీనియర్లు కేసీఆర్‌కు విన్నవించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఒకప్పుడు కేసీఆర్‌తో కొంత విభేదించిన పలువురు మేధావులు కూడా బహిరంగంగానే, కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండె, ఆయన రంగంలోకి దిగితే తప్ప కాంగ్రెస్ సర్కారు కదిలేలా › 2వ పేజీలో

ఇదేం సర్కార్ ఇదేం పాలన!

కేసీఆర్ మళ్లీ వస్తే మంచిగుండు!

కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల మనసులో మాట

పరిపాలనలో ప్రభుత్వం విఫలమైందని ఆవేదన

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): మెదక్‌లో పనిచేస్తున్న ఒక ఐపీఎస్ అధికారిని ప్రభుత్వం హైదరాబాద్‌కు బదిలీ చేసింది. ఆయన భార్య టీచర్. దీంతో ఆమెను కూడా హైదరాబాద్‌కు బదిలీ చేయాలని కోరుతూ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయం వరకు చెప్పులు అరిగేలా తిరిగారు. ఆలిండియా ఆఫీసర్స్ రూల్స్ ప్రకారం ఇలా చేయడానికి అవకాశం ఉన్నది. అయినప్పటికీ నెలలు గడుస్తున్నా పని కావడం లేదు. ఒక ఐపీఎస్ అధికారికే ఈ పరిస్థితి ఎదురైతే ఇక సామాన్యుడి పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో సొంత పార్టీ నేతలే ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. 'మళ్లా కేసీఆర్ పాలనొస్తే మంచిగుండు'.. అని నిట్టూరుస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాన్ని అతి దగ్గర్నుంచి › 2వ పేజీలో

కేసీఆర్ డబ్బును ప్రేమించడు

- డబ్బు కోసం రాజకీయం చేయడు.. కేసీఆర్ చాలామందికి అర్థంకాడు
- ఆయన తత్వాన్ని నేను గ్రహించా.. పార్టీ పెట్టినప్పుడు కూడా పైసా లేదు
- సిద్ధాంతాన్ని నమ్మి పనిచేస్తాడు.. 'నమస్తే తెలంగాణ'తో గాదె ఇన్నయ్య › 2

ఎస్సీ, ఎస్టీల దగ్గర ఇట్లనే వాసనొస్తది!

ఉపాధ్యాయులు మమ్మల్ని ఎగతాళి చేస్తున్నరు › 3

పాలమాకుల కస్తూర్బాగాంధీ విద్యార్థుల ఆందోళన

యాదగిరిగుట్టకు టెంపుల్ బోర్డు

టూరిజం అభివృద్ధి కోసం › 5

కొత్త పాలసీకి సీఎం ఆదేశం

గర్ల్స్‌హాస్టల్ వాష్‌రూమ్‌లో సీక్రెట్ కెమెరా!

300 ఫొటోలు, వీడియోలు లీక్

ఏపీలోని గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో ఘటన › 9

బీటెక్ ఫైనలియర్ విద్యార్థి అరెస్ట్



ఆదర్శనగర్ నిర్వాసితుడికి భోజనం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

పెద్దోళ్లను వదిలి పేదలపై పడ్తరా?

సామాన్లు తీసుకునే సమయం ఇవ్వలే.. అర్ధరాత్రి కాలనీ కూల్చేస్తరా?

మానవత్వం లేని కాంగ్రెస్ సర్కార్: మాజీమంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వం మరిచి వ్యవహరిస్తున్నదని, అంధులని కూడా చూడకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా మహబూబ్‌నగర్‌లో వారి ఇండ్లను కూల్చివేసిందని మాజీమంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ప్రభుత్వం పేదల విషయంలో ఒకలా, పెద్దల విషయంలో మరోలా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ సమాజం తలదించుకునేలా ప్రవర్తిస్తున్నదని › 5వ పేజీలో

స్పోర్ట్స్ వెంచర్ కూల్చివేత బాధ కలిగించింది

కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు ఆవేదన › 5

హైడ్రా.. ఇటు చూడు

చెరువులో కాంగ్రెస్ నేత వెంచర్





శ్రీశైలం హైవే పక్కనున్న సూరం చెరువును ఆక్రమించి నిర్మిస్తున్న కేఎల్‌ఆర్ వెంచర్. ఆక్రమణలతో చెరువు నుంచి కాలనీల్లోకి ప్రవహిస్తున్న వరదనీరు

- శ్రీశైలం హైవే పక్కన సూరం చెరువు సగం మాయం
- చెరువును ఆక్రమించి వెలిసిన 'వర్టెక్స్-కేఎల్‌ఆర్ గిగా'
- మొత్తం 60.32 ఎకరాల్లో ఉండాల్సిన చెరువు.. కబ్జాలతో క్రమంగా కుంచించుకుపోయిన పరిధి
- వరద మార్గంలోనూ డ్రెయిన్ బాక్సులతో నిర్మాణం
- నేటికీ ఎఫ్‌టీఎల్ నిర్ధారించి, ఐడీ ఇవ్వని ఇరిగేషన్ శాఖ
- మొగ్గ దశలోనే ఆక్రమణలను అధికారులు అరికడ్తరా?

మహేశ్వరం, ఆగస్టు 30 : అదెక్కడో మారుమూలన ఉన్న చెరువు కాదు.. సిటీకి దగ్గరలోనే శ్రీశైలం హైవేను ఆనుకొని ఉన్న 60ఎకరాల చెరువు. అదికాస్తా ఇప్పుడు సగానికి పైగా కుచించుకుపోయింది. దానికి వచ్చే వరద మార్గంలోనూ కాంక్రీట్ జంగల్ వెలసింది. అయినా ఇటువైపు నీటిపారుదల శాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. 60.32 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉండాల్సిన ఈ చెరువు ఎఫ్‌టీఎల్‌ను కూడా గుర్తించలేదు. తమ కళ్లెదుటే అక్కడ దర్జాగా వెంచర్ వెలుస్తున్నా స్పందించిన దాఖలాల్లేవు. ఇంతకీ ఇక్కడ వెంచర్‌ను ముందుగా చేసిందెవరంటే.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి › 5వ పేజీలో

మట్టిని కొట్టి.. సౌధాలు కట్టి!

- పొంగులేటి గుట్టు విప్పిన గూగులమ్మ
- 2011తో పోలిస్తే స్పష్టంగా కనిపిస్తున్న ఉల్లంఘనలు
- కేవీపీ ఫాంహౌస్‌లోనూ విస్తృతంగా నిర్మాణాలు
- టిప్పర్లతో భారీ ఎత్తున మట్టి నింపి ఆక్రమణలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): 2011-2024 గూగుల్ మ్యాప్‌లను పోలిస్తే భారీ నిర్మాణాలు పెరగడం ఒకవంతైతే.. హిమాయత్‌సాగర్ జలాశయం ఎఫ్‌టీఎల్ కుచించుకుపోయినట్టుగా స్పష్టమవుతున్నది. అంటే ఒక్కోచోట వందలాది టిప్పర్లతో భారీ ఎత్తున సాగరంలో మట్టిని నింపి దాని గొంతు నులిమే ప్రయత్నం చేశారనేది అర్థమవుతున్నది. కానీ, ఇప్పుడు నీటి నిల్వ › 5వ పేజీలో

నన్ను మన్నించండి



సుప్రీంకోర్టును బేషరతుగా క్షమాపణ కోరిన సీఎం

ధర్మాసనం చీవాట్లతో దిగివచ్చిన రేవంత్‌రెడ్డి

తన మాటలను మీడియా వక్రీకరించిందని వ్యాఖ్య

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై అడ్డగోలు వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. సుప్రీంకోర్టు ధర్మాసనం దెబ్బకు దిగివచ్చారు. మేం రాజకీయ నాయకులను సంప్రదించి ఆదేశాలు ఇస్తామా?. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి బాధ్యత లేకుంటే ఎలా? అంటూ గురువారం ధర్మాసనం చీవాట్లు పెట్టడంతో సీఎం నాలుక కరుచుకున్నారు. సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్తూ శుక్రవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అయితే.. నేరుగా తప్పు › 6వ పేజీలో

కాబోయే సీఎం ఉత్తమ్‌కుమార్!

నా నాలుకపై మచ్చలున్నయ్.. › 6

నేను చెప్పానంటే అయితీరుతది

కోమటిరెడ్డి రాజగోపాల్ వ్యాఖ్యలు

ప్రమోషన్‌కు నేను రెడీ

ముఖ్యమంత్రి కావాలనే కోరిక లేకపోవడానికి నేనేమీ సన్యాసిని కాను › 7

కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర వ్యాఖ్యలు

నా ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర

ఎమ్మెల్యేలకు 100 కోట్ల ఆఫర్: సీఎం సిద్ధూ

ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై సర్కారు వివక్ష

- కాంగ్రెసేతర నియోజకవర్గాలకు నిధులివ్వరా?
- కుట్రతో ప్రజాభివృద్ధిని విస్మరించటం దుర్మార్గం
- మంజూరైన పనులకు నిధులాపొద్దు
- ఎస్డీఎఫ్ నిధులను సమానంగా విడుదల చేయాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్



"పంచాయతీరాజ్, మున్సిపల్, రోడ్లు, భవనాలు, నీటిపారుదల శాఖల పరిధిలో అభివృద్ధి పనులు నిలిచిపోయి మౌలిక సదుపాయాల కల్పనకు ఆటంకం కలుగుతున్నది. ఎంతో మంది ఉపాధి కోల్పోతున్నారు. 9 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి నిరోధక ఎజెండాతో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నది. -హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంపై కక్షతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుని కుట్రలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అభివృద్ధి కాంక్షను వదిలేసి, రాజకీయ కక్షతో ముందుకెళ్లడం సీఎం రేవంత్‌రెడ్డి దివాలాకోరు రాజకీయాలకు పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 33 జిల్లాల్లో రూ.10 వేల కోట్ల విలువచేసే 34,511 స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్డీఎఫ్) పనులను రద్దు చేయడమే ఇందుకు నిదర్శనమని ఉదహరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సర్కార్ తీరును తూర్పారబట్టారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా మంజూరైన అనేక పనులను ప్రభుత్వం నిలిపివేసిందని, ఇప్పటికే ప్రారంభమైన అనేక పనులను తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా కొనసాగించొద్దని మధ్యంతరంగా నిలిపివేస్తూ ఆదేశాలిచ్చిందని, దాదాపు పూర్తి కావస్తున్న ప్రాజెక్టులకు సైతం బిల్లులు చెల్లింపులు ఆపేసిందని విమర్శించారు. గ్రామంలో పంచాయతీరాజ్, మున్సిపల్, రోడ్లు, భవనాలు, నీటిపారుదల తదితర శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచిపోయాయని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు ఆటంకం ఏర్పడిందని, ఎంతో మంది ఉపాధి కూడా కోల్పోతున్నారని వివరించారు. 9 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి నిరోధక ఎజెండాతో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నదని మండిపడ్డారు.

గత ప్రభుత్వ అనవాళ్లు లేకుండా చేస్తానని కంకణం కట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, తన అనాలోచిత చర్యలతో తన అనవాళ్లనే ప్రజల్లో లేకుండా చేసుకుంటున్నారు -హరీశ్

కొత్త పనులు చేపట్టే శక్తిసామర్థ్యాలు లేవు

ఈ ప్రభుత్వానికి కొత్త పనులు చేపట్టే శక్తిసామర్థ్యాలు లేవని తేలిపోయిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మంజూరైన పనులను పూర్తిచేసే కనీస నైతిక బాధ్యత కూడా ఈ సర్కారుకు లేదని తాజా పనుల రద్దుతో మరింత స్పష్టమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలన ప్రజలకు శాపంగా మారిందని, సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి నిరోధకుడిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గాలకు కేటాయించిన ఎస్డీఎఫ్ నిధులను కాంగ్రెస్ రాగానే రద్దు చేసిందని, ఆ నిధుల నుంచే మార్చిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు మాత్రమే రూ.10 కోట్ల చొప్పున మంజూరు చేసి తన కపట బుద్ధిని, పక్షపాత వైఖరిని చాటుకున్నదని దుయ్యబట్టారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కక్షతో రూపాయి కూడా కేటాయించక పోగా ఉన్న పనులను సైతం నిధులు ఆపేసి రేవంత్ సర్కార్ దుర్మార్గానికి పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రద్దు చేసిన ఎస్డీఎఫ్ పనులకు సంబంధించి సీఎం ఒక సమీక్ష కూడా పెట్టలేదని, కలెక్టర్లు, అధికారులు సైతం ఎలాంటి సమీక్ష చేయలేదని, వివిధ దశల్లో ఉన్న పనులపై ప్రభుత్వానికి నివేదికను కూడా ఇవ్వలేదని తెలిపారు. గత ప్రభుత్వ ఆనవాళ్లు లేకుండా చేస్తానని కంకణం కట్టుకున్న సీఎం, తన అనాలోచిత చర్యలతో తన ఆనవాళ్లనే ప్రజల్లో లేకుండా చేసుకుంటున్నారని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్వార్థ పూరిత రాజకీయాలను పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. గత ప్రభుత్వంలో మంజూరైన పనులను తక్షణమే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే ఏపీకి రాష్ట్ర నిధులు

- తెలంగాణ ప్రయోజనాలు పట్టని కాంగ్రెస్
- 2,500 కోట్ల తెలంగాణ డబ్బు ఆంధ్రకు జమ
- దీనిపై బీజేపీ ఎందుకు స్పందించడం లేదు?
- బీఆర్‌ఎస్ నేత కార్తీక్‌రెడ్డి విమర్శలు



హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల తెలంగాణ ప్రభుత్వ కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి రూ.2500 కోట్లను ఏపీకి కేంద్రం బదలాయించిందని బీఆర్‌ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మాట్లాడుతూ కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే నిధుల అంశంలో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి తెలిసే జరిగిందా? లేదా? అని, ఏపీకి నిధులు పోవడం ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. పదేండ్లు కేసీఆర్‌పై ఏపీ ఒత్తిడి తెచ్చినా వారికి ఇవ్వలేదని, చంద్రబాబుతో రేవంత్‌రెడ్డికి ఉన్న సంబంధాలతోనే ఈ నిధులు ఏపీకి వెళ్లాయని తెలిపారు. రాజకీయ పార్టీలు స్పందించకముందే తెలంగాణ మీడియా స్పందించాల్సి ఉన్నా ఇంతవరకు స్పందించలేదని, రాష్ట్రానికి అన్యాయం జరిగితే మీడియా సంస్థలు కూడా ప్రశ్నించాలని సూచించారు. గతంలో తెలంగాణ నుంచి పొరపాటున ఏపీకి బదిలీ అయిన రూ.450 కోట్లను తిరిగి తెలంగాణకు రప్పించిన శక్తి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ కలయిక కేవలం కేసీఆర్‌ను రాజకీయంగా దెబ్బకొట్టేందుకేనని, రాష్ట్రానికి నిధులు తేవడంలో బీజేపీతో కాంగ్రెస్‌కు దోస్తీ ఉండదని ఎద్దేవాచేశారు. కేసీఆర్‌పై కోపాన్ని బీజేపీ నేతలు తెలంగాణపై చూపిస్తున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బీజేపీ బీ టీంగా పనిచేస్తున్నదని విమర్శించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏపీకి బడ్జెట్‌లో రూ.50 వేల కోట్లకు పైగా ఇచ్చి, తెలంగాణకు పైసా కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. హైడ్రా కూల్చివేతలు కేవలం గ్లాడియేటర్ మూవీ లాంటి స్క్రిప్ట్ మాత్రమేనని దుయ్యబట్టారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే హైడ్రాను ముందుకు తెస్తున్నారని, దానితో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని, ఓఆర్‌ఆర్ లోపలి పరిధి చెరువుల్లో కొన్నేండ్లుగా ఇండ్లు కట్టుకున్నవారు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్లియర్ చేస్తున్నదని, వీటిలో అనేకం బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని, వారంతా ఎల్‌ఆర్‌ఎస్ కడుతున్నారని, ఆ ఇండ్లను కూడా కూలుస్తారా? అని నిలదీశారు.

ఎస్సీ, ఎస్టీల దగ్గర ఇట్లనే వాసనొస్తది

- ఉపాధ్యాయులు ఇలానే కించపర్చుతున్నరు
- ఆందోళనకు దిగిన కస్తూర్బా గాంధీ విద్యార్థులు

హైదరాబాద్ (శంషాబాద్ రూరల్), ఆగస్టు 30: ఎస్సీ, ఎస్టీల దగ్గర ఇలాగే వాసనొస్తదని ఉపాధ్యాయులు అన్నట్టు విద్యార్థులు చెప్పారు. తమ కులాన్ని కించపరిచేలా వ్యాఖ్యానిస్తున్నారని మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలోని కస్తూర్బాగాంధీ హాస్టల్ విద్యార్థులు శుక్రవారం నడిరోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ 'పురుగుల అన్నం పెడుతున్నరు. ఇదేమిటని ప్రశ్నిస్తే కొడుతున్నరు. మంచి నీళ్లు కావాలని అడిగితే మీకు ఇవే ఎక్కువ అంటున్నరు. ఉపాధ్యాయులు మాత్రం మంచి కూరలు వండుకొని తింటున్నరు. మేము అడిగితే ఇంటి నుంచి తెచ్చుకోమంటున్నరు. దుస్తులు ఒక జత మాత్రమే ఇచ్చారు. ఇంకో జత అడిగితే ఇదే ఎక్కువ అంటున్నరు. ఇచ్చిన జతనే రోజు ఉతుక్కోవాలని లేకుంటే వాసనొస్తుందని అంటున్నరు. అయినా ఎస్సీ, ఎస్టీల దగ్గర ఇట్లనే వాసనొస్తదని కించపర్చుతున్నరు' అని పేర్కొన్నారు. హాస్టల్‌లో దాదాపు 370 మంది విద్యార్థులు ఉన్నారని, వంట కోసం వచ్చే సరుకులను ఉపాధ్యాయులు పంచుకుటున్నారని విద్యార్థులు ఆరోపించారు. తమ సమస్యలను ప్రభుత్వం ఇప్పటికైనా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళన గురించి తెలుసుకున్న శంషాబాద్ రూరల్ సీఐ అక్కడికి చేరుకున్నారు. అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. సమస్యలపై స్పందించిన రంగారెడ్డి డీఈవో సుశీధర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు న్యాయం చేస్తానని, సమస్యలన్నీ పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కాగా, శుక్రవారం హాస్టల్‌కు ఓ ఆటో వచ్చినప్పుడు గేటు తెరువడంతో విద్యార్థులు బయటికి వచ్చి రోడ్డుపై ఆందోళన చేయడం వారి దీనస్థితిని తెలియజేస్తున్నది. ఒకవేళ గేటు తెరువకపోతే వారి సమస్యలు ఇంకా బయటికి వచ్చేవి కావు.

ఎక్కడివారు అక్కడే..

- కోర్టు కేసుల గురుకుల టీచర్లకు ఉపశమనం

హైదరాబాద్, ఆగస్టు30 (నమస్తే తెలంగాణ): కోర్టు కేసుల్లో ఉన్న టీచర్లు, ఉద్యోగులను వారివారి స్థానాల్లోనే యథావిధిగా కొనసాగించాలని ప్రిన్సిపాల్స్‌కు ఎస్సీ గురుకుల సొసైటీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రిలీవ్ చేసిన వారిని తిరిగి చేర్చుకోవాలని స్పష్టంచేశారు. 317 జీవో టీచర్లు, మెరిట్ ఆధారంగా డిస్‌లొకేట్ అయిన, అదేవిధంగా సీనియార్టీ జాబితాల్లోని తప్పులతో జోన్లు మారిన ఎస్సీ గురుకుల సొసైటీ ఉపాధ్యాయులు పలువురు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. సొసైటీ ఉత్తర్వులపై సదరు టీచర్లు హర్షం వ్యక్తం చేశారు.


పాలమాకుల గురుకులంపై సీఎం స్పందించాలి

- తరగతి గదిలో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డెక్కారు
- వారి ఆవేదనను మానవత్వంతో అర్థం చేసుకోండి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆందోళన
- అర్ధాకలితో చిన్నారులు అలమటిస్తున్నారని ఆవేదన

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రావాలి.. మా సమస్యలు తీర్చాలి.. అంటూ రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల కస్తూరిబా గురుకుల విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. నడి రోడ్డెక్కి నినదించిన వారి ఆవేదనను మానవత్వంతో అర్థం చేసుకోండి.. విద్యాశాఖ కూడా ముఖ్యమంత్రి వద్దే ఉన్నది.. గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలి.. అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. పరిపాలన మీద దృష్టి సారించి, ప్రజల సమస్యలను పట్టించుకోవాలని హితవు పలికారు. తరగతి గదిలో చదువుకోవాల్సిన విద్యార్థులు, నడిరోడ్డుపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తంచేశారు. గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. గురుకులాల అధ్వాన పరిస్థితుల గురించి ప్రతిపక్షంగా తాము ఎన్నిసార్లు చెప్పినా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి చీమకుట్టినట్టయినా ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సారొస్తారా.. అని ఎదురుచూస్తున్న విద్యార్థులకు తీవ్ర నిరాశే మిగులుతుందని శుక్రవారం మీడియాలో వచ్చిన కథనాన్ని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు లేక, విద్యా వలంటీర్లను నియమించక ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయని, తరగతి గదుల్లో కూర్చొని పాఠాలు నేర్చుకోవాల్సిన పిల్లలు, బడికి దూరమవుతున్నారని తెలిపారు. విద్యాశాఖను కూడా నిర్వహిస్తున్న సీఎంకు ఇవేవీ పట్టడం లేదని విమర్శించారు.


భోజనానికి 37 రూపాయలేనా?

- గురుకులాల డైట్ చార్జీలను వెంటనే పెంచాలి
- సీఎంకు గురుకులాలపై కనీస అవగాహన లేదు
- కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి
- విద్యార్థులు, యువత, రైతులకు అన్యాయం
- ప్రజాపాలన కాదు.. ప్రతీకారపాలన : ఆర్‌ఎస్పీ



హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : గురుకులాలకు ఇప్పటికీ యూనిఫాంలు, రగ్గులు, షూలు, స్పోర్ట్స్ డ్రెస్సులు అందలేదని, జైల్లో ఒక్కో ఖైదీ ఆహారానికి రోజుకు రూ.83 చెల్లిస్తుంటే, గురుకుల విద్యార్థికి మాత్రం రోజుకు రూ.37 మాత్రమే చెల్లిస్తున్నారని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా గురుకులాలకు వెంటనే డైట్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నేత అభిలాషరావుతో కలిసి తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తొమ్మిది నెలలుగా విద్యాశాఖకు మంత్రి లేడని, ఆ శాఖ సీఎం వద్దే ఉన్నా ఎప్పుడైనా సమీక్ష చేశారా? అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.5,900 కోట్లు ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు కట్టకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు మెమోలు ఇవ్వడం లేదని, రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సంవత్సరంతో కలిపితే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8350 కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. రూ.5 లక్షలతో 'విద్యార్థి భరోసా' అమలు చేస్తామని చెప్పారనీ, ఇప్పటికీ అతీగతీ లేదని దుయ్యబట్టారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి పాఠశాల స్థాయిలో ఇస్తామన్న రూ.10 వేలు ఏవని? రాష్ట్రంలో నడిచేది ప్రజాపాలన కాదని, విద్యార్థులు, యువత, రైతులు, మహిళలందరిపై ప్రతీకారపాలన కొనసాగుతున్నదని విమర్శించారు. పాఠశాలల్లో అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజనాన్ని పెట్టాలనే నిర్ణయాన్ని, బ్రహ్మకుమారీస్‌తో బోధించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో ధార్మిక సంస్థల నియామకం రాజ్యాంగ వ్యతిరేకమని చెప్పారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో పనిచేస్తున్న అధ్యాపకులకు నాలుగు నెలలుగా వేతనాలు లేవని, స్పోర్ట్స్ అకాడమీలో పనిచేస్తున్న వారికీ వేతనాలు రావడంలేదని తెలిపారు. సీఎం అమెరికా టూర్ మనీ లాండరింగ్‌లా ఉన్నదని ఆరోపించారు. లండన్‌కుపోతే థేమ్స్ నది ఒక్కటే కాకుండా అక్కడ ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాలయాలున్నాయని, వాటిని ఎందుకు సందర్శించలేదని ప్రశ్నించారు.

- **కవిత పరువుకు భంగం కలిగేలా పోస్టులా?**



ఎమ్మెల్సీ కవిత పరువుకు భంగం కలిగేలా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారిక సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ సైబర్ క్రైం డీసీపీకి ఫిర్యాదు చేశారు. ఈ పోస్టులకు టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ చైర్మన్ సామ రాంమోహన్‌రెడ్డిదే బాధ్యత అని, ఆయనపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

భారత్ పతక ధమాకా

పారాలింపిక్స్‌లో భారత్‌కు ఒకేరోజు 4 పతకాలు

మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో అవనికి స్వర్ణం ● మోనా అగర్వాల్‌కు కాంస్యం

రజతంతో మెరిసిన మనీశ్ నర్వాల్ ● అథ్లెటిక్స్‌లో ప్రీతి పాల్‌కు కాంస్యం



పారాలింపిక్స్‌లో రెండో రోజు భారత్ పతకాల పంట పండించింది. పారిస్ వేదికగా జరుగుతున్న ఈ క్రీడలలో భారత్ ఒకే రోజు నాలుగు పతకాలతో సత్తా చాటింది. షూటింగ్ విభాగంలో మన పారా షూటర్లు గంటల వ్యవధిలోనే మూడు పతకాలు సాధించగా అథ్లెటిక్స్‌లోనూ భారత్ బోణీ కొట్టింది. టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణంతో మెరిసిన యువ షూటర్ అవని లేఖరా 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో తన పతకాన్ని నిలబెట్టుకోగా ఇదే క్రీడాంశంలో మోనా అగర్వాల్ మూడో స్థానంతో కంచు మోత మోగించింది. యువ పారా అథ్లెట్ ప్రీతి పాల్ వంద మీటర్ల పరుగు పందెంలో చిరుతలా దూసుకొచ్చి కాంస్యం దక్కించుకుంది. పురుషుల పది మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో మనీశ్ నర్వాల్ రజతం సాధించడంతో భారత్‌కు ఒకే రోజు 4 పతకాలు దక్కాయి.

పారిస్: పారాలింపిక్స్ తొలి రోజు పలు క్రీడాంశాలలో శుభారంభం చేసిన భారత పారా క్రీడాకారులు రెండో రోజు పతకాల పంట పండించారు. షూటింగ్‌లో మన షూటర్లు స్వర్ణం, రజతం, కాంస్యం సాధించి మూడు పతకాలతో మెరవగా అథ్లెటిక్స్‌లోనూ భారత్ బోణీ కొట్టింది. పది మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ (ఎస్‌హెచ్1 కేటగిరీ)లో భారత యువ పారా షూటర్ అవని లేఖరా వరుసగా రెండో స్వర్ణంతో మెరిసింది. మూడేండ్ల క్రితం టోక్యో వేదికగా ముగిసిన పారాలింపిక్స్‌లోనూ ఇదే ఈవెంట్‌లో గోల్డ్ మెడల్ కొట్టిన అవని.. తాజాగా పారిస్‌లోనూ ఆ ప్రదర్శనను పునరావృతం చేసింది. 249.7 పాయింట్లు స్కోరు చేసిన అవని టోక్యో రికార్డు (249.6)ను అధిగమించింది. స్టేజ్ 1లో పదికి పది షాట్లలో ప్రతి షాట్‌ను లక్ష్యానికి గురిపెట్టిన అవని.. స్టేజ్ 2లో 14 షాట్లలో ఒక్క షాట్‌ను మాత్రమే 9.9 పాయింట్లు స్కోరు చేసింది. పారాలింపిక్స్‌లో అవనికి ఇది మూడో పతకం కావడం విశేషం. టోక్యోలో 10మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో స్వర్ణం గెలిచిన ఆమె 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ లోనూ కాంస్యం నెగ్గింది.

మోనాకు కాంస్యం..



అవని స్వర్ణం గెలిచిన ఈవెంట్‌లోనే మరో భారత్‌కు డబుల్ ధమాకా దక్కింది. షూటర్ మోనా అగర్వాల్ కాంస్యంతో మెరవడంతో పోడియంపై మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 228.7 పాయింట్లతో మోనా కాంస్య పతకాన్ని దక్కించుకుంది. కొరియా అమ్మాయి లీ యున్రి 246.8 పాయింట్లతో రజతం గెలుచుకుంది.

ప్రీతి పాల్‌కు మూడో స్థానం



మహిళల వంద మీటర్ల (టీ35 విభాగం) ఈవెంట్‌లో భారత పారా అథ్లెట్ ప్రీతి పాల్ కాంస్యం నెగ్గింది. ప్రఖ్యాత స్టేట్ డి ఫ్రాన్స్ స్టేడియం వేదికగా జరిగిన రేసులో 23 ఏండ్ల ప్రీతి.. రేసును 14.21 సెకన్లలో పూర్తిచేసి పారిస్‌లో భారత అథ్లెటిక్ బృందం తరఫున తొలి పతకాన్ని అందించింది. యూపీలోని ముజఫర్‌నగర్‌లో సామాన్య రైతు కుటుంబానికి చెందిన ప్రీతి.. చిన్ననాటి నుంచే శారీరకంగా అనేక సవాళ్లను ఎదుర్కొంది. ఇవే క్రీడల్లో ఆమె 200 మీటర్ల ఈవెంట్‌లోనూ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది.

నాలుగో పతకం తెచ్చిన మనీశ్ నర్వాల్




పారాలింపిక్స్‌లో శుక్రవారం భారత్‌కు అమ్మాయిలే మూడు పతకాలు అందించగా నాలుగో పతకాన్ని మనీశ్ నర్వాల్ తీసుకొచ్చాడు. పురుషుల పది మీటర్ల ఎయిర్ పిస్టల్ (ఎస్‌హెచ్1 కేటగిరీ) ఈవెంట్‌లో మనీశ్ రజతంతో మెరిశాడు. ఈ పోటీలలో 234.9 పాయింట్లు స్కోరు చేసిన అతడు రెండో స్థానంలో నిలిచాడు. కొరియాకు చెందిన జొ జియోన్‌డ్డు 237.4 పాయింట్లతో స్వర్ణం గెలవగా చైనా షూటర్ యంగ్ చావొ 214.3 స్కోరుతో కాంస్యం నెగ్గాడు. స్టేజ్ 2లో చివరిదాకా అగ్రస్థానంలో ఉన్న నర్వాల్.. ఆఖర్లో గురి తప్పడంతో తృటిలో పసిడి పతకాన్ని కోల్పోవాల్సి వచ్చింది.

3 పారాలింపిక్స్‌లో అవనికి ఇది మూడో పతకం. టోక్యోలో ఆమె స్వర్ణం, కాంస్యం సాధించింది.

అల్కారజ్ ఔట్

ఒసాకాకూ షాక్

యూఎస్ ఓపెన్‌లో సంచలన ఫలితాలు



న్యూయార్క్: సీజన్ ఆఖరి గ్రాండ్‌స్లామ్ అయిన యూఎస్ ఓపెన్‌లో ఐదో రోజు సంచలన ఫలితాలు వెలువడ్డాయి. టైటిల్ ఫేవరేట్లలో ఒకడిగా ఉన్న టాప్ సీడ్ కార్లోస్ అల్కారజ్‌కు రెండో రౌండ్‌లోనే షాక్ తగిలింది. మూడో సీడ్‌గా బరిలోకి దిగిన ఈ స్పెయిన్ కుర్రాడు పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో 1-6, 5-7, 4-6తో బొటిక్ వాన్ డి (నెదర్లాండ్స్) చేతిలో పరాభవం పాలయ్యాడు. తొలి సెట్ నుంచే లయ కోల్పోయిన అల్కారజ్.. బొటిక్ బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్ల ముందు తేలిపోయాడు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టైటిల్స్ నెగ్గడంతో పాటు ఒలింపిక్స్‌లోనూ రజతం సాధించిన అల్కారజ్.. యూఎస్ ఓపెన్‌పై కన్నేసినా అతడికి నిరాశ తప్పలేదు. ఇతర మ్యాచ్‌లలో డేనియల్ మెద్వెదెవ్ (రష్యా) 6-3, 6-2, 7-6 (5/7)తో ఫాబియన్ మరొజన్ (హంగేరి)ని ఓడించగా జన్నిక్ సిన్నర్ (ఇటలీ), టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా), డాన్ ఎవాన్స్ (బ్రిటన్) తమ ప్రత్యర్థులను ఓడించి మూడో రౌండ్‌కు చేరారు.

ఒసాకాకు షాక్

మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో మాజీ చాంపియన్ నవొమి ఒసాకా (జపాన్) 3-6, 6-7 (5/7)తో కరొలినా ముచొవ (చెక్ రిపబ్లిక్) చేతిలో పరాభవం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఎలీనా రిబాకినా (కజకిస్థాన్) గాయం కారణంగా పోటీ నుంచి తప్పుకుంది. కరొలిన్ వొజ్నియాకి (డెన్మార్క్), ఇగా స్వియాటెక్ (పోలండ్), జాస్మిన్ పాలోని (ఇటలీ) మూడో రౌండ్‌కు చేరారు.

అట్కిన్సన్ ఆల్‌రౌండ్ షో

● పట్టు బిగిస్తున్న ఇంగ్లండ్



లండన్: సొంతగడ్డపై శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో ఆతిథ్య జట్టు రెండో రోజూ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఓవర్‌నైట్ స్కోరు 74తో రెండో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన ఇంగ్లండ్ లోయరార్డర్ ఆటగాడు గస్ అట్కిన్సన్ (118) సెంచరీతో మెరవడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 427 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన శ్రీలంక.. 55.3 ఓవర్లలో 196 పరుగులకే ఆలౌట్ అయింది. ఆ జట్టులో కమిందు మెండిస్ (74) టాప్ స్కోరర్. బ్యాట్‌తో సెంచరీ బాదిన అట్కిన్సన్ బంతితోనూ (2/40) రాణించాడు. వోక్స్, స్టోన్, పాట్స్ తలా రెండు వికెట్లు పడగొట్టారు.

ముంబైకి ఘోర పరాభవం

కోయంబత్తూరు: బుచ్చిబాబు టోర్నీలో స్టార్లతో కూడిన ముంబై క్రికెట్ జట్టు దారుణ పరాభవానికి గురైంది. తమిళనాడు నిర్దేశించిన 510 పరుగుల భారీ ఛేదనలో ముంబై.. 223 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో తమిళనాడు 286 రన్స్ తేడాతో ఘన విజయం నమోదుచేసి సెమీస్‌లోకి ప్రవేశించింది. శ్రేయస్ అయ్యర్ (22) విఫలమవగా సర్ఫరాజ్ డకౌట్ అయ్యాడు. చేతి గాయం కారణంగా సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్‌కు రాలేదు. తమిళనాడు బౌలర్లలో అచ్యుత్, సాయి కిషోర్ తలా మూడు వికెట్లు తీశారు.

ఆర్తికి కాంస్యం



లిమా: లిమా(పెరూ) వేదికగా జరుగుతున్న అండర్-20 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ బోణీ కొట్టింది. శుక్రవారం జరిగిన మహిళల 10,000మీటర్ల రేస్‌వాక్‌లో ఆర్తి కాంస్య పతకంతో మెరిసింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన పోరులో ఆర్తి 44 నిమిషాల 39.39 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో 17 ఏండ్ల ఆర్తి జాతీయ రికార్డును తన పేరిట లిఖించుకుంది. మహిళల హైజంప్‌లో పూజసింగ్ ఫైనల్లోకి ప్రవేశించింది.

సుహాస్, నితేశ్ ముందంజ

పారా బ్యాడ్మింటన్‌లో సుహాస్ యతిరాజ్, నితేశ్ కుమార్ సెమీస్‌కు దూసుకెళ్లారు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్4 కేటగిరీ క్వార్టర్స్‌లో సుహాస్ 26-24, 21-14తో షిన్ క్యుంగ్ హ్వాన్ (కొరియా)ను ఓడించాడు. ఎస్ఎల్3 విభాగంలో నితేశ్.. 21-5, 21-11తో చైనాకు చెందిన యంగ్ జియాన్‌యున్‌ను చిత్తుచేశాడు. కాగా మానసి జోషి, టోక్యో కాంస్య పతక విజేత మనోజ్ సర్కార్ పోరాటం ముగిసింది. ఆర్చరీ పురుషుల కాంపౌండ్ ఓపెన్ కేటగిరీ రాకేశ్ కుమార్ ప్రిక్వార్టర్స్ చేరాడు. టేబుల్ టెన్నిస్‌లో సోనియాబెన్, భవీనా పటేల్ ద్వయం 1-3తో మూన్ సుంగ్-జంగ్ యంగ్ (కొరియా) చేతిలో ఓటమి పాలైంది. రోయింగ్ మిక్స్‌డ్ పీఆర్3 డబుల్ స్కల్స్‌లో భారత రోయర్లు అనిత, కొంగనపల్లె ఐదో స్థానంతో సరిపెట్టుకున్నారు. మహిళల డిస్కస్ త్రో (ఎఫ్55)లో సాక్షి కసానా 8వ స్థానంలో నిలిచింది.

పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	చైనా	6	7	3	16
2	బ్రిటన్	6	5	3	14
3	బ్రెజిల్	4	1	4	9
4	నెదర్లాండ్స్	4	1	1	6
5	ఇటలీ	3	2	7	12
6	ఆస్ట్రేలియా	3	2	2	7
14	భారత్	1	1	2	4

దే: దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

డ్యూరాండ్ చాంప్ నార్త్‌ఈస్ట్ యునైటెడ్

ఫైనల్‌లో మోహన్ బగాన్ ఓటమి

కోల్‌కతా: ప్రతిష్ఠాత్మక డ్యూరాండ్ కప్ లో సంచలనం. ఈ టోర్నీ చరిత్రలో అత్యధికంగా 17 టైటిల్స్ నెగ్గి 18వ టైటిల్‌పై కన్నేసిన మోహన్ బగాన్‌కు నార్త్‌ఈస్ట్ యూనైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎన్ఈయూఎఫ్‌సీ) అనూహ్య షాకిచ్చింది. ఫైనల్‌లో నార్త్‌ఈస్ట్ యూనైటెడ్ 4-3 (2-2)తో మోహన్ బగాన్‌ను ఓడించి తొలిసారి డ్యూరండ్ కప్‌ను సొంతం చేసుకుంది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు తలా రెండు గోల్స్‌తో సమంగా ఉండటంతో పెనాల్టీల ద్వారా తేలిన ఫలితంలో నార్త్‌ఈస్ట్ తొలి కప్‌ను ఎగురేసుకుపోయింది.

చిత్రం

రెండు రకాలుగా కనిపిస్తాడట!



జయాపజయాలకు అతీతమైన ఇమేజ్ విజయ్ దేవరకొండది. ప్రస్తుతం ఆయన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇటీవలే శ్రీలంకలో భారీ షెడ్యూల్‌ని పూర్తి చేసుకుని చిత్రబృందం హైదరాబాద్ చేరుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్‌ని మొదలుపెట్టారు. ఇదిలావుంటే.. ఈ సినిమా విషయంలో ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ ఒకటి వెలుగు చూసింది. ఇందులో విజయ్ దేవరకొండ కానిస్టేబుల్‌గా, ఖైదీగా రెండు రకాలుగా కనిపించనున్నారట. ఇందుకోసం ఆయన ప్రత్యేకమైన ఓ లుక్‌ని కూడా సెట్ చేసుకున్నారట. ఇందులో విజయ్ దేవరకొండ నటవిశ్వరూపాన్ని చూస్తారని చిత్రబృందం చెబుతున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 75శాతం పూర్తయింది. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చిలో విడుదల చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం: అనిరుధ్.

గబ్బర్‌సింగ్‌కి అప్‌డేట్ వెర్షన్‌గా



పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై నిర్మాతలు ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ అందించారు. అతి త్వరలోనే ఈ సినిమా షూటింగ్ మొదలుకానున్నదని వారు తెలిపారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. హరీశ్‌శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఇప్పటికే చాలా వరకు చిత్రీకరణ పూర్తి చేసుకున్నది. ఈ సినిమా గురించి రీసెంట్‌గా నిర్మాతలు మాట్లాడుతూ – 'ఇటీవలే పవన్‌కల్యాణ్‌ని కలిశాం. ఆయన షూటింగ్‌కి సుముఖంగానే ఉన్నారు. డేట్స్ ఇస్తే డిసెంబర్ నాటికి షూటింగ్ కంప్లీట్ చేస్తాం. 'గబ్బర్‌సింగ్'కి అప్‌డేట్ వర్షెన్‌లా ఉంటుంది మా 'ఉస్తాద్ భగత్ సింగ్' అని అన్నారు. సెప్టెంబర్ 2న పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ఓ స్పెషల్ ట్రీట్ ఇవ్వబోతున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు. శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అయనంక బోస్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

వనపర్తిలోనే పెండ్లి



ఈ ఏడాది మార్చిలో హీరో సిద్ధార్థ్, కథానాయిక అదితిరావు హైదరీల నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలోని రంగనాథస్వామి ఆలయంలో నిశ్చితార్థ వేడుకను నిర్వహించారు. అదే ఆలయంలో తామిద్దరం పెళ్లి చేసుకుంటామని తాజా ఇంటర్వ్యూలో అదితిరావు హైదరీ చెప్పింది. ఈ సందర్భంగా సిద్ధార్థ్‌తో తన ప్రేమ, పెళ్లి గురించి ఆమె ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. 'మహాసముద్రం' సినిమా షూటింగ్ సమయంలోనే సిద్ధార్థ్‌తో ఏర్పడిన పరిచయం క్రమంగా ప్రేమగా మారిందని చెప్పింది. హైదరాబాద్‌లో తన నాన్నమ్మ ప్రారంభించిన స్కూల్ అంటే ఎంతో ఇష్టమని, తన చిన్నతనం మొత్తం అక్కడే గడచిపోయిందని, అదే స్కూల్‌కి తీసుకెళ్లి సిద్ధార్థ్ తనకు లవ్‌ప్రపోజ్ చేశాడని అదితిరావు తెలిపింది. పెళ్లి గురించి మాట్లాడుతూ 'శ్రీరంగాపురంలోని రంగనాథస్వామి ఆలయంతో మా కుటుంబానికి ఎంతో అనుబంధం ఉంది. అందుకే అక్కడే నిశ్చితార్థం చేసుకున్నాం. పెళ్లి కూడా అక్కడే చేసుకోవాలని నిర్ణయించుకున్నాం' అని అదితిరావు హైదరీ పేర్కొంది.



నిర్దోషి కోసం న్యాయపోరాటం

ప్రియదర్శి ప్రధాన పాత్రలో రూపొందుతోన్న చిత్రం 'కోర్ట్ – స్టేట్ వర్సెస్ ఏ నోబడీ'. రామ్‌జగదీశ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రశాంతి త్రిపురనేని నిర్మాత. హీరో నాని ఈ సినిమాకు సమర్పకుడు. ఈ సినిమా శుక్రవారం హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి హీరో నాని క్లాప్ కొట్టగా, నిర్మాత ప్రశాంతి కెమెరా స్విచాన్ చేశారు. జెమినీ కిరణ్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన టైటిల్ పోస్టర్.. బోనులో న్యాయదేవత, శాంతి చిహ్నాలుగా ఎగురుతున్న పావురాలతో ఆసక్తికరంగా ఉంది. అన్యాయంగా ఓ కేసులో ఇరుక్కున్న కుర్రాడికోసం జరిగే న్యాయపోరాటం చుట్టూ ఈ కథ నడుస్తుందని, ప్రియదర్శి ఇందులో లాయర్‌గా నటిస్తున్నాడనీని మేకర్స్ తెలిపారు. సెప్టెంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలు కానున్న ఈ సినిమాలో శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్, హర్ష్‌రోషన్, శ్రీదేవి ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ పురుషోత్తమన్, సంగీతం: విజయ్ బుల్గానిన్, నిర్మాణం: వాల్‌పోస్టర్ సినిమా.



పెళ్లంటే కేజీఎఫ్ యాక్షన్ డ్రామా

పెళ్లిలో తాను ధరించిన తెల్లని వస్త్రాలను నల్లని గౌన్‌గా మార్చుకున్నది సమంత. అవార్డు షో కోసం డిజైనర్ క్రేషా బజాజ్ ఈ గౌన్‌ని డిజైన్ చేశారు. ఇటీవలే ఈ గౌన్‌ని ఇన్‌స్టాలో షేర్ చేశారు సమంత, క్రేషా బజాజ్. ఇదిలావుంటే.. ఏ విషయాన్నయినా కుండ బద్దలు కొట్టేలా మాట్లాడే సమంత.. ఇటీవల పెళ్లి గురించి ఆసక్తికరమైన కామెంట్స్ చేసింది. పనిలోపనిగా దర్శక, నిర్మాత కరణ్ జోహార్‌ని ఉద్దేశించి ఛలోక్తులు విసిరింది 'సంతోషంగా లేని వివాహాలకు కారకుడు కరణ్‌జోహార్. అతడి దృష్టిలో వివాహం ఆదర్శవంతమైనది. ఆ భావనను, వివాహ లెహంగాలపై తనకున్న మక్కువను తెరపై చూపిస్తుంటాడు. చాలామందికి పెళ్లి విషయంలో అపోహకు కారణం అయ్యాడు. అతను పెళ్లిని 'కభీ ఖుషీ కభీ ఘమ్' అంత అందంగా చూపిస్తాడు. కానీ నిజానికి అది 'కేజీఎఫ్' లాగా యాక్షన్, డ్రామా, సంఘర్షణలతో నిండివుంటుంది' అంటూ ఓ వైపు కరణ్‌ని ఆటపట్టిస్తూనే.. మరోవైపు పెళ్లిపై తన విరక్తిని కూడా ప్రకటించింది సమంత.



పా.రంజిత్ 'బిర్సా ముండా'

సామాజిక సమస్యలను కథావస్తువులుగా తీసుకొని వాటిని కమర్షియల్ పంథాలో ఆవిష్కరిస్తూ ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు తమిళ డైరెక్టర్ పా.రంజిత్. ఆయన తాజా చిత్రం 'తంగలాన్' బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించింది. విక్రమ్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని హిందీలో కూడా త్వరలో విడుదల చేయబోతున్నారు. ఈ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొన్న పా.రంజిత్ తన బాలీవుడ్ ప్రాజెక్ట్‌పై ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. హిందీలో స్ట్రెయిట్ సినిమా కోసం స్క్రిప్ట్ సిద్ధం చేశానని, దానికి 'బిర్సా ముండా' అనే టైటిల్‌ను పెట్టానని పా.రంజిత్ తెలిపారు. అగ్ర హీరో ఇందులో నటిస్తాడని ఆయన పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ సినిమా కోసం రణ్‌వీర్ సింగ్‌తో పా.రంజిత్ ఇప్పటికే సంప్రదింపులు జరిపారని తెలిసింది. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.



డబుల్ ఫన్ అండ్ థ్రిల్

శ్రీసింహ కోడూరి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మత్తు వదలరా-2'. రితేష్ రానా దర్శకుడు. క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పిస్తున్నది. సెప్టెంబర్ 13న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం టీజర్‌ను విడుదల చేశారు. టీజర్ ఆద్యంతం చక్కటి హాస్యంతో సాగింది. ఈ సందర్భంగా హీరో శ్రీసింహ కోడూరి మాట్లాడుతూ 'తొలిభాగం పెద్ద హిట్ అయింది. దాంతో ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫస్ట్ పార్ట్ కంటే డబుల్ ఫన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దాం' అన్నారు. ఈ సినిమా విజయంపై టీమ్ అంతా కాన్ఫిడెంట్‌గా ఉన్నామని నిర్మాత వై.రవిశంకర్ చెప్పారు. ఈ సినిమాలో తాను ఓ పాట రాయడంతో పాటు పాడానని కథానాయిక ఫరియా అబ్దుల్లా తెలిపింది. తొలిభాగానికి మించిన మలుపులతో సినిమా ఉత్కంఠను పంచుతుందని నిర్మాత చెర్రీ పేర్కొన్నారు. సునీల్, వెన్నెల కిషోర్, అజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, ప్రొడక్షన్ డిజైనర్: నార్ని శ్రీనివాస్, రచన-దర్శకత్వం: రితేష్ రానా.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఆర్థికం 'హస్త'వ్యస్తం!

- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సంక్షోభ పరిస్థితులు
- హిమాచల్‌ప్రదేశ్‌లో జీతాలు చెల్లించలేని స్థితి
- రెండు నెలలపాటు తాను, మంత్రులు వేతనం తీసుకోబోమని సీఎం సుఖ్విందర్ ప్రకటన
- కర్ణాటకలో నిధుల కోసం ప్రజలపై భారాలు
- రేవంత్ పాలనలో అప్పుల కుప్పగా తెలంగాణ
- హామీల అమలులో ప్రభుత్వాలు పూర్తి విఫలం

'రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నది. దీని కారణంగా నాతో పాటు క్యాబినెట్ మంత్రులం దరూ రెండు నెలలపాటు వేతనాలు, టీఏ, డీఏ తీసుకో కూడదని నిర్ణయం తీసు కొన్నాం. ఎమ్మెల్యేలను కూడా ఇదేవిధంగా చేయాలని కోరు తున్నా'.. హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు గురువారం చేసిన ప్రకటన ఇది. కాంగ్రెస్ పాలనలోని హిమాచల్‌లో ఆర్థిక సంక్షోభ పరిస్థితులకు సీఎం ప్రకటనే నిదర్శనం. ఒక్క హిమాచల్ లోనే కాదు, కాంగ్రెస్ పాల నలో ఉన్న తెలంగాణ, కర్ణాటక లోనూ ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి.

సిమ్లా/న్యూఢిల్లీ, ఆగస్టు 30: కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పాలనా వైఫల్యం కారణంగా ఆయా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలో కూరు కుపోతున్నాయి. అధికారంలోకి వచ్చేందుకు అడ్డగోలు హామీలు ఇచ్చిన ఆ పార్టీ.. ఇప్పుడు ఆ వాగ్దానాలను అమలు చేయలేక చేతులెత్తే స్తున్న పరిస్థితులు తెలంగాణ, కర్ణాటక సహా హిమాచల్‌ప్రదేశ్‌లలో కనిపిస్తున్నాయి. ఎడా పెడా అప్పులు చేస్తూ.. ప్రజలపై పలు రకాల చార్జీలు, పన్నుల భారం మోపుతున్నాయి. తాజాగా హిమాచల్‌ప్రదేశ్‌లో కనీసం వేత నాలు చెల్లించలేని పరిస్థితుల్లో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నట్టు సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు గురువారం చేసిన ప్రకటన ద్వారా వెల్లడైంది. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నదని సాక్షాత్తూ ఆయనే ఒప్పుకొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తనతో పాటు మంత్రులు రెండు నెలల పాటు వేతనాలు, టీఏ, డీఏ వంటివి తీసుకోకూడదని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకొన్నామని తెలిపారు. రాబోవు రోజుల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మంచి మెరుగుదల చూసే వరకు శాసనసభ్యులు కూడా ఇదే విధంగా చేయాలని అభ్యర్థిం చారు.



రాహుల్ వల్లే ఆర్థిక భయానకం!

కనీసం వేతనాలు కూడా చెల్లించ లేని పరిస్థితుల్లో హిమాచల్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి విమర్శించారు. సీఎం తనతోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ఎమ్మెల్యేలకు వేతనాలు ఇచ్చుకోలేనంతగా రాష్ట్రంలో పరిస్థితులు దిగ జారాయని అన్నారు. రాహుల్ గాంధీ 'ఖటా–ఖట్' మాడల్ కారణంగానే రాష్ట్రంలో ఆర్థిక భయానక పరిస్థితులు నెలకొన్నాయని, ఆయన విఫల ఆర్థిక ఆలోచనా విధానాలు బహిర్గతమయ్యాయని విమర్శించారు. కర్ణాట కలో కూడా ఇదే విధమైన పరిస్థితులు నెలకొ న్నాయని, పాల నుంచి నీళ్ల వరకు అన్ని నిత్యా వసరాల ధరలు పెరిగాయని అన్నారు. ఫేక్ వాగ్దానాలు చేసిన రాహుల్ గాంధీ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కర్ణాటకలో గ్యారెంటీలకు అడ్డంగా కోతలు

కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఐదు గ్యారెంటీ లను నమ్మి ఓటేసిన ప్రజలకు సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ చుక్కలు చూపిస్తున్నది. ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదు. గ్యారెంటీలకు అడ్డగోలుగా కోతలు పెడుతున్నది. దీనికితోడుగా పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను 4 శాతం పెంచడంతో పాటు పలు రకాల పన్నులు, చార్జీలతో ప్రజ లపై భారం వేస్తున్నది. 'ఉచిత విద్యుత్తు' అంటూ ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెరతీ శారని, మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహలక్ష్మి' స్కీమ్‌కు కొత్త ఆంక్షలు జోడించా రని, ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చారని, నిరుద్యో గులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్న భాగ్య' ఇలా ప్రతీ స్కీమ్‌లోనూ కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

తెలంగాణలో 8 నెలల్లోనే రూ.50 వేల కోట్లకు పైగా అప్పు

ఇక తెలంగాణలో అయితే గ్యారెంటీల అమలులో సీఎం రేవంత్ రెడ్డి నేతృ త్వంలోని హస్తం పార్టీ ప్రభుత్వ వైఫ ల్యాన్ని అటుంచితే.. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేస్తున్నది. రేవంత్ సర్కార్ కేవలం 8 నెలల్లోనే రూ.50 వేల కోట్లకు పైగా అప్పులు చేసింది. ఒక్క కొత్త ప్రాజెక్టూ లేక, మరోవైపు ప్రజా సంక్షేమమూ లేక తెచ్చిన వేలాది కోట్ల అప్పులు ఎటు పోతున్నాయో తెలియని సందిగ్ధ పరిస్థితులు నెలకొన్నాయి. రుణమాఫీ అంటూ అసెంబ్లీ ఎన్నికల సమ యంలో తెగ ఊదరగొట్టిన కాంగ్రెస్.. రుణ మాఫీని సక్రమంగా అమలు చేయలేక రైత న్నల ఆగ్రహాన్ని చవిచూస్తున్నది. మరోవైపు ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం యువత రోడ్లెక్కు తున్న పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రమోషన్‌కు నేను రెడీ

- ముఖ్యమంత్రి అవ్వాలనే కోరిక లేకపోవడానికి నేనేమీ సన్యాసిని కాదు కదా!
- కర్ణాటక హోం శాఖ మంత్రి పరమేశ్వర కీలక వ్యాఖ్యలు
- సీఎం మార్పుపై ప్రచారం వేళ ప్రాధాన్యం
- ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నది
- మా ఎమ్మెల్యేలకు రూ.100 కోట్ల ఆఫర్
- గతంలో ఇలానే చేశారన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య



బెంగళూరు/హుబ్బళ్లి, ఆగస్టు 30: వరుస కుంభకోణాల నేపథ్యంలో కర్ణాటకలో సీఎం మార్పుపై జోరుగా చర్చ జరుగు తున్న వేళ ఆ రాష్ట్ర హోంమంత్రి జీ పర మేశ్వర శుక్రవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం తనకు ప్రమోషన్‌గా సీఎం పదవి ఇస్తే తప్పక సంతోషిస్తానని పేర్కొన్నారు. బెంగళూ రులో మీడియాతో ఆయన మాట్లాడుతూ సీఎం కావాలనే కోరిక లేకపోవడానికి తానేమీ సన్యాసిని కాదు కదా! అని వ్యాఖ్యానించారు. పరమేశ్వరకు సీఎం పదవి వస్తే సంతోషిస్తానని రాష్ట్ర సహ కార శాఖ మంత్రి కేఎన్ రాజన్న చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు అడి గిన ప్రశ్నకు హోంమంత్రి స్పందిస్తూ 'అదే జరిగితే నేను కూడా సంతోషిస్తాను' అని పేర్కొన్నారు. ముడా స్కాం ఆరోప ణలతో పీకల్లోతు ఇబ్బందుల్లో చిక్కుకు పోయిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను హస్తం పార్టీ సీఎం పదవి నుంచి తప్పి స్తుందని ప్రచారం జరుగుతున్న నేప థ్యంలో పరమేశ్వర వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకొన్నాయి.

దళిత నేతల్లో అత్యంత సీనియర్ ఆయనే

రాష్ట్రంలో ఒకవేళ సీఎంను మారిస్తే దళిత నేత, హోంమంత్రి పరమేశ్వర రేసులో ముందున్నట్టు ఇప్పటికే వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో సీఎం మార్పు తప్పదనుకొంటే, ఆ పదవిని దళిత నేతకు ఇవ్వాలని సిద్ధరామయ్య వర్గం పలు సందర్భాల్లో స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికా ర్జున ఖర్గే తర్వాత దళిత వర్గానికి చెందిన అత్యంత సీనియర్ నేతగా పరమేశ్వర ఉన్నారు. కాగా, ముడా స్కాంలో సీఎం సిద్ధరామయ్యపై విచారణకు గవర్నర్ అనుమతించడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ శనివారం నిర్వహించ తలబెట్టిన 'చలో రాజ్‌భవన్' ఆందోళన కార్యక్రమంపై పర మేశ్వర మాట్లాడుతూ గవర్నర్ అనుమతి చట్టవిరుద్ధమని అన్నారు. దీనిపై రాష్ట్ర క్యాబినెట్ ఓ నిర్ణయం తీసుకొన్నదని, దీనికి సంబంధించి అందించిన ఆధారా లను గవర్నర్ పరిగణనలోకి తీసుకోలే దని విమర్శించారు.

నన్ను దించేసేందుకు కుట్ర: సీఎం సిద్ధరామయ్య

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని, తమ పార్టీ ఎమ్మెల్యేలకు రూ.100 కోట్ల చొప్పున ఆఫర్ చేస్తున్నదని సీఎం సిద్ధరామయ్య శుక్రవారం ఆరోపించారు. ఈ మేరకు ఎమ్మెల్యే రవికుమార్ గౌడ తనకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. 2008, 2019లో కూడా 'ఆపరేషన్ కమలం' ద్వారానే బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు కూడా అదే కుట్రలు చేస్తున్నదని అన్నారు. 136 మంది ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడం అంత సులభం కాదని, తమ ఎమ్మెల్యేల్లో ఎవరూ కూడా డబ్బులకు లొంగబోరని ఆశిస్తున్నానన్నారు. 16వ ఆర్థిక సంఘంపై సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ చైర్మన్ అరవింద్ పనగరి యాను కలిశామని, తమ డిమాండ్లను ఆయన ముందుంచామని తెలి పారు. కాగా, హత్య కేసులో నిందితుడిగా ఉన్న నటుడు దర్శన్‌కు జైల్లో సకల సౌకర్యాలు కల్పించడంపై స్పందిస్తూ.. ఈ ఘటనకు సంబంధించి తొమ్మిది మంది జైలు సిబ్బందిని సస్పెండ్ చేశామని, దర్శన్‌ను బళ్లారి జైలుకు మార్చామని తెలిపారు. ఈ విషయంలో డీజీపీకి కూడా నోటీసులు జారీచేశామన్నారు.

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు కొత్త పింఛను దరఖాస్తు ఫారం

న్యూఢిల్లీ: పదవీ విరమణ చేసే కేంద్ర ప్రభుత్వోద్యోగుల కోసం కొత్త సరళీ కృత పింఛను దరఖాస్తు ఫారాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ శుక్ర వారం ఆవిష్కరించారు. 9 వేర్వేరు ఫారాలను కలిపి, ఒకే ఫారంగా రూపొందించారు. దీనిని ఫారం 6ఏ అంటారు. ప్రజలు, పింఛనుదారుల జీవితాలను సులభతరం చేయడా నికి ప్రభుత్వం చేపట్టిన మరొక చర్య ఇది అని కేంద్ర మంత్రి చెప్పారు. ఈ ఏడాది డిసెంబరు నుంచి పదవీ విర మణ చేసే కేంద్ర ప్రభుత్వోద్యోగు లకు భవిష్య / ఈ–హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్స్‌లో ఈ ఫారం–6ఏ అందు బాటులో ఉంటుందని తెలిపారు.

బీజేపీలో చేరిన చంపయీ సొరేన్

రాంచీ: జార్ఖండ్ మాజీ ముఖ్య మంత్రి, జేఎంఎం సీనియర్ నేత చంపయీ సొరేన్ శుక్రవారం బీజే పీలో చేరారు. రెండు రోజుల క్రితమే జేఎంఎం పార్టీకి రాజీనామా చేసిన ఆయన.. పలువురు నేతలు, మద్దతు దారులతో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, అస్సాం ముఖ్య మంత్రి హిమంత బిశ్వ శర్మ సమ క్షంలో కమలం తీర్థం పుచ్చుకు న్నారు. బీజేపీలో చంపయీ చేరికతో గిరిజన వర్గాల్లో తమ పార్టీకి పట్టు లభిస్తుందని, ఈ ఏడాది చివర్లో జరిగే ఎన్నికల్లో తమకు లబ్ధి చేకూరు తుందని కమలం పార్టీ భావిస్తున్నది.

అస్సాం అసెంబ్లీలో నమాజ్ విరామం రద్దు

గువాహటి : అస్సాం శాసనసభ సమావేశాలు జరిగేటపుడు ప్రతి శుక్ర వారం ముస్లిం ఎమ్మెల్యేలు నమాజ్ చేయడం కోసం సభ కార్యకలాపా లకు రెండు గంటలపాటు విరామం ఇచ్చే నిబంధనను రద్దు చేసినట్లు ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చెప్పారు. రెండు గంటలపాటు ఇస్తున్న జుమ్మా విరామాన్ని రద్దు చేయడం ద్వారా వలస పాలన కాలంనాటి మరో అవశేషాన్ని వది లించుకున్నామని, అస్సాం శాసన సభ ఉత్పాదకతకే ప్రాధాన్యమిచ్చిం దని శర్మ శుక్రవారం తెలిపారు.

తొలి దళిత రాష్ట్రపతి రామ్‌నాథ్ 'కోవిడ్'

తడబడిన కంగనా రనౌత్.. నెటిజన్ల ట్రోలింగ్



న్యూఢిల్లీ: మండీ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఒక ఇంట ర్వ్యూలో తడబడి మరోసారి ట్రోలింగ్‌కు గురయ్యారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దేశానికి తొలి దళిత రాష్ట్రపతి అని ఒక ఇంటర్వ్యూలో కంగనా పేర్కొన్నారు. పైగా, రామ్‌నాథ్ కోవింద్‌కు బదులుగా 'రామ్ కోవిడ్' అని పలకడంతో ట్రోలర్లు ఆమెపై మీమ్‌లు, జోక్‌లతో సామాజిక మాధ్యమాలను హోరె త్తించారు. ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కులగణన అంశం గురించి మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే దేశానికి మొదటి దళిత రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ అని యాంకర్ సవరించగా, ఆమె వెంటనే తన తప్పును అంగీకరించారు.

యువ న్యాయవాదులకు ఆదర్శం

జస్టిస్ హిమా కోహ్లీకి సీజేఐ ప్రశంస



న్యూఢిల్లీ: నేటి యువ న్యాయవాదులకు, ముఖ్యంగా మహిళా న్యాయవాదులకు జస్టిస్ హిమా కోహ్లీ రోల్ మోడల్‌గా నిలుస్తారని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ప్రశంసించారు. ఈ వృత్తిలో మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆమె గళం ప్రస్తా వించిందన్నారు. పదవీ విరమణ చేస్తున్న సుప్రీంకోర్టు జడ్జి హిమా కోహ్లీ వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆమె న్యాయ పాలన కోసం నిలబడిన వ్యక్తి, వృత్తిలో ప్రభావశీలి అని పేర్కొన్నారు. ఆమె సున్నితత్వ, న్యాయపరమైన నిర్ణయాలను ప్రశంసించారు. మూడేండ్లకు పైగా సుప్రీం కోర్టు న్యాయ మూర్తిగా పనిచేసిన జస్టిస్ హిమా కోహ్లీ సెప్టెంబర్ 1న పదవీ విరమణ చేయనున్నారు.

శివాజీకి శిరస్సు వంచి క్షమాపణ చెప్తున్నా

విగ్రహం కూలిపోవడంపై ప్రధాని మోదీ స్పందన

ముంబై,ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లాలో ఇటీవల శివాజీ విగ్రహం కూలడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం క్షమాపణ చెప్పారు. 'ఛత్రపతి శివాజీ కేవలం ఒక పేరు లేదా ఒక చక్రవర్తి కాదు. మనకు ఆయన ఒక దైవం. ఇవాళ నేను నా శిరస్సును నా దైవం పాదాల ముందు వంచి క్షమాపణ అడుగుతున్నా' అని మోదీ అన్నారు. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో రూ.76 వేల కోట్లతో చేపట్టిన వంధన్ నౌకాశ్రయ ప్రాజెక్టుకు శంకు స్థాపన చేసిన సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

సిక్కుల ఊచకోతలో టైట్లర్ పాత్రపై ఆధారాలున్నాయ్

అభియోగాల నమోదుకు ఢిల్లీ కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌కు ఢిల్లీ కోర్టు శుక్ర వారం గట్టి షాక్ ఇచ్చింది. 1984లో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ హత్యానంతరం జరి గిన సిక్కుల ఊచకోత కేసులో ఆ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి జగదీశ్ టైట్లర్ పాత్రపై తగిన రుజువులు ఉన్నాయని, హత్య, అల్లర్లు జరగాలనే ఉద్దేశంతో రెచ్చగొ ట్టడం వంటి నేరారోపణలను నమోదు చేయాలని ఆదేశించింది. ఢిల్లీలోని పుల్ బంగష్ గురుద్వారా వెలుపల ఠాకూర్ సింగ్, బదల్ సింగ్, గురుచరణ్ సింగ్ హత్యలకు సంబంధించిన కేసులో ఈ ఆదేశాలు ఇచ్చింది.

భర్త సమ్మతి లేకుండా గర్భం తొలగింపు క్రూరత్వమే

మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు

భోపాల్: భర్త సమ్మతి లేకుండా భార్య గర్భాన్ని తొలగించుకోవడం క్రూరత్వం కిందకు వస్తుందని మధ్య ప్రదేశ్ హైకోర్టు తీర్పు చెప్పింది. క్రూరత్వం, భర్తను విడిచిపెట్టి వెళ్లడం కారణాలతో పిటిషనర్ (భార్య), ప్రతివాది (భర్త)కి విడా కులు మంజూరు చేస్తూ ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును తాము సమ ర్థిస్తున్నట్టు చెప్పింది. క్రూరత్వం శారీ రక, మానసిక హానిని కలిగిస్తుందని, భర్త అనుమతి లేకుండా గర్భాన్ని విచ్ఛిత్తి చేసుకోవడం ఈ నిర్వచనం పరిధిలోకి వస్తుందని తెలిపింది.

నైట్ డ్యూటీలంటేనే వైద్యుల్లో వణుకు

- కోల్‌కతా హత్యాచార ఘటన తర్వాత వైద్యుల్లో భయం
- ఐఎంఏ తాజా సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: కోల్‌కతాలో జూనియర్ వైద్యురా లిపై లైంగికదాడి, హత్య ఘటన తర్వాత నైట్ డ్యూటీ అంటేనే మహిళా వైద్యులు భయపడి పోతున్నారట. రాత్రిపూట విధులు తమకు ఎంతమాత్రమూ సురక్షితం కాదని భావిస్తు న్నారట. కొందరైతే ఆత్మరక్షణ కోసం ఆయు ధాలు కూడా వెంట తెచ్చుకోవాలని భావిస్తు న్నారట. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నిర్వహించిన ఆన్‌లైన్ సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 22 రాష్ట్రాలకు చెందిన 3,885 మంది వైద్యులు ఈ సర్వేలో పాల్గొన్నారు. వీరిలో 85 శాతం మంది 35 ఏండ్లలోపు వారు కాగా, 61 శాతం మంది ట్రైనీ వైద్యులు, పోస్టుగ్రాడ్యుయేట్ ట్రైనీలు ఉన్నారు. సర్వేలో పాల్గొన్న వారిలో 24.1 శాతం మంది వైద్యులు నైట్ డ్యూటీ సురక్షితం కాదని చెప్పగా, 11.4 శాతం మంది అస్సలు సురక్షితం కాదని చెప్పారు. ఇలా చెప్పిన వారిలో మహిళలే అధికం. 20–30 ఏండ్ల మధ్య వైద్యులకు అత్యంత తక్కువ భద్రత కలిగి ఉన్నట్టు సర్వే పేర్కొన్నది. వీరిలో అత్య ధికులు ఇంటర్న్ చేస్తున్నవారు, పోస్టుగ్రాడ్యు యేట్ చేస్తున్నవారే.

డ్యూటీ రూములేవి?

నైట్ షిఫ్టులలో తమకు డ్యూటీ రూములు కూడా ఉండడం లేదని 45 శాతం మంది వైద్యులు చెప్పారు. తాము విధులు నిర్వర్తించే వార్డ్/క్యాజువాలిటీ ప్రాంతం నుంచి డ్యూటీ రూములు ఎక్కడో దూరంగా ఉంటున్నాయని సర్వేలో పాల్గొన్న వారిలో సగానికి పైగా (53శాతం) తెలిపారు. అందుబాటులో ఉన్న మూడింట ఒకవంతు డ్యూటీ రూముల్లో అటాచ్డ్ బాత్రూంలు ఉండడం లేదని వివరిం చారు. దీంతో రాత్రిపూట అవసరాలు తీర్చు కునేందుకు బయటకు వెళ్లాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

రేప్, హత్య కేసుల్లో కఠిన చట్టాలు తేవాలి

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ శుక్ర వారం ప్రధాని మోదీకి మరోసారి లేఖ రాశారు. క్రూరమైన రేప్, హత్య లాంటి నేరా లకు తీవ్రమైన శిక్షలు విధించేలా కఠినమైన కేంద్ర చట్టాలను రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

డిమాండ్లు ఇవీ..

రాత్రిపూట విధులు నిర్వర్తించే వైద్యుల రక్షణ కోసం శిక్షణ పొందిన సెక్యూరిటీ సిబ్బం దిని నియమించడంతోపాటు సీసీటీవీ కెమెరాలు బిగించాలని, పూర్తిగా వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని సర్వేలో పాల్గొన్న వైద్యులు కోరారు. కేంద్ర రక్షణ చట్టం (సీపీఏ) అమలు చేయడంతోపాటు రోగుల అటెండెంట్స్ సంఖ్యను నియంత్రించడం, అలారం వ్యవస్థను ఏర్పాటు చేయడం, తాళాలు వేయగలిగే సుర క్షితమైన డ్యూటీ రూములు అందుబాటులోకి తీసుకురావడం వంటి చర్యలు చేపట్టా లని వైద్యులు డిమాండ్ చేసినట్టు ఐఎంఏ సర్వే వెల్లడించింది.

థీసిస్ అప్రూవల్ తప్పనిసరి కాదు

అది లేకున్నా మెడికల్ ఫైనల్ పీజీ పరీక్షలు రాయొచ్చు: ఎన్‌ఎంసీ

న్యూఢిల్లీ: పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ స్టూడెంట్స్ ఎదుర్కొంటున్న మాన సిక ఒత్తిళ్లను తగ్గించేందుకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఫైనల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ పరీక్షలు రాయడానికి థీసిస్ అప్రూవల్ తప్పనిసరి కాదని తెలిపింది. విద్యార్థులు తమ థీసి స్‌ను హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, వైద్య కళాశాల డీన్ ద్వారా సమర్పిం చాలని ఎన్‌ఎంసీ చెప్పింది. ఎన్ ఎంసీ పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్ ఓజా వైద్య కాలేజీలకు ఈ మేరకు లేఖ రాశారు. థీసిస్‌కు హెచ్ ఓడీ నుంచి ఆమోదం లభించలేదనే కారణంతో, విద్యార్థి పరీక్ష రాయ కుండా నిరోధించకూడదని స్పష్టం చేశారు. థీసిస్‌ను ఆమోదించకుండా హెచ్‌ఓడీలు విద్యార్థులను వేధిస్తున్నా రనే ఆరోపణలున్నాయి. డెహ్రాడూన్, పాటియాలా, భోపాల్ వంటి చోట్ల విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు వెలుగు చూశాయి.

వీకెండ్ నిద్రతో గుండెకు మేలు!

న్యూఢిల్లీ: ఆధునిక జీవనశైలి నిద్రపోయే సమయాలను మార్చేస్తున్నది. పని దినాల్లో నిద్ర కరువవుతున్నది. దీంతో జనం వారాంతాల్లో ఎక్కువ సమయం నిద్ర పోతూ ఉంటారు. పని దినాల్లో కోల్పోయిన నిద్రకు పరిహారంగా వారాంతాల్లో ఇంకొంత ఎక్కువ సమయం నిద్రపోవడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని బ్రిటన్ బయోబ్యాంక్ అధ్యయనం వెల్లడించింది. యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డి యాలజీ కాంగ్రెస్, 2024లో సమర్పించిన పరిశోధన నివేదిక ప్రకారం, వారాం తాల్లో ఎక్కువ సమయం మేలుకుని ఉండేవారికన్నా, ఎక్కువసేపు నిద్రపోయేవా రికి గుండె జబ్బుల ముప్పు 20 శాతం తగ్గుతుందని తేలింది. చైనా పరిశోధకుడు యాంజున్ సోంగ్ మాట్లాడుతూ, కోల్పోయిన నిద్రకు పరిహారంగా తగినంత సమయం నిద్రపోవడం వల్ల గుండె జబ్బుల ముప్పు తగ్గుతుందన్నారు.

భూమి చుట్టూ విద్యుత్తు క్షేత్రం: నాసా

న్యూఢిల్లీ: భూమి చుట్టూ సూక్ష్మమైన విద్యుత్తు క్షేత్రం ఉన్నట్లు నాసా పరి శోధకులు గుర్తించారు. ఇది దాదాపు కనిపించదని చెప్పారు. గురుత్వాక ర్షణ శక్తికి ఎంత ప్రాముఖ్యం ఉందో దీనికి కూడా అంతే ప్రాధాన్యం ఉందని తెలిపారు. ఇప్పటి వరకు మనకు గురుత్వాకర్షణ శక్తి, అయ స్కాంత క్షేత్రాల గురించి మాత్రమే తెలుసు. తాజాగా మూడో క్షేత్రం గురించి కూడా మనకు అవగాహన కలుగుతున్నది. భూ ధృవాల నుంచి నిరంతరం ప్రవహించే సూపర్‌సా నిక్ సూక్ష్మ కణాల గాలులు అంతుబ ట్టని రీతిలో ఉంటాయి. ఈ గాలు లకు కారణం ఈ యాంబీపోలార్ విద్యుత్తు క్షేత్రమే అయి ఉండవచ్చు నని పరిశోధకులు చెప్తున్నారు. కంటికి కనిపించని ఈ విద్యుత్తు క్షేత్రాన్ని గుర్తించడం వల్ల భూమి పైన మాత్రమే జీవరాశి ఎందుకు రూపొందిందో చెప్పవచ్చునని అంటున్నారు.

భారతీయుల్లో ఐరన్, కాల్షియం లోపం

న్యూఢిల్లీ : భారతీయుల ఆహారంలో ఆరోగ్యానికి ముఖ్యమైన సూక్ష్మ పోష కాలు తగిన స్థాయిలో ఉండటం లేదని తాజా అధ్యయనం అంచనా వేసింది. స్త్రీ, పురుషుల్లో అన్ని వయసుల వారికీ ఈ సమస్య ఉందని తెలిపింది. ఆహా రంలో ఐరన్, కాల్షియం, ఫోలేట్ వంటి పోషకాలు తగిన మోతాదులో ఉండటం లేదని వివరించింది. ఈ అధ్యయనం 'ది లాన్సెట్ గ్లోబల్ హెల్త్' జర్నల్‌లో ప్రచురితమైంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం సహా ఇతర సంస్థ లకు చెందిన పరిశోధకులు ఈ అధ్య యనాన్ని నిర్వహించారు. 185 దేశాల్లో ఆహారం ద్వారా 15 మైక్రో న్యూట్రియెంట్స్ వినియోగంపై అంచ నాలను వెలుగులోకి తీసుకొచ్చిన తొలి అధ్యయనం ఇదే. ప్రపంచ జనాభాలో 70 శాతం మంది (దాదాపు 500 కోట్ల మంది) తగినంత అయోడిన్, విటమిన్ ఈ, కాల్షియంలను తీసుకో వడం లేదు.

ఎన్సీపీ మంత్రుల పక్కన కూర్చొంటే వికారం!

- వాంతులు వచ్చినట్టుగా ఉంటుంది
- శివసేన మంత్రి తానాజీ వ్యాఖ్యలు
- అజిత్‌పవార్ వర్గం తీవ్ర ఆగ్రహం

ముంబై: మహారాష్ట్రలోని అధికార మహా యుతి కూటమిలో విభేదాలు భగ్గుమ న్నాయి. క్యాబినెట్‌లోని ఎన్సీపీ మంత్రులపై శివసేన మంత్రి తానాజీ సావంత్ వివక్షాపూ రిత వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గ సమావే శంలో తాను ఎన్సీపీ మంత్రుల పక్కన కూర్చుంటానని, దీంతో వికారంతో వాంతి వచ్చినట్టుగా ఉంటుందని వ్యాఖ్యానిం చారు. ధారాశివ్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తానాజీ వ్యాఖ్యలపై మిత్రపక్ష ఎన్సీపీ మండిపడింది. అలాంటి ప్రకటనలు వినేకంటే ప్రభుత్వం నుంచి బయటకు వెళ్లి పోవడం మంచిదని తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఎన్సీపీ అధికార ప్రతినిధి ఉమేశ్ పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి బయటకు రావాలని పార్టీ సీనియర్ నేత లను కోరారు. సావంత్ వ్యాఖ్యలపై ఎన్సీపీ(శరద్ పవార్ వర్గం) కూడా స్పందించింది. ఆయన వ్యాఖ్యలను చూస్తుంటే మహాయుతి కూటమికి ఇక ఎన్సీపీ అవసరం లేదన్నట్టు కనిపిస్తున్నదని పేర్కొన్నది. ఎన్సీపీని బీజేపీ మహాయుతి కూటమి నుంచి బయటకు పంపే సమయం ఆసన్నమైందని తెలిపింది.

మాలీవుడ్‌లో లైంగిక వేధింపులపై నిరసన జ్వాలలు

దోషులకు ప్రభుత్వం రక్షణగా నిలుస్తున్నదని విపక్షాల ధ్వజం

కొచ్చి/తిరువనంతపురం, ఆగస్టు 30: మల యాళ చిత్ర పరిశ్రమ మాలీవుడ్‌లో కొందరు హీరోయిన్లు, నటీమణులపై సహచర నటులు, చిత్రపరిశ్రమకు చెందిన వారే లైంగిక వేధింపులకు పాల్పడిన ఉదంతాలు బయటప డటంతో పినరయి విజయన్ ప్రభుత్వంపై విప క్షాలు మండిపడుతున్నాయి. చలనచిత్ర పరిశ్ర మలో వేధింపులపై విచారణకు నియమించిన జస్టిస్ హేమ కమిటీ నివేదిక సమర్పించినా, పలువురు నటీమణులు తమను వేధించిన నటులు, దర్శకులు, ఇతరుల పేర్లు వెల్లడిం చినా వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని విపక్ష నేత వీడీ సతీశన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దోషులకు విజయన్ ప్రభుత్వం రక్ష ణగా నిలుస్తున్నదని, ఇంత జరిగినా ముఖ్య మంత్రి స్పందించడం లేదని ఆయన ఆరోపిం చారు. లైంగిక వేధింపులకు పాల్పడ్డ నటుడు, సీపీఎం ఎమ్మెల్యే ముకేశ్ రాజీనామా చేయా లని, దీనిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొచ్చి, కొల్లాంలో ప్రదర్శనలు నిర్వహించారు. కొల్లాంలో వారు ముకేశ్ ఇంటి ముందు ఆందోళన జరిపి, నినాదాలు చేశారు.



ఐస్‌ల్యాండ్ నైరుతి భాగంలో ఉన్న రేక్‌జేన్స్ ద్వీపకల్పంలోని సండక్స్ అగ్ని పర్వతం బద్దలై ఎర్రటి లావా ఇలా ఉబికి వస్తున్నది.

'12 సార్లు హాజరయ్యా.. ఏడింటిని పట్టించుకోవద్దు'

న్యూఢిల్లీ, ఆగస్టు 30: సివిల్ సర్వీస్ ప్రవేశ పరీక్షకు తాను 12 సార్లు హాజరైనప్పటికీ అందులో ఏడింటిని విస్మరించి ఐదింటిని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని మాజీ ఐఏఎస్ ట్రైనీ అధికారిణి పూజా ఖేద్కర్ శుక్రవారం ఢిల్లీ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. జనరల్ క్యాటగిరీ కింద ఏడుసార్లు రాసిన పరీక్షను విస్మరించి, దివ్యాంగ కోటాలో నాలుగుసార్లు రాసిన పరీక్షలను మాత్రమే పరిగణించాలని వాదించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దివ్యాంగ కోటాకు 40 శాతం వైకల్యం ఉండాలని, కానీ తనకు 47 శాతం వైకల్యం ఉన్నట్టు ఆమె కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

కిడ్నాపర్‌ను వదిలి రాని బాలుడు!

కన్నతల్లి దగ్గరకు రానంటూ ఏడుపు



జైపూర్, ఆగస్టు 30: కన్న ప్రేమ కన్నా పెంచిన ప్రేమ చాలా గొప్ప దని అంటారు. దానిని నిజం చేస్తూ 14 నెలల క్రితం కిడ్నాపైన పిల్ల వాడు కిడ్నాపర్‌ను వదిలి కన్న తల్లి వెంట వెళ్లనంటూ ప్రతిఘటించిన ఘటన రాజస్థాన్‌లో చోటుచేసు కుంది. వివరాల్లోకి వెళితే.. యూపీలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ సస్పెండైన తనుజ్ చాహర్ గత ఏడాది జూన్‌లో 11 నెలల పిల్లాడిని కిడ్నాప్ చేసి ఇంటికి తెచ్చాడు. ఇప్పుడు ఆ పిల్లాడికి రెండేళ్లు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని పిల్లా డిని తల్లికి అప్పగించేందుకు ప్రయత్నించారు. అయితే ఆ బాలుడు తనుజే తన తండ్రి అనుకుని అతడిని వదిలి రావడానికి నిరాకరిస్తూ గట్టిగా పట్టుకుని ఏడవడం ప్రారంభించాడు. దీంతో తీవ్ర ఉద్వేగంతో తనుజ్ కూడా కన్నీళ్లు పెట్టుకున్నాడు. పిల్లాడితో పాటు అతని కన్నతల్లిని తన వద్దే ఉండమని కోరాడు. దానికి ఆమె తిర స్కరించింది. కాగా, పిల్లాడిని అపహరించుకు వచ్చిన తర్వాత పోలీసులకు దొర క్కుండా తనుజ్ సాధువుగా వేషం మార్చుకుని యమునా నది ప్రాంతంలోని బృందావన్ పరిక్రమ్ మార్గ్ సమీపంలో నివసిస్తున్నాడు.

ఎండుతున్న పంటలు

వానకాలంలోనూ తిరుమలగిరి మండలంలో కరువు ఛాయలు

- ఎస్సారెస్పీ నుంచి కాల్వలకు అందని నీళ్లు
- అడుగంటిన భూగర్భ జలాలు.. ఆగిపోస్తు బోర్లు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నల వేడుకోలు

తిరుమలగిరి, ఆగస్టు 30: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఒకనాటి కరువు ప్రాంతం తిరుమలగిరి.. బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం జలాలతో జవసత్వాలు నింపుకొని సస్యశ్యామలైంది. నీటి చెమ్మ లేనిచోట పరవళ్లు తొక్కిన గోదావరి జలాలు అన్నదాత ఇంట సిరుల పంట పండించాయి. కానీ ఆ సంతోషం రైతాంగంలో ఎన్నో ఏండ్లు నిలువలేదు. కాంగ్రెస్ పాలన మళ్లీ పాతకాలాన్ని గుర్తుచేస్తూ కరువు కోరల్లోకి నెడుతున్నది. రేవంత్‌రెడ్డి సర్కారులో గోదావరి జలాల జాడలేక వానకాలంలోనూ వరి పైర్లు ఎండిపోతున్నాయి. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్క భారీ వర్షం పడలేదు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా ప్రభుత్వం చెరువులు, కుంటలను నింపకపోవడంతో నీళ్లులేక వెలవెలబోతున్నాయి. వాగులు, వంకలు వట్టిపోయాయి. బిక్కేరు వాగులోనూ నీరు కనిపించడం లేదు. బోర్లు, బావుల ఆధారంగా కొద్దోగొప్పో వేసిన వరి పైర్లు ఎండిపోతున్నాయి. సాగు సిద్ధంగా వేసిన నారుమడుల్లో నారు ముదిరిపోతున్నది. గతంలో 30 ఫీట్ల లోతులో ఉన్న భూగర్భజలాలు ప్రస్తుతం 200 ఫీట్లకు అడుగంటాయి. గోదావరి జలాలు వస్తే 165 గ్రామాలకు నీరు అందించే 69, 70, 71 డీబీఎంల పరిధిలో వరి పైర్లు ఎండిపోతున్నాయి. ప్రస్తుత పరిస్థితులను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో తిరుమలగిరి మండలంలో ఆగస్టు నెలాఖరు వరకు 20 వేల ఎకరాలకు పైగా వరి సాగయ్యేది. ప్రస్తుతం 10 వేల ఎకరాలు కూడా మించలేదు. మూడు వారాల నుంచి వర్షాల్లేకపోవడం, ఎండలు దంచి కొడుతుండడంతో పత్తి, కంది, వేరుశనగ పంటలు వాడిపోతున్నాయి. పత్తి పూత దశకు వచ్చే సమయంలో కాలం కలిసిరాకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. ఇంకో వారం రోజులు వర్షాలు పడకుండా, ఎండలు ఇలా కొడితే పత్తి పూత, గూడ రాలి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.


వెలిశాల 69 డీబీఎం పరిధిలో ఎస్సారెస్పీ కాల్వ పరిస్థితి

కానరాని కాళేశ్వరం జలాలు

తుంగతుర్తి నియోజకవర్గానికి ఎస్సారెస్పీ రెండో దశ కాల్వల ద్వారా సాగునీరు అందాల్సి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 యాసంగిలో సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ప్రస్తుత వర్షాకాలంలోనూ సాగునీటి విడుదలలో స్పష్టత లేకుండా పోయింది. కరీంనగర్ జిల్లాలోని లోయర్ మానేరు డ్యామ్ ద్వారా నీటి విడుదల ఆలస్యం జరుగుతుండడంతో కొడకండ్ల మండల కేంద్రంలోని బయన్న వాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి నీళ్లు చేరతాయా, లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కేసీఆర్ టైమ్‌లో ధోకాలేదు



కేసీఆర్ టైమ్‌లో మాకు నీళ్లకు ధోకా లేకుండే. కాల్వ నీళ్లతోని చెరువులు, కుంటలు నింపడంతో బోర్లు పుష్కలంగా పోశాయి. వర్షాలతో సంబంధం లేకుండా వ్యవసాయం చేసుకునేవాళ్లం. ఇప్పుడు నీళ్లు లేక సాగు చేయాలంటేనే భయమైతున్నది.

–రైతు బాలూనాయక్, మొండిచింత తండా, తిరుమలగిరి మండలం

వేసిన పంట.. పోసిన నారు ఎండుతుంది



రెండెకరాలు వరి నాటుపెట్టిన. నీళ్లు ఇస్తే మరో 2 ఎకరాల వరకు సాగు చేద్దామని నారు పోసిన. వేసిన పంట, పోసిన నారు ఎండుతున్నది. ఎస్సారెస్పీ కాల్వల్లో నీరు వస్తే భూగర్భ జలాలు పెరిగి బోర్లు నిండుగా నీరు పోస్తయి. బోర్లు ఆగి పోస్తున్నయ్.

–రైతు బోయిని కొమరమల్లు, తిరుమలగిరి


ఆంజనేయులు (ఫైల్)

భూమి తక్కువ ఇచ్చారని రైతు ఆత్మహత్య

- అన్నదమ్ముల భూమి పంచాయితీతో మనస్తాపం
- ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం
- నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరులో విషాదం

కోడేరు, ఆగస్టు 30: భూమిలో తనకు రావాల్సిన వాటాను తన్నదమ్ములు తక్కువగా ఇచ్చారన్న మనస్తాపంతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం రాజాపూర్‌లో చోటుచేసుకుంది. రాజాపూర్‌కు చెందిన రేకులపాడు బాలస్వామికి ముగ్గురు కుమారులు. బాలస్వామికి సుమారు 9 ఎకరాల భూమి ఉంది. బాలస్వామి మరణానంతరం మూడేండ్ల కిందట రేకులపాడు ఆంజనేయులుకు కేవలం 1.30 ఎకరాలు మాత్రమే ఇచ్చి.. మిగతా భూమి (సుమారు ఏడెకరాలు)ని ఇద్దరు అన్నదమ్ములు పంచుకున్నారు. తనకు సమాన భాగాలు కాకుండా తక్కువ భూమి ఇచ్చారంటూ అన్నదమ్ముల పంచాయితీ పెద్ద మనుషుల సమక్షంలో నడుస్తున్నది. అయినా.. ఎటూ తేలకపోవడంతో ఆంజనేయులు (40) మనస్తాపానికి గురయ్యాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై ఖయ్యూం తెలిపారు.

సర్కారు అనాలోచిత నిర్ణయంతో రైతులకు నష్టం


- అన్నదాతలు కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటారనే.. కాళేశ్వరం మోటర్లను ఆన్ చేయడం లేదు
- మీడియాతో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఆగ్రహం


కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

మానకొండూర్, ఆగస్టు 30: కాంగ్రెస్ సర్కారు అనాలోచిత నిర్ణయంతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని, కేసీఆర్ గుర్తుకొస్తారనే అక్కసుతోనే కాళేశ్వరం మోటర్లను ఆన్ చేయడం లేదని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మండిపడ్డారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలోని గడిమహల్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రైతుల సాగునీటి కష్టాలు తీర్చితే.. ఆయనపై కోపంతో రేవంత్ సర్కారు రైతుల నోట్లో మట్టికొడుతున్నదని విమర్శించారు. కాళేశ్వరం మోటర్లను ఆన్‌చేసి ఎత్తిపోతలు ప్రారంభిస్తే రైతులు కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటారనే అక్కసుతోనే కాళేశ్వరం నీటిని సముద్రంపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూలై, ఆగస్టు నెలల్లో రోజుకు 10 లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోయినా ప్రభుత్వం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. ప్రస్తుతం మేడిగడ్డ వద్ద లక్షా 75 వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నదని, అయినా సర్కారుకు సోయిలేదని ఫైర్ అయ్యారు. మేడిగడ్డ బరాజ్ గేట్లు మూయకున్నా కన్నెపల్లి పంప్‌హౌజ్ ద్వారా నీళ్లు ఎత్తిపోయవచ్చని నీటిపారుదలశాఖ అధికారులే చెప్తున్నారని వెల్లడించారు. వర్షాలు లేక ఎల్ఎండీ రిజర్వాయర్ ఇప్పటికీ నిండలేదని, ఎల్లంపల్లి ద్వారా నీటిని ఎత్తిపోసి మిడ్‌మానేరు, ఎల్ఎండీ జలాశయాలను నింపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు అప్పు లేదని సర్కారు అబద్ధం!

- రుణమాఫీ చేయకుండా బుకాయింపు
- జీరో బకాయి ఉన్నట్టు వ్యవసాయాధికారుల పత్రం
- బ్యాంక్‌కు వెళ్లి చూస్తే రూ.1,63,258 రుణం
- ఏం చెయ్యాలో తెలియక మదన పడుతున్న రైతు


27–8–2024 తేదీ నాటికి రూ.1,63,258 అప్పు ఉన్నట్లు కొత్తగూడెం కేవీబీ ఇచ్చిన స్టేట్‌మెంట్

టేకులపల్లి, ఆగస్టు 30: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన 'రైతు రుణమాఫీ'లో ఎన్నో చిత్రవిచిత్ర గాథలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా మరో విచిత్రం వెలుగులోకి వచ్చింది. బ్యాంక్‌లో అసలు అప్పునే లేదంటూ ఓ రైతుకు రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం తప్పించుకుంది. పూర్తి వివరాల్లోకెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామానికి చెందిన సూరేపల్లి వెంకట్రావు జిల్లాకేంద్రం కొత్తగూడెంలోని కరూర్ వైశ్యా బ్యాంక్‌లో ఖాతా నెంబర్ 4810272000000047 పేరుతో 2021 ఫిబ్రవరిలో వ్యవసాయ రుణం తీసుకున్నాడు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణమాఫీకి తాను అర్హుడైనప్పటికీ మాఫీ కాలేదు. దీంతో వ్యవసాయ అధికారులను సంప్రదించగా వారు 'రైతు సమాచార పత్రం' చేతిలో పెట్టారు. అది చూసిన రైతు నివ్వెరపోయాడు. 9–12–2023 తేదీ నాటికి తనకు బ్యాంకులో ఉన్న బకాయి జీరో లేదా నెగిటివ్‌లో ఉన్నట్లు దానిలో ఉంది. ఇదేమిటని అధికారులను అడిగితే బ్యాంక్‌లో సంప్రదించాలని ఉచిత సలహా ఇచ్చారు. చేసేదిలేక ఆ రైతు కరూర్ వైశ్యా బ్యాంక్‌కు వెళ్లి స్టేట్‌మెంట్ తీయించగా దానిలో 27–8–2024 తేదీ నాటికి రూ.1,63,258 అప్పు ఉన్నట్లు ఉంది. ఇదెక్కడి విచిత్రమో అర్థంకాక ఆ రైతు తల పట్టుకుంటున్నాడు. తన సమస్యను ఎవరు పరిష్కరిస్తారో తెలియక మదనపడుతున్నాడు.

రుణం మైనస్‌లో ఉందని మాఫీ కాలే..



నాకు కొత్తగూడెం కరూర్ వైశ్యా బ్యాంక్‌లో రూ.లక్షన్నర పైన అప్పు ఉంది. మాఫీ కాలేదు. వ్యవసాయ అధికారులను అడిగితే 9–12–2023 నాటికి బ్యాంక్‌లో బకాయి ఉన్న రుణం సున్నా ఉన్నట్టు చెప్పారు. ఇదేమిటని అడిగితే సరైన సమాధానం లేదు. పెద్దసార్లు స్పందించి నాకు రుణమాఫీ వర్తింపజేయాలి. - ఎస్.వెంకట్రావు, టేకులపల్లి

యూరియా కోసం రైతుల అగచాట్లు


రాయపర్తి, ఆగస్టు 30: యూరియా కోసం అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద 40 గ్రామపంచాయతీల పరిధిలోని రైతన్నలు శుక్రవారం యూరియా బస్తాల కోసం బారులు తీరారు. పీఏసీఎస్‌లో యూరియా బస్తా రూ.275కే ఇస్తుండగా, ప్రైవేట్ దుకాణాల వద్ద రూ.350 వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రోజంతా క్యూలో నిలబడితే ఆధార్ కార్డుకు 5 యూరియా బస్తాలే ఇస్తున్నారని పెదవి విరుస్తున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి గుమ్మడి వీరభద్రంను వివరణ కోరగా రోజుకు రెండు లారీల్లో 80 టన్నుల యూరియా బస్తాలను తెప్పించి పంపిణీ చేయిస్తున్నామని, రైతులంతా ఒక్కసారిగా ఎగబడుతుండడంతో లైన్లు కన్పిస్తున్నాయని చెప్పారు.

అరేబియాలో 'అస్నా' తుఫాన్

న్యూఢిల్లీ, ఆగస్టు 30: అరేబియా సముద్రంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కచ్ తీరం, పరిసర పాకిస్థాన్ ప్రాంతాల్లో 'అస్నా' సైక్లోన్‌గా మార్పు చెందిందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) శుక్రవారం వెల్లడించింది. ఇది వాయువ్య దిశగా సాగుతున్నదని, రాబోవు రెండు రోజుల్లో భారత తీరానికి దూరంగా వెళ్లే అవకాశం ఉన్నదని అంచనా వేసింది. కాగా, అరేబియా సముద్రంలో అల్పపీడనం కారణంగా గుజరాత్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షాలు కురిశాయి. దీంతో కొన్ని చోట్ల వరద పరిస్థితులు నెలకొన్నాయి. 1976 తర్వాత అరేబియా సముద్రంలో ఆగస్టులో తుఫాన్ ఏర్పటడం ఇదే తొలిసారి.

రుణమాఫీ కోసం పాదయాత్ర

- ఆరు కి.మీ నడిచిన అన్నదాతలు
- ఆందోళనలు చేస్తే కేసులు పెడుతున్నారని ఆదిలాబాద్ జిల్లాలో వినూత్నంగా నిరసన
- కాలినడకన వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం


ఆదిలాబాద్ జిల్లా తాంసి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఆదిలాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : రుణమాఫీ కోసం అన్నదాతల ఆందోళనలు, నిరసనలు కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీ విషయంలో చేసిన మోసాన్ని ఎండగడుతూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయడంతో ఆదిలాబాద్ జిల్లాలో 15మంది రైతులపై కేసులు నమోదయ్యాయి. దీంతో రైతులు నిరసనకు వినూత్న మార్గాన్ని ఎంచుకున్నారు. ఇదే జిల్లాలోని తాంసి మండలం కప్పర్లకు చెందిన వందమంది రైతులు శుక్రవారం తమ ఊరి నుంచి పాదయాత్ర చేపట్టారు. ఆరు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తమకు రూ.2 లక్షల రుణమాఫీ కాలేదని వాపోయారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా పట్టాపాస్‌లు పుస్తకం ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు నిబంధనల పేరిట ఎగ్గొట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. కప్పర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంకు, తాంసి కో ఆపరేటివ్ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న 70 శాతం మందికి రుణమాఫీ కాలేదని చెప్పారు. మూడు విడుతల్లో కలిపి 200 మంది రైతులకు మాఫీ వర్తించలేదని, బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని మండిపడ్డారు. అందుకే శాంతియుతంగా నిరసన తెలిపేందుకు పాదయాత్రగా వచ్చినట్టు చెప్పారు. అనంతరం తమకు రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ లక్ష్మి, వ్యవసాయశాఖ అధికారి రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు.

రూ. 1.64 లక్షల లోన్ మాఫీకాలే



నాలుగు ఎకరాలపై నేను తాంసి మండలం కప్పర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ. 1.64 లక్షల లోన్ తీసుకున్న. ఏటా రెన్యూవల్ చేసుకుంటున్న. నా భార్య పేరిట భూమి ఉన్నా లోన్ తీసుకోలే. నా ఒక్కని పేరుమీదే ఖాతా ఉన్నది. నాకు మూడు విడుతల్లోనూ రుణమాఫీ కాలే. వ్యవసాయ అధికారులను అడిగితే డాటా నాట్ ఫౌండ్ అని వస్తుందంటున్నరు. బ్యాంకు అధికారులను అడిగితే వివరాలు పంపకపోవడం వల్లే రుణమాఫీ కాలేదంటున్నరు. రుణమాఫీకి అర్హుడిగా ఉన్న నా లోన్‌ను రద్దు చేయాలి.

– చిన్న రాములు, కప్పర్ల, తాంసి మండలం, ఆదిలాబాద్

నేను రైతును కాదా?



నేను కప్పర్ల గ్రామీణ బ్యాంకులో రూ. 1.60 లక్షలు రుణం తీసుకున్న. రేవంత్‌రెడ్డి చెప్పినట్టు నా లోన్ మూడో విడుతలో మాఫీ అవుతదనుకున్న. కానీ లిస్టులో నాపేరు లేదు. సార్లను అడిగితే నీ లోన్ వివరాలు పంపించినం అంటున్నరు. నేను రైతును కాదా ? నాకు రుణమాఫీ ఎందుకు కాలే? పాత సర్కారు చెప్పినకాడికి అందరికీ రుణమాఫీ చేసింది. వీళ్లు మాత్రం కొందరికే ఇచ్చి చాలామందికి మాఫీ చెయ్యలే. మా బాధను అర్థం చేసుకొని రుణమాఫీ చెయ్యాలి.

– గుజ్జటి రాందాస్, కప్పర్ల

8 నెలల నుంచి ఎదురుచూస్తే నిరాశే



నాకు కప్పర్ల శివారులో మూడెకరాల భూమి ఉన్నది. బ్యాంకులో రూ.1.70 లక్షల పంటరుణం తీసుకున్న. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టు నాకు లోన్ మాఫీ అవుతదని 8 నెలల నుంచి ఎదురుచూస్తున్న. మూడో విడుత ప్రకటించిన జాబితాలో నా పేరు లేదు. వ్యవసాయ పనులు వదిలి అధికారుల చుట్టూ తిరుగుతున్న. ప్రభుత్వం ముందుగా చెప్పినట్టు షరతుల్లేకుండా 2 లక్షల రుణమాఫీ చెయ్యాలి.

– నీరటి రాకేశ్, కప్పర్ల, తాంసి మండలం, ఆదిలాబాద్


బ్యాంకు వద్ద పడిగాపులు


జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని శివునిపల్లి బ్యాంక్ ఆఫ్ బరోడా తీయకముందే మాఫీపై విచారణ కోసం వేచి ఉన్న రైతులు

షరతుల్లేని రుణమాఫీ కావాలి



షరతుల్లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని శుక్రవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలకేంద్రంలోని కుమ్రంభీం చౌరస్తాలో అఖిలపక్షం, తుడుందెబ్బ ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ సారా రమేశ్ గౌడ్, బీజేపీ మండలాధ్యక్షుడు పులి వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ మంచు శ్రీనివాస్, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంతరావు, రైతులు పాల్గొన్నారు. –తిర్యాణి


పెద్దపల్లి జిల్లా ముత్తారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవోకు దండం పెట్టి వేడుకుంటున్న ఓడేడు గ్రామానికి చెందిన రైతు అల్లాడి రవీందర్‌రావు

మీకో దండం సారూ..!

- ఆధార్ నంబర్ తప్పు.. ఇద్దరు రైతులకు శాపం
- పెద్దపల్లి జిల్లా ముత్తారం పీఏసీ ఎస్‌లో ఘటన

ముత్తారం, ఆగస్టు 30 : ఆధార్ నెంబర్ తప్పుగా నమోదు చేయడం ఇద్దరు రైతులకు శాపంగా మారింది. పెద్దపల్లి జిల్లా ముత్తారం పీఏసీఎస్‌లో జరిగిన ఈ ఘటనతో ఖంగుతిన్న ఆ రైతులు మీకో దండం సారు.. నాకు రుణమాఫీ చేయండి మహాప్రభో అంటూ అధికారులను వేడుకున్నారు. ముత్తారం మండలంలోని ఓడేడుకు చెందిన అల్లాడి రవీందర్‌రావు ముత్తారంలోని ఎస్‌బీఐలో రూ.1.65 లక్షల పైచిలుకు రుణం తీసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన మరో అల్లాడి రవీందర్‌రావు ముత్తారం ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ద్వారా వ్యవసాయం కోసం రూ.50 వేల పైచిలుకు రుణాన్ని పొందాడు. అధికారులు రూ.50 వేల రుణం తీసుకున్న అల్లాడి రవీందర్‌రావు ఆధార్ నెంబర్‌కు బదులు ఎస్‌బీఐలో రూ.1.65 లక్షల రుణం తీసుకున్న అల్లాడి రవీందర్‌రావు ఆధార్ నెంబర్‌ను తప్పుగా నమోదు చేశారు. దీంతో పీఏసీఎస్‌లో రుణం తీసుకున్న అల్లాడి రవీందర్‌రావు పేరిట రూ.2.15 లక్షల పైచిలుకు రుణం ఉన్నట్టు చూపించడంతో ఆయనకు రుణమాఫీ జరగలేదు. మరోవైపు రూ.50 వేలు తీసుకున్న రవీందర్‌రావు ఆధార్ నమోదు కాక ఆయనకూ రుణమాఫీ కాలేదు. దీంతో రవీందర్‌రావు శుక్రవారం పీఏసీఎస్‌కు వచ్చి సీఈవోను ప్రశ్నించారు. తనకు రుణమాఫీ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆత్మహత్యే శరణ్యమని కన్నీటి పర్యంతమయ్యాడు. దీనిపై పీఏసీఎస్ సీఈవో ప్రసాద్‌ను వివరణ కోరగా తప్పిదం జరిగిన విషయం వాస్తవమేనని ఒప్పుకున్నాడు.

అక్రమాలతోనే మాఫీ కోల్పోయాం




నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలోని హుమ్నాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అక్రమాల వల్లే రుణమాఫీ కోల్పోయామని శుక్రవారం రుద్రూర్ మండలం బొప్పాపూర్ రైతులు ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వానికి రైతుల అసలు బాకీ చూపించకుండా తక్కువ చేసి చూపించడంతో బొప్పాపూర్‌కు చెందిన 50మంది రైతులు రుణమాఫీ కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. – రుద్రూర్

తహసీల్ ఎదుట రైతుల ధర్నా



షరతుల్లేకుండా రైతులకు 2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో జనగామ జిల్లా చిల్పూరు తహసీల్ ఎదుట రైతులు ధర్నా చేశారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ మహేశ్వరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రమేశ్, సంపత్, రాజు, శ్రీనివాస్, రవి, మల్లయ్య, భీమయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు. – చిల్పూరు

మాకెప్పుడు రుణమాఫీ?



మాకెప్పుడు రుణమాఫీ అంటూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ఎస్‌బీఐ ఎదుట రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. రూ.2 లక్షలపైన రుణం ఉన్నవారు మిగిలిన డబ్బులు ఖాతాల్లో జమ చేయటానికి బ్యాంకుకు వెళ్తే.. అలాంటిదేమీలేదని బ్యాంకర్లు మాఫీపై సీఎంనే అడగాలని సమాధానమిస్తున్నారని వాపోయారు. – కల్వకుర్తి

డ్వాక్రారుణాలకు రుణమాఫీ డబ్బులా?



నా భార్యకు మహబూబాబాద్‌లోని ఇండియన్ బ్యాంకులో డ్వాక్రా గ్రూప్‌పై రూ. 60 వేలు అప్పు ఉంది. ఈ డబ్బులు కడితేనే నా పేరు మీద ఉన్న రుణమాఫీ అవుతుందని బ్యాంకు అధికారులు చెప్తాన్రు. లేకపోతే అందులోనే ఉన్న డబ్బులను డ్వాక్రా అప్పుకు కట్ చేస్తామంటున్నరు. పెట్టుబడి కోసం ఇచ్చిన డబ్బులను అట్లా చేయవద్దని చెప్పిన. ఇండియన్ బ్యాంకు అధికారులు ఒప్పుకోవడం లేదు. డ్వాక్రా రుణాలకు తరలించకుండా రుణమాఫీ అయ్యేలా న్యాయం చేయాలె.

– గుగులోత్ సీతారాం, రైతు, బేతోలు, మహబూబాబాద్




కూల్చివేతలు చట్టానికి లోబడే ఉండాలి

- గాయత్రి, అనురాగ్, నీలిమ విద్యా సంస్థల నిర్మాణాల కేసులో హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ,అనురాగ్ యూనివర్సిటీ నిర్మాణాలను తొలగించేందుకు చేపట్టే చర్యలు నిబంధనలకు లోబడే ఉండాలని హైకోర్టు తేల్చిచెప్పింది. ఆయా విద్యాసంస్థలు చూపే ఆధారాలను లోతుగా పరిశీలించాలని, చెరువులో ఉన్నట్టు నిర్ధారణ అయ్యాకే నిర్మాణాలను తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టులో గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, అనురాగ్ యూనివర్సిటీ, నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ టీ వినోద్‌కుమార్ శుక్రవారం మరోసారి విచారణ జరిపారు.భూములపత్రాలు, వివరాలను అందజేశాక వాటిని పరిశీలించి వివరణ ఇచ్చేందుకు కనీసం వారం రోజులు గడువు ఉండేలా చూడాలని పిటిషనర్ల తరపు న్యాయవాది కోరారు. దీనిపై ప్రభుత్వం తరపున ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ.. నాదం చెరువుకు సంబంధించిన సర్వే మ్యాప్‌ను పరిశీలించాలని హైకోర్టును కోరారు. 1951-54 కాస్రా పహాణీ ప్రకారం.. 61 ఎకరాల విస్తీర్ణంలో చెరువు, అక్కడి నుంచి 30 మీటర్ల మేరకు బఫర్‌జోన్ ఉన్నదని, పిటిషనర్ల నిర్మాణాలు ఈ బఫర్‌జోన్‌లోనే ఉన్నాయని తెలిపారు. చట్టానికి లోబడే చర్యలు చేపడతామని, ఆక్రమణల నిర్ధారణకు సంబంధించిన పత్రాలను పిటిషనర్లకు అందజేశాకే తదుపరి చర్యలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈలోగా పిటిషనర్లు ఇతర నిర్మాణాలు చేపట్టకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. ఎప్పుడో 1970 నాటి సర్వేలపై ఆధారపడటం కంటే సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌ల ఆధారంగా చెరువు విస్తీర్ణాన్ని నిర్ధారిస్తే బాగుటుందని పేర్కొన్నారు. విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చే వరకు ఆక్రమణల తొలగింపులు ఉండవని చెప్తున్నప్పుడు చెరువు విస్తీర్ణాన్ని సర్వే ఆఫ్ ఇండియా ఎస్‌ఆర్‌ఎల్‌సీ మ్యాప్‌ల ఆధారంగా నిర్ధారిస్తేనే బాటుందని అభిప్రాయపడుతూ.. ఈ పిటిషన్లపై విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించింది.

స్పోర్ట్స్ వెంచర్ కూల్చివేత బాధాకరం: పల్లంరాజు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): తన సోదరుడి స్పోర్ట్స్ వెంచర్‌ను అక్రమ నిర్మాణం పేరుతో ముందస్తు నోటీసులు లేకుండా హైడ్రా కూల్చివేడయం బాధాకరమని మాజీ కేంద్రమంత్రి ఎంఎం పల్లంరాజు అన్నారు. ప్రజాజీవితంలో స్వచ్ఛమైన రికార్డును కలిగి ఉన్న తమపై ఇలాంటి ఆరోపణలు రావడం బాధగా ఉందన్నారు. తన సోదరుడు ఆనంద్ 7 ఎకరాలు భూమి లీజుకు తీసుకొని స్పోర్ట్స్ వెంచర్ (ఆర్‌వోఆర్) ఏర్పాటు చేశారని, ఇందుకోసం తీసుకున్న అనుమతులను పరిగణనలోకి తీసుకోకుండా, నోటీసు లేకుండా కూల్చివేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్‌వోఆర్ 2015 నుంచి పనిచేస్తున్నదని, ఆనంద్ కష్టపడి సంపాదించిన డబ్బులతో దీన్ని ఏర్పాటు చేశారని పల్లంరాజు ఎక్స్‌లో పోస్టు చేశారు.









..సౌధాలు కట్టి!

మొదటిపేజీ తరువాయి...

ఉన్న ప్రాంతాన్నే ఎఫ్‌టీఎల్‌గా భ్రమింపజేస్తూ తమ నిర్మాణాలకు ఎఫ్‌టీఎల్ దూరంగా ఉన్నదంటూ సదరు నేతలు ప్రకటనలు చేస్తున్నారు. మంత్రి పొంగులేటి ఒకడుగు ముందుకేసి 'కొత్త టేపులు తెచ్చి కొలుచుకోండి! ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉంటే కూల్చుకోండి!' అంటూ ఆఫర్లు ఇస్తున్నారు. మరి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ గుట్టును గూగులమ్మ తల్లి రట్టు చేసింది. ఇదంతా ఒకెత్తయితే జలమండలి మెమో ప్రకారం అర కిలోమీటర్ ఉత్తర్వులు అలాగే ఉన్నాయి. పైపెచ్చు భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన జీవో 168 కూడా ఇంకా అమల్లోనే ఉన్నది. ఇక సవాళ్లు, ప్రతి సవాళ్లకు తావెక్కడ? నిగ్గు తేల్చాల్సింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే! దాని కనుసన్నల్లో నడుస్తున్న హైడ్రానే!

ఫొటో-1
హిమాయత్‌సాగర్ జలాశయానికి సంబంధించి 2011 గూగుల్ మ్యాప్ ఇది. 2011 ఫిబ్రవరిలో జలాశయంలో ఒడ్డు (17*20'47.89"N-లాంగిట్యూడ్, 78*21'33.35"E - లాటిట్యూడ్) వద్ద ఉన్నది. అది ఫిబ్రవరి కావడంతో వానకాలంలో ఎగువ నుంచి వరద వస్తే ఇంకా నీటి నిల్వ పెరిగి ఒడ్డు ముందుకు వస్తుంది. అంటే ఎఫ్‌టీఎల్ ఇంకా ముందుకు జరుగుతుంది. ఆ సమయంలో ఎఫ్‌టీఎల్‌కు కొంత దూరంలో నామమాత్రపు నిర్మాణాలు కనిపిస్తున్నాయి.

ఫొటో-2
ఇదీ హిమాయత్‌సాగర్ జలాశయానికి సంబంధించి ఈ ఏడాది మార్చి గూగుల్ మ్యాప్. జలాశయం ఒడ్డు చాలా కుచించుకుపోయింది. 2011 ఫిబ్రవరిలో కనిపిస్తున్న దరి (లాంగిట్యూడ్, లాటిట్యూడ్)ని మార్క్ చేస్తే సరిగ్గా మ్యాప్‌లో కనిపిస్తున్న నిర్మాణాల దగ్గరకు వచ్చింది. అంటే 2011లో అక్కడి వరకు జలాశయంలో నీళ్లున్నాయన్న మాట! దాని ప్రకారం జలాశయం పూర్తిస్థాయి నిల్వకు చేరుకుంటే నీళ్లు ఇంకా ముందుకు నిర్మాణాలను దాటి పోతాయి. అంటే కచ్చితంగా ఆ నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ లోపలో, అంచునో ఉన్నాయనేది గూగులమ్మ విప్పిన గుట్టు! ఇక బఫర్‌జోన్ అంటారా?.. అందులో సందేహమే లేదు. ఇంతకీ ఆ నిర్మాణాలు ఎవరివో తెలుసు కదా! సాక్షాత్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆయన సోదరుడికి సంబంధించిన గృహాలు.

ఫొటో-3
ఇది కూడా 2011, ఫిబ్రవరిలో హిమాయత్‌సాగర్ జలాశయానికి సంబంధించిన మ్యాప్. ఇందులో అప్పటికే కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు జలాశయం చెంతన కొలువుదీరారు. గెస్ట్‌హౌస్‌కు అనంతం అని నామకరణం కూడా చేసుకున్నారు. దాని పక్కనే అనన్య పేరిట మరో గెస్ట్‌హౌస్ కూడా కనిపిస్తుంది. అది కూడా ఒక రాజకీయ ప్రముఖుడిదేనన్న ప్రచారం ఉన్నది. అప్పట్లో కేవలం రెండు గెస్ట్‌హౌస్‌ల్లో ఒకటి చొప్పున నిర్మాణం ఉన్నది. జలాశయం ఎఫ్‌టీఎల్ కూడా దూరంగా కనిపిస్తుంది.

ఫొటో-4
ఇది ఈ ఏడాది మార్చిలో అనంతం, అనన్య గెస్ట్‌హౌస్‌లకు సంబంధించిన గూగుల్ మ్యాప్. రెండు చోట్లా భారీ నిర్మాణాలు పెరిగిపోయాయి. నివాస సముదాయాలతో పాటు గార్డెనింగ్ కోసం చేపట్టిన పనుల్లో పెద్ద ఎత్తున కాంక్రీట్ పనులు కూడా చేశారు. మరోవైపు హిమాయత్‌సాగర్ జలాశయం ఈ నిర్మాణాలకు వణికి వెనక్కి పోయింది. ఈ రెండు మ్యాప్‌లు కూడా జలాశయానికి వరదలేని సమయాల్లో (అన్‌సీజన్) తీసుకున్నవి. పూర్తిస్థాయి నీటి నిల్వ సమయంలో కచ్చితంగా దరి ఇంకా ముందుకు ఉంటుంది. ఇవీ.. హిమాయత్‌సాగర్ నోట్లో మట్టి కొట్టిన తీరు!


సూరం చెరువు

హైడ్రా.. ఇటు చూడు

మొదటిపేజీ తరువాయి...

దిగిన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి!. అందుకే తొలుత ఈ ప్రాజెక్టుకు 'కేఎల్‌ఆర్ గిగా' అని, తర్వాత 'వర్టెక్స్-కేఎల్‌ఆర్ గిగా సిటీ' అని పేరు పెట్టారు. ఏండ్ల కింద కష్టపడి కట్టుకున్న పేదోళ్ల గూడుపైకి బుల్డోజర్లను పంపిస్తున్న హైడ్రా, మరి చెరువును ఆనుకొనే ఉన్న ఈ వెంచర్ వైపు ఎందుకు చూడడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వరదకూ అడ్డం!

రంగారెడ్డి జిల్లా మంఖాల్ రెవెన్యూ గ్రామ పరిధిలో సూరం చెరువు అలియాస్ సూరారావు చెరువు ఉన్నది. సర్వేనంబరు 139లో 40.20 ఎకరాలు, 140లో 20.12 ఎకరాలు మొత్తం 60.32 ఎకరాల విస్తీర్ణంలో ఇది విస్తరించి ఉండేది. ఎగువన శంషాబాద్, పహాడీ షరీఫ్ ప్రాంతాల నుంచి భారీగా వరద వచ్చి ఈ చెరువులో చేరుతుంది. చెరువు సమీపంలో నాలుగైదేండ్ల కిందట రియల్ వెంచర్ రూపుదిద్దుకున్నది. కేఎల్‌ఆర్ గిగా సిటీ పేరుతో మొదలైన ఈ వెంచర్ క్రమంగా చెరువు వైపు విస్తరించింది. వరద వచ్చే మార్గాన్ని సైతం నియంత్రించేలా నిర్మాణాలు వెలిశాయి. వెంచర్‌లో మధ్యలోంచి ఉన్న ఈ మార్గంలో తొలుత సిమెంటు పైపులు వేశారు. గ్రామస్తులు నిలదీయడంతో చివరికి డ్రెయిన్ బాక్సులు నిర్మించారు. కానీ ఆ మార్గాన్ని పూర్తిగా చెరువు వరకు నిర్మించలేదు. దీంతో వరద చెరువులోకి వెళ్లడం ప్రశ్నార్థకంగా మారింది. ఒకప్పుడు 60.32 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువు ప్రస్తుతం సగమే ఉన్నట్టు గ్రామస్థులు చెబుతున్నారు. చెరువు భూమిని వెంచర్‌లోకి మలుపుకొన్నారని ఆరోపిస్తున్నారు.

నోరెత్తని నీటిపారుదల శాఖ

సూరం చెరువు దుస్థితిపై నీటిపారుదల శాఖ డీఈఈ బీడీ నాయక్‌ను సంప్రదించగా చెరువులన్నింటినీ సర్వే చేసి, ఎఫ్‌టీఎల్‌ను కూడా గుర్తించామని చెప్పారు. కానీ, సూరం చెరువు ఐడీని వెల్లడించమంటే ప్రస్తుతం తన దగ్గర అందుబాటులో లేదన్నారు. ఆపై ఆ అధికారి ఫోనెత్తడమే మానేశారు. నీటిపారుదల శాఖ రికార్డులను పరిశీలిస్తే అధికారుల లీలలు బయటపడ్డాయి. 139, 140 సర్వే నంబర్లలో సూరం చెరువు 60.32 ఎకరాల మేర విస్తరించి ఉన్నదని రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా ఉన్నట్టు నీటిపారుదల శాఖ నివేదికలో ఉన్నది. కానీ ఎఫ్‌టీఎల్ ఏమైనా ఆక్రమణకు గురైందా? అనే కాలంలో మాత్రం అదేం లేదని నమోదు చేశారు. చెరువును ఆనుకొని కళ్లెదుటే నిర్మాణాలు కనిపిస్తున్నా ఆక్రమణలు లేవని పేర్కొనడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముమ్ముందు ఈ ప్రాంతం మరింత ఆక్రమణకు గురికాకముందే చెరువును పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని, లేదంటే ఎగువ నుంచి వచ్చే వరద ఇతర ప్రాంతాలను ముంచెత్తే ప్రమాదముందని స్థానికులతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన తుక్కుగూడ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ భవాని వెంకట్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రంలో బుల్డోజర్‌రాజ్

- హైడ్రా కూల్చివేతలపై అనేక అనుమానాలు
- ఎంపిక చేసిన నిర్మాణాలపైనే కూల్చివేత: దాసోజు శ్రవణ్



హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): చెరువు రక్షణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకానికి పాల్పడుతున్నదని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యానాథ్ అనుసరించిన బుల్డోజర్ రాజ్‌ను తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. హైడ్రాపై ప్రజల్లో అనేక అనుమానాలున్నాయని, వాటిని నివృత్తి చేసి తమది పారదర్శకమైన ప్రభుత్వమని నిరూపించుకోవాలని సూచించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఆయన లేఖ రాశారు. మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లోని రాంనగర్‌లో పేద, మధ్యతరగతి కుటుంబాల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని రాత్రికి రాత్రే చేపట్టిన కూల్చివేతలపై ఆయన భగ్గుమన్నారు. ప్రభుత్వం తక్షణమే ఆ క్రమణలకు గురైన చెరువులు, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలను ఎప్పటికప్పుడు వెల్లడించాలని తెలిపారు. ఎంపిక చేసిన నిర్మాణాలను మాత్రమే కూల్చివేస్తున్నారనే అనుమానాలు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పూర్తి డేటా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణను మరో బుల్డోజర్ రాజ్ కానివ్వొద్దు

- ఖర్గేకు కేటీఆర్ సూచన
- పేదల ఇండ్లు కూల్చడంపై ఆవేదన
- మీరు సమర్థిస్తారా? అని ప్రశ్న



హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మరో బుల్డోజర్ రాజ్ కాకుండా చూడాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గేను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. ఆ దిశగా రేవంత్‌రెడ్డి సర్కార్‌కు సూచించాలని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయాన్ని, చట్టాన్ని ఉల్లంఘిస్తూ పేదలకు గూడు లేకుండా చేసే ప్రయత్నాన్ని సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. 'ఒకరి ఇంటిని కూల్చివేసి వారి కుటుంబాన్ని నిరాశ్రయలుగా మార్చడం అమానవీయం, అన్యాయం అని గతంలో మీరే అన్నారు. ఇప్పుడు తెలంగాణలో కూడా పేదల ఇళ్లను అదే విధంగా కూల్చేస్తూ వారిని నిరాశ్రయులు చేస్తున్నారు. దీనికి మీ సమాధానం ఏమిటి?' అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని 75 మంది పేదల ఇండ్లను తెల్లవారుజామున 3 గంటలకు ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేసిన ఘటనను ఎక్స్ ద్వారా మల్లికార్జున్ ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చేసిన 75 ఇండ్లలో 25 కుటుంబాలు దివ్యాంగులకు చెందినవేనని ఆవేదన వ్యక్తం చేశారు. 20 నుంచి 40 ఏండ్ల క్రితం ఇండ్లు కట్టుకొని నివాసం ఉంటున్న పేదలకు ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చేస్తుండడం అమానవీయమని పేర్కొన్నారు. తెలంగాణ మరో బుల్డోజర్ రాజ్ కాకుండా ఉండేందుకు ప్రభుత్వానికి తగిన సూచనలు చేయాలని ఖర్గేను కోరారు.

పెద్దోళ్లను వదిలి పేదలపై పడ్తరా?



మొదటిపేజీ తరువాయి...

విమర్శించారు. కూల్చివేతలపై న్యాయస్థానాలు సుమోటోగా కేసు నమోదు చేయాలని, బీఆర్‌ఎస్ తరపున న్యాయపరంగా పోరాటం చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్‌లోని అంధుల కాలనీకి అర్ధరాత్రి 400 మంది పోలీసులు వెళ్లి ఇండ్లను కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సామగ్రి తీసుకునేందుకు సమయం ఇవ్వమని కోరినా ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారని తెలిపారు. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వీరికి పట్టాలు ఇస్తే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ నీళ్లు, కరెంటు ఇచ్చిందని వివరించారు. పింఛన్ డబ్బులతో వారు ఇండ్లు నిర్మించుకున్నారని పేర్కొన్నారు. వారికి పట్టాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడ చెరువు లేదని, కుంట లేదని, కోట్ల విలువ చేసే భూమి కూడా కాదని, అయినప్పటికీ ఎందుకు కూల్చారని ప్రశ్నించారు.

మానవీయ కోణంలో స్పందించాలి

పేదల కోసం కాంగ్రెస్ ఎన్ని ఇండ్లు కట్టిందో తెలియదు కానీ, కట్టుకున్న ఇండ్లను మాత్రం కూల్చివేస్తున్నదని శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలన్నీ మానవీయ కోణంలో స్పందించాలని కోరారు. ఇండ్ల కూల్చివేతలో పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. దివ్యాంగుల రూ. 4 వేల పింఛన్‌ను రూ. 6 వేలకు పెంచుతామని ఇప్పటి వరకు పెంచలేదని విమర్శించారు. కూల్చివేతల విషయంలో పేదల తరపున బీఆర్‌ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి డబ్బులే కావాలనుకుంటే బిచ్చమెత్తి అయినా నిధులు సమకూరుస్తామని చెప్పారు. తాను ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలపై కొందరు తప్పుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లు కూల్చొద్దు: తమ్మినేని

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లు కూల్చొద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో జలవనరుల సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకువచ్చిన హైడ్రా ఆహ్వానించదగ్గదే అని చెప్పారు. మహబూబ్‌నగర్‌లో 12 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 78 మంది దివ్యాంగులకు ఇళ్లపట్టాలు ఇవ్వగా వారు ఇండ్లు కట్టుకుని నివసిస్తున్నారని, ఆక్రమణల పేరుతో గురువారం బుల్డోజర్లతో కూల్చివేయడంతో వారంతా రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లోని హస్మత్‌పేట్, అల్వాల్‌లో పేదల ఇళ్లు నేలమట్టం చేశారని విమర్శించారు. ఆక్రమణలు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పేరుతో పేదలను బజారుపాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.


టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ పవన్

ఎల్బీనగర్‌లో 'హైడ్రా' కూల్చివేతలు

హైదరాబాద్ (ఎల్బీనగర్), ఆగస్టు 30: ఎల్బీనగర్ పరిధి సరూర్‌నగర్‌లో మారుతీనగర్‌లో శుక్రవారం హైడ్రా అధికారులు ఓ భవనం కూల్చివేతకు ప్రయత్నించగా కార్పొరేటర్ పవన్‌కుమా ర్ అడ్డుకున్నారు. ఎల్బీనగర్ సర్కిల్‌లో 36 అక్రమ నిర్మాణాలను గుర్తించిన అధికారులు 15 నిర్మాణాలను కూల్చారు. సరూర్‌నగర్ సర్కిల్‌లో 32 అక్రమ నిర్మాణాల్లో 12 నిర్మాణాలను నేలమట్టం చేశారు.



మరో చేనేత యువకుడి ఆత్మహత్య

దుబ్బాక, ఆగస్టు 30: ఆర్థిక ఇబ్బందులతో చేనేత కుటుంబానికి చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీలో చేనేత కార్మికుడు తుమ్మ రాజలింగం-సత్యవతి కుటుంబంతో నివసిస్తున్నారు. చేనేత పని లేకపోవడంతో రాజలింగం బీడీ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడి భార్య సత్యవతి బీడీ కార్మికురాలు. వీరి కుమారుడు తుమ్మ నవీన్ (29) సిద్దిపేటలో ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్నాడు. నవీన్‌కు సిద్దిపేటకు చెందిన ఓ యువతితో నాలుగేండ్ల కిందట వివాహం జరిగింది. చాలీచాలని జీతంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో నవీన్ తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు దుబ్బాక పోలీసులు తెలిపారు.



- **ప్రాణం మీదికి తెచ్చిన సెల్ఫీ సరదా**

నల్లగొండ జిల్లా వేములపల్లి సమీపంలో శుక్రవారం భర్త, తమ్ముడు, కూతురుతో కలిసి కారులో హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ మహిళ నాగార్జునసాగర్ ఎడమ కాల్వను చూసి ఆగింది. రైలింగ్ వద్ద సెల్ఫీ దిగుతుండగా పట్టుతప్పి కాల్వలో పడిపోయింది. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో పక్కనే ఉన్న గజలాపురం యువకులు జక్కా నాగయ్య, జక్కా నాగరాజు మహిళను కాపాడేందుకు కాల్వలో దూకారు. మరికొందరు పైనుంచి తాడు విసరడంతో ఆమెను క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. ఆ మహిళ వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వివరాలు తెలియరాలేదు. నాగయ్య, నాగరాజును స్థానికులు అభినందించారు.



- **ప్రభుత్వ దవాఖానలో పశువులు**

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇలాకా.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ప్రభుత్వ దవాఖాన పశువులు, వీధి కుక్కలకు ఆవాసంగా మారింది. మహదేవ్‌పూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పరిసరాలు అధ్వానంగా ఉండటంతో దవాఖాన లోపలికి పట్టపగలే పశువులు చేరుతున్నాయి.

-జయశంకర్ భూపాలపల్లి



- **ఆర్టీసీ బస్సులు పెంచాలంటూ మహిళల ధర్నా**

ప్రయాణికుల రద్దీని బట్టి ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు శుక్రవారం నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా చేశారు. ప్రయాణికుల నుంచి సంతకాల సేకరణ చేపట్టి నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. మహాలక్ష్మీ పథకంతో బస్సుల్లో రద్దీ పెరగడంతో ప్రయాణికులంతా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి, రాజన్న, గంగామణి, కవిత, విజయ, వసంత, తస్రీన్ తదితరులు పాల్గొన్నారు.



డెంగ్యూ చికిత్సకు 25 లక్షలు పెట్టినా బతకలే!

సిద్దిపేట అర్బన్/పాపన్నపేట,ఆగస్టు 30: ఉమ్మడి మెదక్ జిల్లాలో డెంగ్యూతో ఇద్దరు మృతి చెందారు. సిద్దిపేట జిల్లా తడ్కపల్లికి చెందిన సుతారి కనకలక్ష్మి(28)కి డెంగ్యూ వచ్చింది. సిద్దిపేట, హైదరాబాద్‌లోని పలు ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం చేయించారు. దాదాపు 25 లక్షలు ఖర్చుపెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆరోగ్యం విషమించి గురువారం రాత్రి మృతిచెందారు.

మెదక్ జిల్లాలో విద్యార్థి మృతి

మెదక్ జిల్లా పాపన్నపేట మండలం చీకోడ్ గ్రామానికి చెందిన వడ్ల రాజు పెద్ద కొడుకు హర్షిత్ చారి (11) స్థానిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. వారం క్రితం డెంగ్యూ బారినపడగా మెదక్, హైదరాబాద్‌లోని దవాఖానల్లో చికిత్స అందించారు. పరిస్థితి విషమించి గురువారం రాత్రి దవాఖానలో మరణించాడు.

జీడీపీ డౌన్.. ఇన్‌ఫ్రా స్లో

తొలి త్రైమాసికంలో 15 నెలల కనిష్ఠానికి వృద్ధిరేటు

- ఈ ఏప్రిల్-జూన్‌లో 6.7 శాతానికే పరిమితం
- జూలైలో 6.1 శాతానికి మందగించిన కీలక రంగాల పనితీరు
- తాజాగా విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లో తేటతెల్లం

న్యూఢిల్లీ, ఆగస్టు 30: దేశ ఆర్థిక వ్యవస్థను నిస్తేజం ఆవరించింది. ఓవైపు వృద్ధిరేటు.. మరోవైపు కీలక రంగాల పనితీరు మందగించాయి. శుక్రవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లో ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో దేశ జీడీపీ 15 నెలల కనిష్ఠానికి దిగజారినట్టు తేలింది. అలాగే జూలై నెలకుగాను 8 కీలక రంగాల్లో వృద్ధిరేటు 6.1 శాతానికే పరిమితమైనట్టు స్పష్టమైంది.

వ్యవసాయ, సేవా రంగాలు డీలా

వ్యవసాయ, సేవల రంగాల ప్రదర్శన పేలవంగా ఉండటమే ఈ ఏప్రిల్-జూన్‌లో దేశ జీడీపీ వృద్ధిరేటు 5 త్రైమాసికాల కనిష్ఠాన్ని తాకుతూ 6.7 శాతానికే పరిమితం కావాల్సి వచ్చిందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) పేర్కొన్నది. 2023 జనవరి-మార్చిలో దేశ జీడీపీ వృద్ధిరేటు 6.2 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ స్థాయి దరిదాపుల్లోకి ఇప్పుడే గణాంకాలు వెళ్లాయి. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఏప్రిల్-జూన్‌లో 8.2 శాతంగా ఉండటం గమనార్హం. ఈ ఏడాది జనవరి-మార్చిలోనూ 7.8 శాతం వృద్ధి కనిపించింది. దీంతో 3 నెలల్లో జీడీపీ 1 శాతానికిపైగా పడిపోయినట్టైంది.

ఆయా రంగాలవారీగా..

ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వ్యవసాయ రంగ జీవీఏ (గ్రాస్ వాల్యూ ఆడెడ్) 3.7 శాతం నుంచి 2 శాతానికి క్షీణించినట్టు ఎన్‌ఎస్‌వో తెలియజేసింది. అలాగే ఆర్థిక, నిర్మాణ, ప్రొఫెషనల్ సర్వీసెస్ జీవీఏ కూడా నిరుడు ఏప్రిల్-జూన్‌తో పోల్చితే 12.6 శాతం నుంచి 7.1 శాతానికి దిగజారింది. ట్రేడ్, హోటల్స్, రవాణా, కమ్యూనికేషన్ అండ్ సర్వీసెస్ విభాగాల్లోనూ వృద్ధి 9.7 శాతం నుంచి 5.7 శాతానికి పతనమైంది. ఈ క్రమంలోనే ప్రధానమైన తయారీ రంగ జీవీఏ 2 శాతం పెరిగి 7 శాతానికి పుంజుకున్నా.. మైనింగ్-క్వారీయింగ్, విద్యుత్తు, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సర్వీసుల్లో ఆకర్షణీయ వృద్ధి ఉన్నా ఫలితం లేకపోయింది. ఇదిలావుంటే ప్రస్తుత ధరల వద్ద ఈసారి జీడీపీ విలువ రూ.77.31 లక్షల కోట్లుగా ఉన్నట్టు ఓ ప్రకటనలో ఎన్‌ఎస్‌వో తెలిపింది.



మౌలికం బేజారు

దేశ పారిశ్రామిక ప్రగతికి ప్రామాణికంగా భావించే 8 కీలక రంగాల్లో మందగమనం అలుముకున్నది. గత నెల జూలైలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు రంగాల్లోని ఉత్పాదకతలో వృద్ధిరేటు 6.1 శాతంగానే ఉన్నది. నిరుడు జూలైలో ఇది 8.5 శాతంగా ఉండటం గమనార్హం. భారతీయ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఈ 8 రంగాల వాటా 40.27 శాతంగా ఉండటం విశేషం. అలాంటిదిప్పుడు ఆయా రంగాల్లో ఉత్పత్తి ఏడాది కాలంలో 2.4 శాతం మేరకు పడిపోయింది. ముడి చమురు ఉత్పత్తి మైనస్ 2.9 శాతంగా, సహజ వాయువు ఉత్పత్తి మైనస్ 1.3 శాతంగా ఉండటం దెబ్బ తీసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే బొగ్గు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు రంగాల్లోనూ ఉత్పాదకత గతంతో పోల్చితే వరుసగా 6.8 శాతం, 7.2 శాతం, 5.5 శాతం, 7 శాతాలకు పడిపోయింది. దీంతో రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువుల రంగాల్లో 6.6 శాతం, 5.3 శాతం చొప్పున వృద్ధి నమోదైనా ప్రయోజనం లేకపోయింది.

హైదరాబాద్‌లో పీబీపార్ట్‌నర్స్ ఆఫీస్

హైదరాబాద్, ఆగస్టు 30: పాలసీబజార్ ఇన్సూరెన్స్ బ్రోకర్‌కు చెందిన పీబీపార్ట్‌నర్స్.. హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించడంతోపాటు కస్టమర్ కేర్ సెంటర్‌ను నెలకొల్పనున్నట్లు పీబీపార్ట్‌నర్స్ అసోసియేట్ డైరెక్టర్, సేల్స్ హెడ్ అమిత్ భదోరియా తెలిపారు. వచ్చే రెండేండ్లలో వరంగల్, కరీంనగర్‌తోపాటు వైజాగ్, తిరుపతి, కోయంబత్తూర్‌లో కార్యాలయాలను తెరువాలనుకుంటున్నట్లు చెప్పారు.

యూబీఐతో టయోటా జట్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: టయోటా కిర్లోస్కర్ వాహనాలను కొనుగోలు చేసేవారికి రుణాలు అందించాలనే ఉద్దేశంతో యూబీఐతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందంలో భాగంగా కంపెనీ వాహనాలపై 90 శాతం వరకు రుణం లభించనున్నది.

గూగుల్ పేలో కొత్త ఫీచర్లు

- యూపీఐ సర్కిల్ పరిచయం
- ఈరూపీ వోచర్ల జారీ, ట్యాప్‌అండ్‌పే పేమెంట్లూ షురు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: ప్రముఖ పేమెంట్స్ యాప్ గూగుల్ పేలో కొత్త ఫీచర్లను తీసుకొచ్చారు. ఇందులో భాగంగానే శుక్రవారం యూపీఐ సర్కిల్‌సహా మరికొన్నింటిని పరిచయం చేశారు. ముంబైలో 3 రోజులపాటు జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్) 2024 ముగింపు సందర్భంగా ఈ మేరకు గూగుల్ పే నుంచి ప్రకటనలు వచ్చాయి. కాగా, యూపీఐ సర్కిల్‌తో గూగుల్ పే వినియోగదారులు (ప్రైమరీ యూజర్లు) తమ కుటుంబ సభ్యులు, స్నేహితులను సెకండరీ యూజర్లుగా అనుమతించవచ్చు. దీంతో తమ బ్యాంక్ ఖాతాను లింక్ చేసుకోకుండానే ఇకపై వీరంతా కూడా ప్రైమరీ యూజర్ అకౌంట్ ద్వారానే డిజిటల్ చెల్లింపులను జరుపుకోవచ్చు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) భాగస్వామ్యంతో దీన్ని తీసుకొచ్చింది. అలాగే ఈ సందర్భంగా యూపీఐ వోచర్స్ (ఈరూపీ)నూ గూగుల్ పే ప్రారంభించింది. ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలతోపాటు ప్రస్తుత యూపీఐ వినియోగదారులు వీటిని జారీ చేయవచ్చు. అంతేగాక రూపే కార్డుల కోసం ట్యాప్‌అండ్‌పే చెల్లింపుల సౌకర్యాన్నీ కల్పించింది. ఈ పేమెంట్స్ కోసం రూపే కార్డుదారులు తమ మొబైల్ ఫోన్లను కార్డులతో అనుసంధానించుకోవాల్సి ఉంటుంది. యూపీఐ లైట్ కోసం ఆటోపే ఆప్షన్, యాప్‌పై క్లిక్‌పే క్యూఆర్ కోసం సపోర్ట్‌నూ అందిస్తున్నది. కాగా, ఆర్థిక వ్యవస్థలో డిజిటలైజేషన్‌ను మరింత విస్తృతపర్చడానికి ఈ నెలలో జరిగిన ద్రవ్యసమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన అనుమతుల మేరకే ఈ ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి.

బ్రోకర్లపై సెబీ కొరడా


46 స్టాక్, కమోడిటీ బ్రోకరేజీల రిజిస్ట్రేషన్లు రద్దు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. 46 స్టాక్, కమోడిటీ బ్రోకరేజీ సంస్థలపై కొరడా ఝుళిపించింది. నిబంధనల మేరకు లేని 39 స్టాక్ బ్రోకర్లు, 7 కమోడిటీ బ్రోకర్ల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను శుక్రవారం రద్దు చేసింది. అలాగే 22 డిపాజిటరీ పార్టిసిపెంట్స్ రిజిస్ట్రేషన్లనూ క్యాన్సిల్ చేస్తూ నిర్ణయం తీసుకున్నది. రిజిస్ట్రేషన్లు రద్దైనా.. స్టాక్ లేదా కమోడిటీ బ్రోకర్లుగా, డిపాజిటరీ పార్టిసిపెంట్లుగా గతంలో తీసుకున్న చర్యలకు, వైఫల్యాలకు ఇకపైనా వారు బాధ్యులేనని వేర్వేరుగా ఇచ్చిన తాజా ఆదేశాల్లో సెబీ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే సెబీకి బాకీపడిన వడ్డీలు, ఫీజులు, ఇతరత్రా బకాయిలను చెల్లించాల్సిందేనన్నది.

ఆర్థికాభివృద్ధిలో విదేశీ వాణిజ్యం కీలకం

ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ డీజీ శశాంక్ గోయల్

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో విదేశీ వాణిజ్యం, పెట్టుబడులు కీలకపాత్ర పోషిస్తాయని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ) కేంద్రం డైరెక్టర్ జనరల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ చెప్పారు. విదేశీ వాణిజ్యం కేవలం జీడీపీని మాత్రమే కాదు.. ఉద్యోగావకాశాలు, వేతనాలను కూడా పెంచుతుందని పేర్కొన్నారు. భారత విదేశాంగ మంత్రిత్వశాఖ ఐటెక్ విభాగం సహకారంతో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తల శిక్షణా కోర్సు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోయల్ మాట్లాడుతూ.. ఈజిప్ట్, భారత్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు చారిత్రాత్మకంగా ఉన్నాయని గుర్తుచేశారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తలకు, వారి దేశాభివృద్ధికి దోహదపడేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను అందిస్తాయని చెప్పారు. అనంతరం ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తలకు కోర్సు పూర్తి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ డాక్టర్ మాధవి రవులపాటి, ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.



10 లక్షల కోట్లు పెరిగిన సంపద

స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీతో మదుపర్లలో ఖుషి

ముంబై, ఆగస్టు 30: దేశీయ స్టాక్ మార్కెట్ల రికార్డుల పరంపర కొనసాగుతున్నది. రోజుకొక చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్న సూచీలు శుక్రవారం మరో మైలురాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల జోరు కొనసాగుతుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడం, వచ్చే నెలలో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఫలితంగా ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 231.16 పాయింట్లు లాభపడి చారిత్రక గరిష్ఠ స్థాయి 82,365.77 వద్ద ముగిసింది. వారాంతం ట్రేడింగ్‌లో 2,228 సూచీలు లాభపడగా, 1,701 సూచీలు నష్టపోయాయి. మరో సూచీ నిఫ్టీ సైతం ఉన్నత శిఖరానికి చేరుకున్నది. వరుసగా 12 రోజులుగా పెరుగుతూ వచ్చిన నిఫ్టీ శుక్రవారం సైతం 83.95 పాయింట్లు ఎగబాకి 25,235.90 పాయింట్ల వద్ద ముగిసింది. దీంతో స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీతో మదుపరుల సంపద రూ.10 లక్షల కోట్లు పెరిగింది. గత తొమ్మిది సెషన్లలో సెన్సెక్స్ 1,941 పాయింట్లు లాభపడటంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.10,00,028 కోట్లు పెరిగి రూ.4,64,39,993.77 కోట్ల(5.54 ట్రిలియన్ డాలర్ల)కు చేరుకున్నది. వచ్చే నెలలోనే ఫెడ్ వడ్డీరేట్లను తగ్గించనుండటంతో గ్లోబల్ మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిశాయి..దీంతో దేశీయ సూచీలు కూడా పరుగులు పెట్టాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.



- మొత్తంమీద ఈ వారంలో సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు(1.57 శాతం), నిఫ్టీ 412.75 పాయింట్లు(1.66 శాతం) లాభపడ్డాయి. గత తొమ్మిది రోజుల్లో సెన్సెక్స్ 1,941(2.41 శాతం), నిఫ్టీ 1,097 పాయింట్లు(4.54 శాతం) చొప్పున పెరిగాయి.
- వారాంతం ట్రేడింగ్‌లో బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా, ఎన్‌టీపీసీ, ఎయిర్‌టెల్, సన్ ఫార్మా షేర్లు ఒక్క శాతానికి పైగా లాభపడ్డాయి. దీంతోపాటు టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, కొటక్ బ్యాంక్, ఎస్బీఐ, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, నెస్లెలు లాభాల్లో ముగిశాయి.
- కానీ, టాటా మోటర్స్, రిలయన్స్, టెక్ మహీంద్రా, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతిలు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే రియల్టీ 1.88 శాతం బలపడగా, హెల్త్‌కేర్ 1.41 శాతం, యుటిలిటీస్, కమోడిటీస్, టెక్, సేవల రంగ షేర్లు కదంతొక్కాయి.

న్యాయవాదిపై దాడిని ఖండించిన బార్ కౌన్సిల్

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డిలో న్యాయవాది చైతన్యపై జరిగిన దాడిని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఖండించింది. ఈ ఘటనపై బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కే సునీల్‌గౌడ్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు పీ విష్ణువర్ధన్‌రెడ్డి నేతృత్వంలో శుక్రవారం బార్ కౌన్సిల్ సభ్యులు అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. చైతన్యపై దాడికి పాల్పడినవారిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బెలుగా విమానం



మస్కట్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఏ300-608ఎస్‌టీ బెలుగా విమానం(అతి పెద్దది) శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాత్రి 12.17 గంటలకు చేరుకుంది. ఇంధనం నింపడంతో పాటు సిబ్బంది విశ్రాంతి కోసం ఇక్కడికి చేరుకున్న విమానం ఆకాశంలో అద్భుతమైన ప్రదర్శన చేసినట్టు జీఎంఆర్ ప్రతినిధులు తెలిపారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు థాయ్‌లాండ్‌కు బయలుదేరినట్టు వివరించారు. బెలుగా విమానం ఇప్పటి వరకు మూడుసార్లు శంషాబాద్‌కు వచ్చినట్టు వెల్లడించారు. మొదటిసారి డిసెంబర్ 2022, రెండోసారి ఆగస్టు 2023, మూడోసారి ఆగస్టు 2024లో వచ్చినట్టు చెప్పారు. - శంషాబాద్ రూరల్

డ్రగ్ డిటెక్షన్ కిట్లతో మెరుగైన ఫలితాలు

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): డ్రగ్ డిటెక్షన్ కిట్‌లతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆబ్కారీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు ఎక్సైజ్ సిబ్బంది టీజీ న్యాబ్‌తో కలిసి పనిచేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తనిఖీలు జరుపుతున్నప్పుడు మహిళలు ఉంటే మర్యాదగా వ్యవహరించాలని, మహిళ కానిస్టేబుళ్లతో తనిఖీలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషి, టీజీ న్యాబ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభలు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో శనివారం నుంచి మూడు రోజులపాటు పీవోడబ్ల్యూ రాష్ట్ర ఏడో మహాసభలను నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, ప్రధాన కార్యదర్శి మంగ వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. శనివారం నగరంలో ర్యాలీ, బహిరంగసభ, సెప్టెంబర్ 1న రాష్ట్ర మహాసభల ప్రారంభం, 2న ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. జనాభా ప్రాతిపదికన మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలని, హత్యాచారాలను అరికట్టడానికి ప్రత్యేక చట్టాలు చేయాలనే డిమాండ్లను చర్చిస్తామని తెలిపారు. ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు అపర్ణ, ఏపీ పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి ఎం లక్ష్మి హాజరవుతారని తెలిపారు.

పార్టీ ఫిరాయింపుదారులపై వేటు వేయండి

హైకోర్టులో పిల్ దాఖలు చేసిన కేఏ పాల్

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేసేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ పిల్‌కు నంబర్‌ను కేటాయించేందుకు హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. దీంతో ఈ వ్యవహారంపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును కొందరు ప్రజాప్రతినిధులు కాలరాశారని పాల్ వాదించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బీఆర్‌ఎస్ తరపున గెలిచిన కొద్ది రోజులకే కాంగ్రెస్ తరపున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేశారని, ఇది ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని పేర్కొన్నారు. ఇలాంటివారిని చట్టసభల్లో అడుగు పెట్టకుండా నిరోధించాలని, ఫిరాయింపుదారులకు సౌకర్యాలన్నీ రద్దు చేయాలని కోరారు. దీంతో ఇదే వ్యవహారంపై దాఖలైన పిటిషన్లు సింగిల్ జడ్జి వద్ద ఉన్నాయని ధర్మాసనం గుర్తు చేసింది. దీనిపై పాల్ స్పందిస్తూ.. అవన్నీ రాజకీయ ప్రయోజనాలతో కూడిన పిటిషన్లని తెలిపారు. తాము ప్రజాప్రయోజనాల కోసం పిల్ వేశామని, ఆ మేరకు అఫిడవిట్ వేస్తామని చెప్పారు. దీంతో విచారణను సెప్టెంబర్ 1కి వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది.

'హౌసింగ్ సొసైటీ' అవకతవకలపై నివేదిక ఏదీ?

సహకార సంఘాల రిజిస్ట్రార్‌పై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పాలకవర్గం అవకతవకలపై విచారణ నివేదికను అందజేయాలన్న ఆదేశాలను అమలు చేయకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో సెప్టెంబర్ 27న వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని రాష్ట్ర సహకార సంఘాల శాఖ రిజిస్ట్రార్ కే హరితను ఆదేశిస్తూ జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. కోర్టు ధిక్కరణ కింద మీపై ఎందుకు చర్యలు చేపట్టరాదో చెప్పాలంటూ ఆ ఉత్తర్వుల్లో హరితను ప్రశ్నించారు.

లడ్డూ ప్రసాదం అసత్య వార్తలపై టీటీడీ ఖండన

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి లడ్డూలను భక్తులకు కేవలం రెండు మాత్రమే ఇస్తున్నారని, అదనంగా కావాలంటే ఆధార్ తప్పనిసరని, ఒకసారి లడ్డూలు తీసుకుంటే తిరిగి నెల రోజుల తర్వాతే మళ్లీ అవకాశం ఉంటుందని ఏఈవో వెంకయ్యచౌదరి పేరుతో ఓ వార్త ప్రచారం జరిగింది. దీనిపై వివరణ ఇచ్చిన టీటీడీ.. లడ్డూ విక్రయ విధానాల్లో మార్పు లేదని, దర్శనం తర్వాత భక్తులకు ఉచిత లడ్డూతోపాటు నాలుగు నుంచి ఆరు లడ్డూల వరకు విక్రయిస్తున్నట్టు చెప్పింది. దర్శనం టికెట్లు, టోకెన్లు లేని భక్తులకు ఆధార్ కార్డు నమోదుతో రెండు లడ్డూలు విక్రయిస్తున్నట్టు క్లారిటీ ఇచ్చింది. నెలకోసారి మాత్రమే లడ్డూలు అన్నది నిజం కాదని, అదనపు లడ్డూలను ప్రతిరోజూ తీసుకోవచ్చని తెలిపింది. గురువారం శ్రీవారికి రూ.4.51కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. చెన్నైకి చెందిన టీవీఎస్ మోటర్స్ ఎండీ వేణుసుదర్శన్ శుక్రవారం టీటీడీకి 16 బైకులను విరాళంగా అందజేసినట్టు చెప్పారు.

గోషామహల్ స్టేడియం.. ఇక ఉస్మానియా

అత్యాధునిక హంగులతో నిర్మాణం: కలెక్టర్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): గోషా మహల్‌లో 32 ఎకరాల స్థలంలో అత్యాధునిక హంగులతో ఉస్మానియా దవాఖానను నిర్మించబోతున్నట్టు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం ఆయన ద్విచక్ర వాహనంపై గోషామహల్ స్టేడియంలో తిరిగి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వందేండ్లకు ఉపయోగపడేలా ఈ దవాఖానను నిర్మించనున్నట్టు వెల్లడించారు. ఈ దవాఖానకు వచ్చే వారికి ట్రాఫిక్ సమస్యలు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోజుకు వెయ్యి కట్టండి

- ఐఏఎంసీకి భూమి కేటాయింపు కేసులో
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం (ఐఏఎంసీ) ఏర్పాటుకు రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో 3.7 ఎకరాల భూమిని కేటాయించిన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ పిటిషన్ దాఖలు చేయకపోవడంపై హైకోర్టు కన్నెర్ర జేసింది. ఇప్పటికే పలుసార్లు ఆదేశించినప్పటికీ కౌంటర్ దాఖలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. కౌంటరు దాఖలుచేసే వరకు రోజుకు రూ.వెయ్యి చొప్పున జరిమానా చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ మొత్తాన్ని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థకు చెల్లించాలని స్పష్టం చేసింది. ఆ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్, జస్టిస్ కే సుజన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 20కి వాయిదా వేసింది. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది.

కాంగ్రెస్‌పై కేసీఆర్ కదన భేరి!

మొదటిపేజీ తరువాయి...

దిగజార్చుతున్నారని నిప్పులు చెరుగుతున్నారు. ఇంకా మౌనంగా ఉండిపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందని ఆయన నిశ్చయానికి వచ్చారు. అలవిగాని హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించి ప్రజలను వంచించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు శూన్యహస్తం చూపిస్తూ ఉంటే బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా మాత్రమే కాకుండా ఈ రాష్ట్ర ఆవిర్భావానికి, అభివృద్ధికి అంకితమై పనిచేసిన బీఆర్‌ఎస్ చూస్తూ ఊర్కోరాదని, రాజకీయాలు, కుట్రలు, ప్రచారాలు తప్ప ప్రజలకు కించిత్ మేలు చేయని సర్కారు మీద యుద్ధభేరి మోగించబోతున్నారని ఆయన సన్నిహిత వర్గాలు చెప్తున్నాయి. కేసీఆర్ మౌనంగా ఉన్నారంటే ఆయన మస్తిష్కంలో వెయ్యి యుద్ధాలకు సమానమైన మహోద్యమ పథక రచన జరిగినట్టేనని వారు విశ్లేషిస్తున్నారు.


ఈ నేపథ్యంలో తెలంగాణకు, తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసంపై బీఆర్ఎస్ త్వరలోనే యుద్ధభేరి మోగించనున్నదా? తెలంగాణ ఉద్యమం తరహాలో పెను కార్యాచరణను తీసుకోనున్నదా? మోసపోయి గోసపడుతున్న తెలంగాణ ప్రజల కోసం వినూత్న పోరాట రూపాలను తీర్చిదిద్ది, కేసీఆర్ స్వయంగా ముందుండి పాల్గొననున్నారా? పార్టీలో ఇప్పుడు ఈ చర్చే జరుగుతున్నది.

ఉద్యమానికి సీనియర్ల ఒత్తిడి...

రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఇచ్చిన సమయం ఇక చాలని, ఇంకా చూస్తూ కూర్చుంటే తెలంగాణ కుప్పకూలే ప్రమాదం ముంచుకొస్తున్నదని బీఆర్‌ఎస్ సీనియర్లు ఇప్పటికే కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. 'మీరు తెచ్చిన తెలంగాణ ఆగమై పోకుండా ఉండేందుకు మీరే స్వయంగా రంగంలోకి దిగాల్సిన తరుణం ఆసన్నమైంది. కాంగ్రెస్ మెడలు వంచి హామీలు అమలు చేయించాల్సిన, ప్రజలకు ఊరట కలిగించాల్సిన సమయం వచ్చింది. ఇంకా మనం మౌనం వహించడాన్ని ప్రజలు ఆమోదించడం లేదు' అని సీనియర్లు కేసీఆర్‌కు విన్నవించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

సై అంటున్న మేధావులు..

ఒకప్పుడు కేసీఆర్‌తో కొంత విభేదించిన పలువురు మేధావులు కూడా బహిరంగంగానే, కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండె, ఆయన రంగంలోకి దిగితే తప్ప కాంగ్రెస్ సర్కారు కదిలేలా లేదు అని టీవీ ఇంటర్వ్యూల్లో ఓపెన్‌గానే చెప్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ నేతల వాదనతో కేసీఆర్ కూడా సూత్రప్రాయంగా అంగీకరించినట్టు తెలిసింది. దీంతో వినాయకచవితి తర్వాత రాష్ట్రంలో రాజకీయ ధూమ్‌ధామ్ దద్దరిల్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తొమ్మిది నెలల్లో ఒక్క మంచి పని జరగకపోవడం, హామీల అమలుకు కనీస కార్యాచరణ ప్రారంభం కాకపోవడం, ప్రభుత్వంలోని పెద్దల మధ్య సమన్వయం లేకపోవడం, ప్రజల సమస్యలను పరిష్కరించే ధోరణి కనిపించకపోవడంతో సర్కారుపై ఒత్తిడి తేకపోతే, పరిస్థితి మరింత చేయి దాటిపోయే ప్రమాదం ఉందని బీఆర్‌ఎస్ సీనియర్లు భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల్లో నెలకొన్న నైరాశ్యం, ఆగమైపోతున్నామనే ఆందోళన, వేచిచూసినా పరిస్థితి మెరుగుపడే ఆశావహ వాతావరణం కనిపించకపోగా మరింత దిగజారుతున్న దృష్ట్యా ఇక రంగంలోకి దిగకతప్పదని బీఆర్‌ఎస్ సీనియర్లు కేసీఆర్‌కు చెప్పారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయించే బృహత్తర బాధ్యతను నెత్తికి ఎత్తుకోక తప్పదని కేసీఆర్‌కు వారు సూచించారు. అనేక వర్గాలు అసంతృప్తిగా ఉన్నాయని, అయితే ఆర్గనైజ్డ్ నాయకత్వం లేని కారణంగా ప్రభుత్వం మీద ఆయా వర్గాలు తగినంత ఒత్తిడి తేలేకపోతున్నాయని కేసీఆర్ దృష్టికి వారు తీసుకొచ్చారు. మోసం చేసిన కాంగ్రెస్‌పై ఒత్తిడి తెచ్చేందుకు బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారని, వారికి నాయకత్వాన్ని అందించే బాధ్యత తీసుకోవాలని కేసీఆర్‌కు సూచించారు. పార్టీ కీలక నేతలు, వివిధ వర్గాల ప్రముఖుల నుంచి వస్తున్న వినతుల నేపథ్యంలో సెప్టెంబరు 10 నుంచి బీఆర్‌ఎస్ పోరాట కార్యాచరణకు సన్నాహాలు మొదలుపెట్టనున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగా పార్టీ కార్యవర్గాన్ని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ప్రజా ప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి.



ఇంకా వేచిచూస్తే విధ్వంసమే...

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి 9 నెలలు పూర్తి కావస్తున్నది. సర్కారు కుదురుకునే దాకా తగినంత సమయం ఇవ్వాలని కేసీఆర్ మొదటి నుంచీ చెప్తూ వస్తున్నారు. అందుకే ఇప్పటిదాకా వేచిచూసే ధోరణిని బీఆర్‌ఎస్ అవలంబించింది. అయితే ఇక కదనభేరి మోగించకతప్పదని పార్టీ ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. బీఆర్‌ఎస్ పార్టీ రైతు, మహిళా, విద్యార్థి, ఎస్సీ, ఎస్టీ, యువత, మైనారిటీ ఇలా అన్ని విభాగాలు ఎక్కడికక్కడ క్షేత్రంలోకి దిగి 'ఏం చేస్తే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నుంచి బయటపడ్తాం' అనే కోణంలో సెప్టెంబరు 10 తర్వాత సమాలోచనలు చేపట్టనున్నది. పార్టీ ప్రజాప్రతినిధులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, జిల్లా అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాలు, మండల, గ్రామ.. ఇలా అన్నిస్థాయిల పార్టీ క్యాడర్‌తో సమాలోచనలు జరిపి ఉమ్మడి ఉద్యమ కార్యాచరణను చేపట్టే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వివరించాయి. కూల్చుడు తప్ప కట్టుడు తెలియని కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయించేదాకా, చేయకపోతే గద్దె దించేదాకా అవిశ్రాంత ప్రజాపోరుకు గులాబీ శ్రేణులు సిద్ధం అవుతున్న స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి.

ఆరు గ్యారెంటీలూ అమలు చేయాల్సిందే!

అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారంలోకి రావటం కోసం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ, బేషరతుగా, ఎలాంటి ఆంక్షలు లేని అనేక హామీలు ఇచ్చాయి. బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన దానికన్నా, నాలుగు పైసలు ఎక్కువ వస్తాయన్న ఆశతో అదనంగా రెండు శాతం కంటే లోపు ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ మొండిచెయ్యి చూపింది. మెల్లమెల్లగా గ్యారెంటీల ప్రస్తావన ఎత్తడమే మానేసింది. దానిస్థానంలో చవకబారు మాటలు, విమర్శలు చేసి ప్రజలతో డైవర్షన్ గేమ్ ప్రారంభించింది. అమలుచేసిన ఒకటి రెండింటికి కూడా పలు ఆంక్షలు, షరతులు, నిబంధనలు విధిస్తూ లబ్ధిదారుల సంఖ్యను కుదిస్తున్నది. మొదలేపెట్టని గ్యారెంటీలను కూడా అన్నీ అమలైపోతున్నయ్ అంటూ మంత్రులు చేస్తున్న ప్రకటనలు, వాటిని అమలు చేసే ఉద్దేశం లేకపోగా దబాయింపులు ఎక్కువయ్యాయి. నిబంధనల సాకుతో హామీలను ఎగబెట్టాలె అన్నదే కాంగ్రెస్ విధానంగా కనిపిస్తున్నది. ఏ రంగాన్ని తీసుకున్నా ఇదే పరిస్థితి. అమలు చేయలేమని తెలిసి కూడా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఇచ్చిందనీ, అందువల్ల వాటిని అమలు చేయించక తప్పదనీ బీఆర్‌ఎస్ ముఖ్యుల అభిప్రాయపడుతున్నారు. '1956లో ఆంధ్రాతో విలీనానికి ముందు తెలంగాణ హక్కులు కాపాడుతామని కాంగ్రెస్ నేతలు అనేకసార్లు హామీలిచ్చారు. తర్వాత మాట తప్పారు. తెలంగాణ రాష్ట్రం కావాలని తొలి, మలి ఉద్యమాలు జరిగినప్పుడు రాష్ట్రం ఇస్తామని అనేకసార్లు హామీలిచ్చారు. తర్వాత గట్టునపెట్టారు. కానీ ఇప్పుడు అట్లా నడిచే పరిస్థితి ఉండదు. ఇది పాత తెలంగాణ కాదు. తెలంగాణ ప్రజల కోసం కొట్లాడేందుకు బీఆర్‌ఎస్ పార్టీ ఉన్నది. కాంగ్రెస్‌కు తప్పించుకునే చాన్స్ ఇచ్చే ప్రసక్తే తలెత్తదు' అని పార్టీ ముఖ్యనేత ఒకరు పేర్కొన్నారు.

ధ్వంసమైన వ్యవసాయరంగం

కేసీఆర్ హయాంలో ఉజ్వలంగా వెలిగిన వ్యవసాయ రంగం ఏదో శాపం తగిలినట్టు, 8 నెలల్లోనే కుదేలై కూర్చున్నది. రైతుబంధు ఇవ్వకుండా, రైతు భరోసాను అమలు చేయకుండా కాంగ్రెస్ తమను నిలువునా ముంచిందన్న భావన రైతుల్లో బలంగా నెలకొన్నది. ఎరువులు, విత్తనాల కొరత, కరెంటు ఇబ్బందులు! ఇక అన్ని పంటలకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్, చివరికి వరికి మాత్రమే అని ముక్కువిరిచి, దాన్లోనూ సన్నాలకు మాత్రమే ఇస్తామని మాట్లాడి, చివరికి నాలుగైదు వెరైటీలకే బోనస్ వర్తింపజేసిన తీరు రైతాంగాన్ని నివ్వెరపరిచింది. యాసంగి కొనుగోళ్లను గమనిస్తే, పండించిన ధాన్యమన్నా కొంటారో లేదో తెల్వని పరిస్థితి. ఇక ప్రభుత్వం చెప్తున్న రుణమాఫీ సగం మంది రైతులకు కూడా వర్తించలేదు. రైతులు ఎక్కడికక్కడ స్వచ్ఛందంగా ఆందోళనకు దిగుతున్నారు. బ్యాంకుల చుట్టూ, ఏఈవోల చుట్టూ తిరుగుతున్నారు. అనేకచోట్ల ఆందోళన చేస్తున్న రైతాంగానికి బీఆర్‌ఎస్ అండగా నిలిచినా, రైతాంగం అనార్గనైజ్డ్‌గా ఉండటం వల్ల ఎవరికివారే మదనపడుతున్నారు. రుణమాఫీ పరిణామాల నేపథ్యంలో రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావడం లేదు. పైపెచ్చు కాంగ్రెస్ సర్కార్ చేసిన రుణమాఫీ పూర్తి కాకపోవడంతో పాత అప్పు కడితేనే కొత్త అప్పు ఇస్తామని తెగేసి చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో దిక్కుతోచని స్థితిలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను రైతులు ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వడ్డీ వ్యాపారులు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని వడ్డీరేట్లను ఇబ్బడిముబ్బడిగా పెంచేస్తున్నారు. ఇక ఎరువులు, విత్తనాల కోసం పల్లెల్లో చెప్పులు, సంచులను క్యూలైన్లో పెట్టే దృశ్యాలు, తోపులాటలు, ఎరువుల దుకాణాలు, బ్యాంకుల్లో పోలీసుల పహారా తెలంగాణలో వ్యవసాయ రంగంలో నెలకొన్న దయనీయ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. రాజకీయ కక్షతో కాళేశ్వరాన్ని ఎండబెట్టడంతో అనేక జిల్లాల్లో సాగునీటి సంక్షోభం ఏర్పడింది. చివరికి రైతులే కార్లు వేసుకుని, శ్రీరాంసాగర్ వద్దకు వచ్చి నీళ్లు వస్తాయా లేవా అని తెలుసుకోవాల్సిన దుస్థితి. కేసీఆర్ పాలనలో నెలకొన్న పండుగను రేవంత్‌సర్కార్ పడావు పెట్టిందనే ఆందోళన నెలకొన్నది. ఇలా ఎటు చూసినా దిక్కుతోచని స్థితితో రాష్ట్ర రైతాంగం తీవ్ర నిరాశ, నిస్పృహల్లోకి వెళ్లింది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో రైతుకు భరోసా కల్పించి వారి మానసిక స్థైర్యాన్ని నిలబెట్టడం కేసీఆర్‌కు మినహా మరెవరికీ సాధ్యం కాదని బీఆర్‌ఎస్ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.

నిరుద్యోగులు భగభగ

కాంగ్రెస్ తమను ఆగం చేసింది అని నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. తమను ఏదో ఉద్ధరిస్తుందనుకున్న నిరుద్యోగుల భ్రమలు పటాపంచలు కావడానికి ఎక్కువ సమయం పట్టలేదు. కేసీఆర్ హయాంలో జరిగిన ఉద్యోగ ప్రక్రియకు నియామక పత్రాలు చేతిలో పెట్టి తమ ఘనతగా కాంగ్రెస్ ప్రచారం చేసుకున్నప్పుడే నిరుద్యోగుల్లో అనుమానాలు తలెత్తాయి. ఆ తర్వాత జరిగిన అనేక పరిణామాలు అ అనుమానాలను నిజం చేశాయి. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు అన్న ఆశలు ఆవిరయ్యాయి. కేసీఆర్ హయాంలో వెనకుండి నడిపించిన మేధావులు తమ పదవులు తాము చూసుకుంటూ ఉంటే మోసపోయిన నిరుద్యోగులు నెత్తిన చేతులు పెట్టుకుంటున్నారు. రెండు లక్షల ఉద్యోగాలు పోయాయి. జాబ్ క్యాలెండర్‌లో తేదీల క్యాలెండర్ మాత్రమే చేతికి వచ్చింది. జాబ్‌లు గాల్లో కలిసిపోయాయి. కనీసం నిరుద్యోగుల చిరు డిమాండ్లు 1:100 వంటి వాటిని కూడా పట్టించుకున్న వాడు లేడు. ఎగేసినోడు అందలం మీద కూర్చున్నాడు. నిరుద్యోగులు రోడ్ల మీద పడ్డారు.

ఆడబిడ్డలకు మోసం

ఎన్నికలకు ముందు తెలంగాణ మహిళాలోకానికి రేవంత్ అరచేతిలో స్వర్గం చూపించారు. అధికారంలోకి వచ్చాక, ఉచిత ప్రయాణం కల్పించామని, దీంతో మహిళాలకు తాము ఇచ్చిన అన్ని హామీలు అమలయ్యాయన్న రీతిలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్నది. కల్యాణలక్ష్మి కథ వొడవని ముచ్చటగా మారింది. ఆడబిడ్డ పెండ్లికి తులం బంగారం అని ఇచ్చిన హామీ ఎటుపోయిందో ఎవరికీ తెలియదు. గృహిణులకు నెలనెలా రూ.2,500 ఊసే లేదు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ ఎవరికి అందుతున్నదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నది. గృహలక్ష్మి ఎవరిని కరుణిస్తుందో ఎవరికీ అర్థం కావడం లేదు.

సంక్షేమం సదా విస్మరణ

కాంగ్రెస్ సర్కార్ సంక్షేమం సదా విస్మరణగా మారిపోయింది. కేసీఆర్ సర్కార్ ప్రారంభించిన రూ.10 లక్షల దళితబంధును తాము అధికారంలోకి వస్తే రూ.12 లక్షలకు పెంచుతాం అని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టింది. ఊరూరా దండోరా వేసింది. ఓట్లు దండుకున్న తెల్లారే దళితబంధుకు రాంరాం చెప్పింది. గిరిజనబంధుకు ఎగనామం పెట్టింది. కొత్తవి ఇవ్వకపోగా పాతపథకాన్ని కూడా అమలు చేయటంలేదు. కేవలం 9 నెలల్లో రేవంత్ సర్కారు ఏకంగా 65 వేల రూ.కోట్ల అప్పు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ప్రపంచబ్యాంకు అప్పులు తెచ్చే పనిలో పడ్డారు.

ఇదేం సర్కార్.. ఇదేం పాలన!

మొదటిపేజీ తరువాయి...

చూస్తున్నవారు, ప్రభుత్వ పెద్దలతో చెట్టపట్టాలేసుకుని తిరుగుతున్నవారే ఈ మాటలు అంటుండడం చూస్తుంటే రాష్ట్రంలో పాలన ఎలా సాగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఏ ఇద్దరు కాంగ్రెస్ నేతలను కదిలించినా పాలన పడకేసిందని, ఏ పనీకావడం లేదని చెప్పుకుంటున్నారు. రాష్ట్రంలో పాలన మొత్తం స్తంభించిపోయిందని అన్ని వర్గాలూ అభిప్రాయపడుతున్నాయి. ప్రభుత్వాన్ని చాలా దగ్గరి నుంచి చూస్తున్న నల్లగొండ జిల్లాకు చెందిన కీలక నేత ఒకరు ముఖ్యమంత్రి పని విధానంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'మొదలు ఏదో అనుకున్నం. కానీ మావోడికి తెలుస్తలేదు. ప్రభుత్వానికి ఆదాయం ఎట్ల సమకూర్చాలో తెలియడం లేదు. ఖర్చు ఎలా చేయాలో మాత్రం బాగా తెలుస్తున్నది' అని వ్యాఖ్యానించారు. 'మేమేందో పెద్దగా ఊహించుకున్నం. ఎమ్మెల్యేలే కాదు, అధికారులు కూడా గందరగోళంగానే ఉన్నారు' అని అదే జిల్లాకు చెందిన మరో ప్రజాప్రతినిధి వివరించారు.

పొద్దంత తిప్పుకుంటడు

'పొద్దంతా కార్ల తిప్పుకుంటడు. కానీ, ఎక్కడి పని అక్కడే పెద్దడు' అని సీఎం వ్యవహారశైలిపై సొంతపార్టీ ఎమ్మెల్యే ఒకరు వ్యాఖ్యానించారు. 'రేపు మనం కలుద్దాం' అని సీఎం చెప్పగానే ఇక నా పని అయిపోయినట్టే అని ఆ ఎమ్మెల్యే భావించారట. చెప్పిన టైంకు వెళ్లి.. తన పని గురించి చెప్పగానే 'పోతూ పోతూ మాట్లాకుందాం పావే' అంటూ కారువైపు దారి చూపి 'కారు ఎక్కగానే ఆ ముచ్చట.. ఈ ముచ్చటా అన్నీ తీస్తాడు. అసలు ముచ్చట తీసేలోపే వేరే ముచ్చట. ఇట్లా సాయంత్రం దాకా దగ్గరే ఉంచుకొని, వెంటతిప్పుకొని 'తప్పకుండా చేద్దాం.. తరువాత చేద్దాం' అని దాటవేసిన ఉదంతాన్ని తన సన్నిహితుల వద్ద చెప్పుకున్నారట. బయట చూస్తే 'అబ్బో, మావోడు సీఎం దగ్గర ఎన్నిపనులు చేసుకుంటుండో అనుకుంటరు. కానీ, అక్కడ అయిందీ లేదు, పోయిందీ లేదు' అని సదరు ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారట. చేయాల్సిన పనులే కాదు.. అసలు కావాల్సిన పనులు కూడా కావడం లేదని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు నిర్వేదం చెందుతున్నారు. 'మేం పట్టుకుపోయిన ఏ పనీ కావడం లేదు. కానీ పక్కరాష్ట్రం (ఏపీ) వాళ్ల పనులు మాత్రం మనిషి లేకున్నా జరిగిపోతున్నాయని ఒక ఎమ్మెల్యే ఉసూరుమన్నారు.

అన్నీ అస్తవ్యస్తమే

'కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం అయిండు. సెక్రటేరియట్‌కు రావడం లేదని ఎంత మొత్తుకున్నా జరగాల్సిన పనులు వేటికవే జరిగిపోతూ ఉండేవి. ఆయన పదేండ్ల కాలంలో పనులన్నీ చకచకా జరిగాయి. కానీ ఇప్పుడు యూరియా లేదని, విత్తనాలు దొరకడం లేదని రైతులు నిరసన తెలుపుతున్నారు. రైతుబంధు పైసలు పడ్తాయో, లేదోనని దిగులుగా ఉన్నారు. రూ. 2 లక్షల రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెప్తున్నా క్షేత్రస్థాయిలో గందరగోళం నెలకొన్నది. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని, దవాఖానల్లో కనీస మందు గోళీలు లేవని విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తంగా పరిపాలన చేతకాకపోవడం వల్ల రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెల్లుబికుతున్నది. 'నాయకుడు సరైన రీతిలో ఎత్తుగడలు సక్రమంగా వేయకపోతే నష్టం ఆ నాయకుడికి, పార్టీకే పరిమితం అవుతుంది. కానీ, పాలకుడు సరైన నిర్ణయం తీసుకోకపోతే దాని ప్రభావం మొత్తం రాష్ట్ర ప్రజల మీద పడుతుంది' అని సీనియర్ రాజకీయ నేత ఒకరు వ్యాఖ్యానించారు.

అప్పుడన్నా పనులు అయ్యేవి

ప్రతిపక్షంలో ఉన్నప్పుడైనా ఏ పని అంటే ఆ పని అయిందని, ఇప్పుడు చెప్పుకోవడానికి ఒక చిన్న పని కూడా లేదని ఎమ్మెల్యేలు, నేతలు వాపోతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, వినోద్‌కుమార్.. ఇలా ఎవరిని కలిసి మాట వరుసకు చెప్పినా పనులు అయ్యేవని, 'మీ పని అయిపోయింది' అని వారే స్వయంగా ఫోన్ చేసి చెప్పేవారని గుర్తు చేసుకుంటారు. 'మా గవర్నమెంట్ల మా పనులే అయితలేవు. ఇక ప్రజల పనులేం చేస్తాం' అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే సన్నిహితుల వద్ద వాపోయారట.

సమీక్షల్లోనూ డొల్లతనమే

పాలకులకు ఉండాల్సిన దూరదృష్టి, అవగాహన, ప్రజా సమస్యల పరిష్కారం పట్ల ఉండే చిత్తశుద్ధి ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ సర్కార్‌కు లేవని ఉన్నతాధికారులు గుసగుసలాడుకుంటున్నారు. అన్ని రంగాల్లో అందరికీ అవగాహన ఉండాల్సిన అవసరం లేదు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తికి కనీస అవగాహన లేకపోతే కష్టం అని ఒక సీనియర్ అధికారి ఒకరు పేర్కొనడం గమనార్హం. రెండు మూడు రోజుల క్రితం వినాయక చవితి నిమజ్జనం ఏర్పాట్లపై జరిగిన సమీక్షలో సీఎం స్థాయిలో ఉన్న నాయకుడు ఒక ఏసీపీకి అదే పనిగా సూచనలు ఇవ్వడం గందరగోళానికి దారి తీసింది. దీంతో పోలీసు ఉన్నతాధికారి ఒకరు కల్పించుకుని సరిచేయబోతుండగా 'ఇదర్ క్యా చల్రా. ఆప్ క్యా కరే. పహెలే మేరే బాత్ సునో' అని సదరు పోలీసు ఉన్నతాధికారిని సీఎం వారించారు. ఇలా ఏ విషయంలోనూ పట్టులేక, అధికారులకు ఎటువంటి సూచనలు ఇవ్వాలో, ఏవీ ఇవ్వకూడదో తెలియక పాలన అభాసుపాలవుతుందనే వాదన బలంగా వినిపిస్తున్నది.

కేసీఆర్ డబ్బును ప్రేమించడు

- డబ్బు కోసం రాజకీయం చేయడు
- కేసీఆర్ చాలామందికి అర్థంకాడు
- ఆయన తత్వాన్ని నేను గ్రహించా
- పార్టీ పెట్టినప్పుడు కూడా పైసా లేదు
- సిద్ధాంతాన్ని నమ్మి పనిచేస్తాడు
- మనసు బాగలేకుంటే మౌనమునే..
- ఎమ్మెల్సీ కవిత జగమొండి
- ఒత్తిడి వచ్చినా అప్రూవర్‌గా మారలే
- 'నమస్తే తెలంగాణ'తో తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య



హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ఏనాడూ డబ్బును ప్రేమించలేదని, జేబులో ఏనాడూ ఆయన పైసలు పెట్టుకోలేదని తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య పేర్కొన్నారు. కేసీఆర్‌ను తాను చాలా దగ్గరి నుంచి చూశానని, డబ్బే సర్వస్వం అని ఏనాడూ అనుకోలేదని తెలిపారు. ఓసారి తీసుకున్న అప్పు తీర్చలేదన్న కారణంతో ఓ వ్యక్తి కేసీఆర్‌పై తుపాకి ఎక్కుపెట్టారని గుర్తు చేసుకున్నారు. కన్నబిడ్డ జైల్లో ఉంటే తల్లిదండ్రులకు తీవ్రమైన బాధ ఉంటుందని, కేసీఆర్ ఇదే రకమైన బాధను అనుభవించారని, ఆయన మనసు బాగాలేనప్పుడు ఎవ్వరితోనూ మాట్లాడరని తెలిపారు. మనసు బాగోలేనప్పుడు కేసీఆర్ మౌనం దాలుస్తారని, మౌనమునిలా ఉంటారని చెప్పారు. శుక్రవారం ఇన్నయ్య 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

కేసీఆర్‌పై కాంగ్రెస్, బీజేపీ అనేక ఆరోపణలు చేస్తున్నాయి. కేసీఆర్‌ను దగ్గరి నుంచి చూసిన వ్యక్తిగా మీ అభిప్రాయం ఏమిటి?

కేసీఆర్ ఇప్పటికీ చాలామందికి అర్థం కాడు. ఆయనతో సుదీర్ఘకాలం నేను ఉన్నాను. 1999 నుంచి కేసీఆర్ నాకు బాగా తెలుసు. 1985 నుంచి వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1987లో కరువుశాఖ మంత్రి, 1997లో రవాణాశాఖ మంత్రిగా పనిచేశారు. కానీ ఆయన దగ్గర ఏనాడూ డబ్బుల్లేవు. శంషాబాద్‌లో తనకున్న వ్యవసాయ భూమిని అమ్మి నందినగర్‌లో ప్రస్తుతం ఉంటున్న ఇంటిని కేసీఆర్ కొనుగోలు చేశారు. కేసీఆర్ ఏనాడూ డబ్బును నమ్మడు, డబ్బును ప్రేమించడు, డబ్బే సర్వస్వం అనుకోడు. ఎన్నడూ జేబుల పైసలు పెట్టుకోడు. ఆయన దగ్గర ఎంత ఉంటే అంత ఖర్చు పెట్టేస్తాడు. ఎవరికైనా ఏమైనా ఆపద ఉన్నదంటే తన దగ్గర ఎంత ఉంటే అంత ఇచ్చే గుణం ఆయనది. 2001 కంటే ముందు టీఆర్‌ఎస్ పార్టీ పెడుదామని అనుకునే సమయంలోనే కేసీఆర్‌లోని ఈ తత్వాన్ని నేను గ్రహించాను. తెలంగాణ రాష్ట్ర సమితి పెట్టేనాటికి కూడా కేసీఆర్ దగ్గర నిల్వ ఉండే ధనమేదీ లేదు. కార్యక్రమాలకు ఎక్కడికైనా వెళ్దామంటే హరీశ్‌రావే వచ్చి డబ్బులు సమకూర్చేవాడు. పార్టీ పెట్టిన కొత్తలో ఆయన తన భూములు అమ్మి ఒకసారి రూ. 10 లక్షలు, మరోసారి రూ. 20 లక్షలు ఇచ్చాడు. ఆయనతో రోజులతరబడి హెలికాప్టర్‌లో తిరిగిన. అయితే అది డబ్బులు ఉండి తిరిగింది కాదు. ఆయన మంచితనం. పార్టీకి వాళ్లు వీళ్లు చందాలుగా ఇచ్చిన డబ్బే. కేసీఆర్ ఆస్తి ఏదైనా ఉందంటే అది ఆయన తీరే. తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పటికే ఆయన రెండుసార్లు మంత్రిగా చేసినా డబ్బులు సంపాదించాలని కోరిక లేకపోవడం, నచ్చిన సిద్ధాంతాన్ని నమ్ముకొని పనిచేసుకుంటూ పోవడమే

డబ్బులు లేకుండానే రాజకీయ పార్టీ మొదలు పెట్టారంటారా?

అవును. ఆయన సిద్ధాంతం కోసం మొదలుపెట్టారు. చాలా మంది దగ్గర పార్టీ కోసం అప్పులు చేసేవాడు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 3లో ఒక వ్యక్తి తరచూ కేసీఆర్‌కు అప్పులు ఇచ్చేవాడు. ఆయన దగ్గర తీసుకున్న తర్వాత కొంత కాలానికి తీర్చేవాడు. ఇలా జరిగే క్రమంలో ఒకసారి తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వడం కుదరలేదు. ఆ వ్యక్తి రోజూ ఫోన్లు చేస్తుండడంతో నేను, కేసీఆర్ కలిసి ఆ పెద్ద మనిషి ఇంటికి వెళ్లాం. అక్కడ ఆయన డబ్బులు ఇస్తారా? లేదా? అంటూ రివాల్వర్ ఎక్కుపెట్టిన సందర్భాన్ని నేను మర్చిపోలేను. 2001లో పార్టీ పెట్టిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అద్భుతమైన ఫలితాన్ని సాధించింది. ఇద్దరు జడ్పీ చైర్మన్లు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఉన్నప్పటికీ నిధులు సమకూర్చుకోలేకపోయారు. ఇదంతా తెలియని వారు కేసీఆర్ గురించి ఏదేదో అంటుంటారు. అవన్నీ తప్పు. డబ్బు కోసం రాజకీయాలు చేసే మనస్తత్వం కేసీఆర్‌ది కాదు. ఇది పక్కాగా చెప్పగలను. రాజకీయాల్లో డబ్బు ఒక భాగం మాత్రమేనని అనుకుంటాడు. డబ్బుతో రాజకీయం అనుకునేవాడు కాదు.

రాష్ట్రంలో ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ పాలన, గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి పాలనపై మీ అభిప్రాయం

పరిపాలనపై ముఖ్యమంత్రికి పట్టులేదు. జిల్లాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులకు మధ్య సమన్వయం లేదు. పాలనా యంత్రాంగంపై పట్టు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వానికి ఇదో సవాలు. గతంలో కేసీఆర్ ఉన్నపుడు అడ్మినిస్ట్రేషన్ కంట్రోల్‌లో ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు.

రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర గురించి..


తెలంగాణ ఏర్పాటు ఆకాంక్ష అన్నది ఆరు దశాబ్దాలకుపైగా ఉన్నదే. కానే కాదు, రానే రాదనుకున్న తెలంగాణను కేసీఆర్ సాధించాడు. 1971లో 12 ఎంపీ సీట్లలో 11 సీట్లను చెన్నారెడ్డి గెలిపించినా అప్పుడు కూడా తెలంగాణ సాధ్యంకాలేదు. కానీ పార్లమెంటరీ విధానంలో 33 పార్టీలను ఒప్పించి సంతకాలు, లేఖలు, రాష్ట్రపతి ప్రసంగంలో పెట్టడం ద్వారా తెలంగాణ సాధించే వ్యూహాన్ని రచించి అమలు చేసింది కేసీఆర్ మాత్రమే. 1969 ఉద్యమం మాములు ఉద్యమం కాదు. అనేక మంది బలిదానాలు చేశారు. అయినా కూడా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యం కాలేదు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టును మీరెలా చూస్తారు?

కవిత నాకు సుమారు రెండున్నర దశాబ్దాలుగా తెలుసు. అమెరికాలో చదువుకుంటున్నప్పుడు జరిగిన ప్రమాదం నుంచి నాకు మరింతగా తెలుసు. ఆమె మొండి. మొన్న జైలు నుంచి బయటకు వచ్చినపుడు కూడా ఇదే మాట చెప్పింది. రాజకీయ కారణంతోనే కవితను అరెస్ట్ చేశారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారాలని ఆమెను టార్చర్ పెట్టినా ఆమె లొంగలేదు. సీబీఐ, ఈడీ కూడా ఆమెపై అన్ని రకాలుగా ఒత్తిడి తెచ్చి, చివరికి లాభం లేదని అనుకుని ఉండొచ్చు. ఢిల్లీలో వేసవిలో ఎండలు మామూలుగా ఉండవు. జైలులో చాలా దుర్భరమైన పరిస్థితులు ఉంటాయి. కవిత వాటన్నింటిని తట్టుకొని నిలబడింది. ఇది మామూలు విషయం కాదు.

> **"కేసీఆర్ ఎవరితోను మాట్లాడరని, ఎవరికీ సమయం ఇవ్వడని అంటుంటారు. దీనిపై మీ అనుభవం ఏమిటి?**
>
> **కేసీఆర్‌ను** అర్థం చేసుకోవడం అంత ఈజీ కాదు. తనకు ఏదైనా బాధ ఉన్నపుడు, మనసు బాగోలేనపుడు ఆయన ఎవరితోను మాట్లాడరు. తనలో తాను అంతర్మథనం చెందుతాడు. తన పంథాను నిర్దేశించుకుంటాడు. ఒక వ్యూహాన్ని సిద్ధం చేసుకొని తనకు నమ్మకం ఏర్పడే వరకు ఎవరితోను మాట్లాడడు. కుటుంబసభ్యులతో మాట్లాడకుండా ఉన్న రోజులు కూడా నేను చూశా. తన అంతర్మథనం పూర్తయినపుడు కొత్త ఆలోచన, కొత్త వ్యూహంతో ప్రజల ముందుకు వస్తాడు. అంతసేపు ఆయన మౌనమునిలా ఉంటాడు. ఎవరు పలకరించినా పలకడు. దీన్ని మనం అర్థం చేసుకొని మెదలాలి. అందుకే ఆయన మౌనంగా ఉన్నపుడు ఎవరూ ఆయనతో మాట్లాడేందుకు సాహసించరు. ఆయనను డిస్టర్బ్ చేయరు. ఇది నా స్వీయ అనుభవం.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	36.4°c	22.8°c
మెదక్	36.0°c	21.4°c
రంగారెడ్డి	35.1°c	20.2°c
కరీంనగర్	30.0°c	24.0°c
హైదరాబాద్	29.4°c	22.7°c
నల్లగొండ	29.0°c	23.0°c
నిజామాబాద్	28.3°c	23.5°c
వరంగల్	28.0°c	24.0°c
ఖమ్మం	26.0°c	24.0°c
మహబూబ్‌నగర్	25.1°c	21.3°c

నేడు, రేపు రాష్ట్రంలో భారీ వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ఏర్పడింది. శనివారం వాయుగుండంగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాలు, దక్షిణ ఒడిశాతో పాటు తెలంగాణలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు, ఒకటి రెండు చోట్ల అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. శనివారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టంచేసింది. అలాగే నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ అధికారులు సూచించారు.

అక్టోబర్‌లోనూ వర్షాలు

నైరుతి రుతుపవనాలు సెప్టెంబర్ చివరి వరకూ కొనసాగే అవకాశం ఉండటంతో అక్టోబర్‌లోనూ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సెప్టెంబర్, అక్టోబర్‌లో రుతుపవనాల వర్షపాతం లా నినా వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉన్నట్టు ఐఎండీ అధికారులు చెబుతున్నారు. రుతుపవనాల తిరోగమనంలో లా నినా అభివృద్ధి చెందితే.. అది ముగియడానికి చాలా సమయం తీసుకుంటుందని చెబుతున్నారు. సెప్టెంబరు 3-4 వారాల్లో, అక్టోబర్ ప్రారంభంలో భారీ వర్షాలు కురిస్తే, అప్పటికే చేతికొచ్చే పంటలకు, విత్తిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లనుందని ఫిలిప్ క్యాపిటల్ ఇండియాలో కమోడిటీస్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ అశ్విని బన్సోద్ మీడియాకు తెలిపారు. వర్షాలు, వరదలతో ఏర్పడే పంటనష్టం కారణంగా ఆహార ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తుందని అంచనా వేస్తున్నారు.

స్థానిక ఎన్నికలపై నేడు అఖిలపక్షం

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ తన కార్యాచరణను ప్రారంభించింది. ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రక్రియ తుది దశకు చేరింది. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు వివిధ రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేయనున్నది. మాసబ్‌ట్యాంక్‌లోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో గుర్తింపు పొందిన పార్టీలకు ఇప్పటికే ఆహ్వానం పంపింది. ఓటర్ల జాబితాపై పార్టీల సలహాలు, సూచనలు, అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 6న ఓటర్ల ముసాయిదా జాబితా, 21న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు.

త్వరలో వర్సిటీలకు కొత్త వీసీలు

సెప్టెంబర్‌లో సెర్చ్ కమిటీ సమావేశాలు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని యూనివర్సిటీలకు త్వరలో కొత్త వైస్‌చాన్స్‌లర్లు నియమితులుకానున్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును తీవ్రతరం చేసింది. సెప్టెంబర్ మొదటి లేదా రెండో వారంలో సెర్చ్ కమిటీ సమావేశాలను నిర్వహించనున్నారు. ఒకే రోజులో సమావేశాలను ముగించి, ఆ తర్వాత గవర్నర్‌కు పంపించనున్నారు. ఆమోదం రాగానే కొత్త వీసీలను నియమిస్తూ ప్రభుత్వ జీవోలను జారీచేసే అవకాశముంది. మొత్తం ప్రక్రియను 15 నుంచి 20 రోజుల్లో ముగించాలని సర్కారు గడువుగా పెట్టుకున్నట్టు అధికారులు తెలిపారు.

పాత పెన్షన్ విధానమే కావాలి: జేఏసీ

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో యూపీఎస్ పెన్షన్ విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించడాన్ని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వీ లచ్చిరెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. శుక్రవారం జేఏసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడిన ఆయన సీపీఎస్, యూపీఎస్ రెండు పెన్షన్ విధానాలు వద్దేవద్దన్నారు. పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులు రాములు, కే రామకృష్ణ, గోపాల్, రమాదేవి, దర్శన్‌గౌడ్, కత్తి జనార్దన్, ప్రగతికుమార్, ఎస్ రాములు, సంపత్‌కుమార్ స్వామి పాల్గొన్నారు.

దేశంలో మహిళలకు భద్రత కరువు

హైదరాబాద్ పర్యటనలో రాబర్ట్ వాద్రా వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేయబోతున్న ఏఐసీసీ కార్యదర్శి ప్రియాంక గాంధీకి ఆమె భర్త రాబర్ట్ వాద్రా శుభాకాంక్షలు తెలిపారు. రెండు రోజుల పర్యటనకు రాబర్ట్ వాద్రా శుక్రవారం హైదరాబాద్ వచ్చారు. పలు ఆలయాలు సందర్శించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తాను ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చానని చెప్పారు. దేశంలో మహిళల భద్రత ప్రధాన సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్య, కూతురు భద్రత విషయంలోనూ అప్పుడప్పుడు ఆందోళనగా అనిపిస్తుందని చెప్పారు. మహిళలతో ఎలా ప్రవర్తించాలో ఇంట్లో నేర్పితేనే అది సాధ్యం అవుతుందన్నారు. ఇదే విషయాన్ని రాహుల్ గాంధీ కూడా చెప్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌లో తాను పవర్ సెంటర్ కావడంపై కాలమే నిర్ణయిస్తుందని చెప్పారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఐదేండ్ల తర్వాత ఆ మార్పును చూస్తారని అన్నారు.

ఖజానాను నింపేదెలా?

- ప్రజలకు భారం కాకుండా ఆదాయం పెంపుపై దృష్టి
- కొత్త ఆలోచనలతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించండి
- సమీక్షలో అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం



హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): ప్రజల పైన ఎలాంటి పన్నుల భారం వేయకుండా ప్రభుత్వ అవసరాలను, ఆలోచనలను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల్లో ప్రత్యామ్నాయ ఆదాయం పెంపుపై అధికారులు దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూ చించారు. ఖజానాను నింపేందుకు ఆదా యం పెంపు మార్గాలపై కీలక శాఖలతో శుక్రవారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రతి నెల సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆదాయం పెంపుపై జరిగే సమావేశానికి కొత్త ఆలోచనలతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని రావాలని సూచించారు. ఖజానాను నింపేందుకు ఆయా శాఖల్లో స్వేచ్ఛ గా నిర్ణయాలు తీసుకొని ఫలితాలు సాధించాలని చెప్పారు. అందరికీ ఇసుకను అం దుబాటులోకి తెచ్చేందుకు పట్టణాలకు స మీపంలో సబ్ యార్డులు, అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మార్కెట్ యార్డుల్లో ఇసుక నిల్వలు అందుబాటులో ఉంచాలని మై నింగ్‌శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు.. ఇప్పటివరకు సమకూరిన ఆదాయం.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ఏ మేరకు రాబడిని అంచనా వేయవచ్చు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ల్యాండ్ పూలింగ్ ప్రణాళికలు, అసైన్డ్ భూములు, కోర్టు వివాదాలను సమీక్షించారు. రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరుల్లో జీఎస్టీ ఒకటి... లీకేజీలను అరికట్టి ఆదాయం పెంచేందుకు యాక్షన్‌ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, కమర్షియల్ ట్యాక్స్, రెవెన్యూ కమిషనర్ రిజ్వీ, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్, రవాణాశాఖ కమిషనర్ బుద్ధప్రకాశ్, హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ గౌతం, మైనింగ్‌శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, డైరెక్టర్ సుశీల్, పరిశ్రమలశాఖ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇక పన్నులతో బాదుడే!

- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా ఈ ఏడాది రూ.18,229 కోట్లు పిండుకోనున్న ప్రభుత్వం
- 80 రకాల సేవలపై స్టాంప్‌డ్యూటీ
- జీహెచ్‌ఎంసీలో ఇంటింటి సర్వే
- బస్సు చార్జీలు పెంచే యోచన



హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): పన్నులతో ప్రజలను వీరబాదుడు బాది భారీ మొత్తంలో ఆదాయాన్ని సమీకరించుకొనేందుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమవుతున్నది. అందులో భాగంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టంలోని నిబంధనలను మరింత విస్తరించేందుకు కసరత్తు చేస్తున్నది. స్థిరాస్తి క్రయవిక్రయాలు, గిఫ్ట్‌డీడ్‌లు, డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లతోపాటు ఫ్రాంచైజీ ఒప్పందాలు, రియల్ ఎస్టేట్ ఒప్పందాలు, పుస్తకాల కాపీరైట్స్, ప్రకటనలపై కూడా స్టాంప్ డ్యూటీ వసూలు చేయాలని, తద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.18,228.82 కోట్లు రాబట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించి, పెద్దమొత్తంలో ఆస్తి పన్ను రాబట్టుకొనేందుకు చర్యలు చేపట్టడంతోపాటు ఆర్టీసీ బస్సు చార్జీలను పెంచే యోచనలో ఉన్నట్టు తెలిసింది. ఇది కార్యరూపం దాల్చితే ప్రయాణికులకు పెను భారం తప్పదు. ఈ నేపథ్యంలో బస్సు చార్జీల పెంపు నిర్ణయాన్ని పునరాలోచించాలని ఇప్పటికే పలు వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

రూ.4 వేల కోట్ల అదనపు భారం

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.12,372.73 కోట్లు, 2022-23లో రూ.14,228.18 కోట్లు, 2023-24లో రూ.14,295.56 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో దీన్ని మరో రూ.4 వేల కోట్లకుపైగా పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు రాష్ట్ర బడ్జెట్‌లో రేవంత్‌రెడ్డి సర్కారు ప్రకటించింది. దీనిలో భాగంగా భూముల మార్కెట్ విలువ, వాస్తవిక ధరలను పరిగణనలోకి తీసుకొని భూముల విలువలను నిర్ణయించడంతోపాటు రిజిస్ట్రేషన్లు, డాక్యుమెంట్లు, ఫీజుల చెల్లింపులు, తదితర సుమారు 80 సేవలను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకురావడం ద్వారా రాష్ట్ర రాబడిని పెంచాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ఇప్పటికే జారీ చేసింది. దీంతో భవిష్యత్తులో స్థిరాస్తుల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్లు చేసుకునే వారిపై మరింత భారం పడటం ఖాయమని రియల్ ఎస్టేట్ నిపుణులు చెప్తున్నారు.

ఇంటింటి సర్వేతో ఆస్తిపన్ను పెంపు

పెద్ద మొత్తంలో ఆస్తిపన్నును రాబట్టుకునేందుకు ప్రభుత్వం ఇంటింటి సర్వేను ప్రారంభించింది. ఈ సర్వేలో ప్రజల ఆస్తుల విలువను అంచనా వేసి, తదనుగుణంగా పన్నులు పెంచుతారు. ఆస్తిపన్ను ఎగ్గొడుతున్న వారిపై జీహెచ్‌ఎంసీ ఇప్పటికే దృష్టి పెట్టింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 19 లక్షల నిర్మాణాలు ఆస్తి పన్ను పరిధిలో ఉన్నాయి. వాటి ద్వారా రూ.1,900 కోట్ల ఆదాయం వస్తున్నది. చాలా భవనాలను నివాసేతర అవసరాలకు వినియోగిస్తున్నప్పటికీ వాటి యజమానులు నివాస క్యాటగిరీ కింద పన్నులు చెల్లిస్తున్నారు. ఐదంతస్తుల భవనంలో రెండు, మూడు అంతస్తులకే పన్నులు కడుతున్నారు. బడా నిర్మాణాలు ఎగ్గొడుతున్న పన్ను విలువ 90% మేరకు ఉంటుందని అంచనా. ఇలాంటి అవకతవకలను సరిదిద్ది, పన్ను రాబడిని పెంచేందుకు జీహెచ్‌ఎంసీ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) సర్వేను మొదలుపెట్టింది. మూడు దశల్లో ఈ సర్వే చేసి ఆస్తిపన్ను మదింపు చేయాలని జీహెచ్‌ఎంసీ రెవెన్యూ విభాగం నిర్ణయించింది. దీంతో పన్ను పరిధిలోకి వచ్చే నిర్మాణాల సంఖ్య 25 లక్షలు దాటుతుందని అధికారులు భావిస్తున్నారు.

యాదగిరిగుట్టకు టెంపుల్ బోర్డు

- బంగారం తాపడం వేగవంతం చేయాలి
- ఆలయాభివృద్ధి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- టూరిజం అభివృద్ధి కోసం కొత్త పాలసీకి ఆదేశం



సీఎం రేవంత్‌రెడ్డికి ఆశీర్వచనం అందజేస్తున్న వేములవాడ ఆలయ అర్చకులు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. యాదగిరిగుట్ట అభివృద్ధిపై శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో సీఎం మాట్లాడారు. ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధి పెండింగ్ పనుల వివరాల నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆలయ అభివృద్ధి పనులను అర్ధాంతరంగా వదిలేయడానికి వీల్లేదని చెప్పారు. భక్తులకు సౌకర్యాలు, భవిష్యత్తు అవసరాల మేరకు చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన వివరాలు అందించాలని కోరారు. ఆలయ అభివృద్ధిని మరో స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. వైటీడీఏ, యాదగిరిగుట్టకు సంబంధించి పూర్తి స్టేటస్ రిపోర్టు తనకు అందించాలని ఈ సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యాలు, విడిది కాటేజీల నిర్మాణాలకు దాతలు, కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. కీసరగుట్టపై ఉన్న రామలింగేశ్వర ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించాలని చెప్పారు.

రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి కొత్త పాలసీ రూపొందించాలని శుక్రవారం సచివాలయంలో స్పీడ్ ప్రాజెక్టులపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లోని బెస్ట్ పాలసీలను అధ్యయనం చేయాలని, ఎకో, టెంపుల్ టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి ప్రాంతంలో 200 ఎకరాల ప్రభుత్వ భూములను హెల్త్ టూరిజం అభివృద్ధికి వినియోగించాలని చెప్పారు. హైదరాబాద్ బయట దాదాపు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో కొత్త జూ పార్క్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వనరుల అభివృద్ధికి అవసరమైన చోట పీపీపీ విధానాన్ని అవలంబించాలని సూచించారు. సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శుక్రవారమే సీఎం రేవంత్‌రెడ్డిని వేములవాడ ఆలయ అర్చకులు కలిసి ఆశీర్వచనం అందించారు. ఆలయ విస్తరణ డిజైన్ల నమూనాకు శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాలని ఆలయ అర్చకులు సీఎంకు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో విప్ ఆది శ్రీనివాస్, ఈవో వినోద్, స్థపతి వల్లినాయగం, ఈఈ రాజేశ్, డీఈఈ రఘునందన్, ప్రధాన అర్చకుడు ఉమేశ్ శర్మ తదితరులు ఉన్నారు.

నన్ను మన్నించండి

మొదటిపేజీ తరువాయి...

ఒప్పుకోకుండా.. 'కొందరు వ్యక్తులు నా వ్యాఖ్యలను వక్రీకరించి ప్రచారం చేశారు' అంటూ మీడియాపై నెపం మోపారు. 'భారత న్యాయ వ్యవస్థపై నాకు అపారమైన గౌరవం ఉన్నది. సుప్రీంకోర్టు స్వతంత్రతను నేను ప్రశ్నించాననే భావన కలిగించేలా ఈ నెల 29న మీడియాలో కామెంట్లు వచ్చాయని గుర్తించాను. న్యాయవ్యవస్థను నమ్మి, గౌరవించే వ్యక్తిగా.. మీడియాలో వచ్చిన కామెంట్ల పట్ల నేను బేషరతుగా క్షమాపణలు చెప్తున్నాను. న్యాయ వ్యవస్థ స్వేచ్ఛపై నాకు అపారమైన నమ్మకం ఉన్నది. నేను చేసిన వ్యాఖ్యలను కొందరు వక్రీకరించి ప్రచారం చేశారు' అని సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ధర్మాసనం తలంటితేనే గుర్తుకొచ్చిందా?

సీఎం రేవంత్‌రెడ్డి తన తప్పును ఒప్పుకోకుండా.. మీడియా తన వ్యాఖ్యలను వక్రీకరించిందని చెప్పడంపై జర్నలిస్టు వర్గాల్లో, రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. సీఎం స్పష్టంగా అన్న మాటలను యథావిధిగా ప్రచురిస్తే వక్రీకరించారని ఎలా అంటారని ప్రశ్నిస్తున్నారు. సీఎం కామెంట్లు బుధవారం టీవీల్లో, వెబ్‌సైట్లలో, గురువారం ఉదయానికి పేపర్లలో ప్రచురితమయ్యాయి. ఒకవేళ మీడియా వక్రీకరిస్తే వెంటనే ఎందుకు ఖండనగానీ, వివరణ కానీ ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారు. గురువారం మధ్యాహ్న భోజన విరామం తర్వాత ధర్మాసనం సీఎం వ్యాఖ్యలను ప్రస్తావించి, చీవాట్లు పెడితే.. శుక్రవారం ఉదయానికి జ్ఞానోదయం అయ్యిందా? అని మండిపడుతున్నారు. ధర్మాసనం తలంటితేనే మీడియా వక్రీకరించిందని రెండు రోజుల తర్వాత గుర్తుకువచ్చిందా? అని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ బీజేపీ-బీఆర్ఎస్ ఒప్పందంలో భాగంగా కవితకు బెయిల్ వచ్చినట్టు భావిస్తే.. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీకి బీజేపీ-కాంగ్రెస్ ఒప్పందం మేరకు బెయిల్ వచ్చిందా? అని ప్రశ్నిస్తున్నారు. ఇండియా కూటమి నేతలు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియాకు కూడా బెయిల్ వచ్చిందని ఈ లెక్కన బీజేపీతో ఆప్ స్నేహం చేసినట్టా? అని నిలదీస్తున్నారు.

నేను మాట్లాడినప్పుడు ఈటల ఎక్కడ?

- ఎంపీ హోదాలో చౌకబారు వ్యాఖ్యలు సరికాదు
- రేవంత్‌రెడ్డిని పొగిడినట్టు వీడియో చూపెట్టండి
- లేదంటే బహిరంగ క్షమాపణలు చెప్పండి
- ఈటలపై ప్రొఫెసర్ నాగేశ్వర్ ఆగ్రహం



హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): తన మాటలను వక్రీకరించి మీడియాలో ఇష్టారీతిన మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్ రాజీనామా చేయాలని, లేదా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ డిమాండ్ చేశారు. ఆయన ఓ వీడియో విడుదల చేశారు. ఎన్ కన్వెన్షన్ కూల్చివేత తర్వాత ఈటల రాజేందర్ తనపై చౌకబారు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. 'నేను ఏ వీడియోలో రేవంత్‌రెడ్డి గొప్ప సంఘ సంస్కర్త, ప్రగతి కాముకుడు అని చెప్పానో చూపాలి. లేకపోతే పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేయాలి. కాదంటే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి. హైడ్రా విషయంలో బీజేపీ వైఖరి ఏంటో చెప్పి.. ఆ తర్వాత మాట్లాడండి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బీఆర్‌ఎస్‌ను వీడిన తర్వాత ఈటల రాజేందర్ నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో చర్చలు జరిపింది నిజం కాదా? ఇకముందు కూడా కాంగ్రెస్‌లో చేరబోనని గ్యారెంటీ ఇవ్వగలరా ?శాశ్వతంగా బీజేపీలోనే ఉంటానని చెప్పగలరా? ఇతరులపై చౌకబారు వ్యాఖ్యలు చెప్పేముందు గతం ఒక్కసారి చూసుకోవాలి' అంటూ హితవు పలికారు.

మంత్రిగా మాట్లాడలేదేమీ?

'బీఆర్‌ఎస్ హయాంలో మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ బడా బాబుల అక్రమాలపై ఎందుకు మాట్లాడలేదు? నేను ఎప్పట్నుంచో పేదల గురించి మాట్లాడుతున్నా. ఉద్యమకాలం నుంచి ఎన్ కన్వెన్షన్, పద్మాలయ స్టూడియో, లగడపాటి ల్యాంకోహిల్స్, అయ్యప్పసొసైటీ వంటి వాటిపై గళమెత్తాను. నాడు ఎమ్మెల్సీగా జిల్లెలగూడ చెరువు, మంత్రాల చెరువు, మీర్‌పేట్ చెరువుల గురించి ప్రస్తావించా. మేము పేదల గురించి పోట్లాడుతుంటే మీరు ఎక్కడున్నారు ఈటల రాజేందర్?' అని ప్రశ్నించారు. ఈటల కంటే ముందే.. హైడ్రా కమిషనర్‌తో పేదల ఇండ్ల గురించి ప్రస్తావించినట్టు చెప్పారు. తాను జెండాలు, ఎజెండాలు మార్చే సూడో పొలిటీషియన్‌ను కాదని, తనపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేదంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రెండేండ్లలో దేవాదుల పూర్తి

- సోనియాగాంధీతో ప్రారంభిస్తాం
- 300 రోజులు నీళ్లు ఎత్తిపోస్తం
- భువనగిరిలో లక్షల ఎకరాలకు సాగునీళ్లు
- ప్రాజెక్టుల్లోని సిల్ట్‌ను ఎత్తిపోస్తం
- కెనాళ్లలో జంగిల్ కటింగ్ చేస్తం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క బరాజ్ వద్ద మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క

యాదాద్రి భువనగిరి/ములుగు, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): రెండేండ్లలో దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి, సోనియాగాంధీతో ప్రారంభిస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర శివారులో భువనగిరి పార్లమెంట్ స్థాయి నీటిపారుదల పనులపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన హాజరయ్యారు. అంతకు ముందు అనాజిపురంలో బునాదిగాని కాల్వను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద ఉన్న దేవాదుల పంపుహౌస్, మోటర్ల పనితీరును మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క అధికారులతో కలిసి పరిశీలించి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు పనుల పురోగతిని ఆ శాఖ ఈఅండ్‌సీ, సీఈలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వ హయాంలో చేపట్టిన దేవాదుల ప్రాజెక్టు పనులు పదేళ్లుగా కుంటుపడ్డాయన్నారు. శం కుస్థాపనను 2008లో సోనియాగాంధీ చేశారని, పనులను 2026 మార్చి వరకు పూర్తి చేసి తిరిగి సోనియా గాంధీ ప్రారంభిస్తారనిమని చెప్పారు. 300 రోజుల పాటు నీళ్లను లిఫ్ట్ చేసి ఎత్తిపోతల ద్వారా 60 టీఎంసీ గోదావరి జలాలను దేవాదుల ప్రాజెక్టు ద్వారా సా గునీటితో పాటు తాగునీటిగా అందించేందుకు కృషి చేస్తామన్నారు. మోడికుంట, సమ్మక్క బరాజ్‌కు అనుమతులను సాధిస్తామని, 1.4 టీఎంసీలతో గంధమల్ల రిజర్వాయర్ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. 'కాళేశ్వరంపై కొం త అయోమయం ఉంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా ఉంది. నేషనల్ డ్యామ్ అథారిటీతో పలుమార్లు టెస్టింగ్ చేయించాం. బ్యారేజీ, డిజైన్, నిర్మాణం, మెయింటెనెన్స్‌లో తీవ్ర లోపాలు ఉన్నాయని తేల్చారు. మూడు కూడా కొలాప్స్ అయ్యే పరిస్థితి ఉంది' అని ఉత్తమ్ చెప్పారు.

ఇంకా 13వేల కోట్ల రుణమాఫీ: పొంగులేటి


31వేల కోట్ల రుణమాఫీలో ఇప్పటివరకు రూ. 18 వేల కోట్లు మాఫీ చేశామని, మిగతా రూ.13 వేల కోట్లు త్వరగా మాఫీ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 40 రోజుల్లోపు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యేలు ముగ్గుపోసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్టు చెప్పారు. ధరణి ప్రక్షాళన చేస్తామని, ల్యాండ్ రెవెన్యూ చట్టాన్ని దేశంలోనే రోల్ మోడల్‌గా చేస్తామని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డులను ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

దేవాదులకు రూ.200 కోట్లు కేటాయించండి : ఎమ్మెల్యే పల్లా

జనగామ, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): 'రెండు చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నా.. దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పనుల కోసం రూ.200 కోట్లు కేటాయించండి.. జనగామ నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుంది' అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. శుక్రవారం భువనగిరి పట్టణంలో నిర్వహించిన భువనగిరి పార్లమెంట్‌స్థాయి నీటి పారుదల శాఖ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు 4 మోటర్లు ఆన్‌చేసి చెరువులు నింపాలని ఈ సందర్భంగా కోరారు.

భూ నిర్వాసితులకు నష్టపరిహారం: సీతక్క

రామప్ప నుంచి లక్నవరానికి గ్రావిటీ కెనాల్‌లో భూములు కోల్పోయే నిర్వాసితులకు తగిన విధంగా నష్టపరిహారం అందిస్తామని మంత్రి సీతక్క అన్నారు. సమావేశాల్లో ప్రభుత్వ విప్ ఐలయ్య, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌రెడ్డి, పల్లా రాజశేఖర్‌రెడ్డి, సామేల్, వేముల వీరేశం, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, కడియం శ్రీహరి, యశస్వినీరెడ్డి, దొంతి మాధవరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, మురళీనాయక్ పాల్గొన్నారు.



బీరెల్లి కమలాకర్‌రావు ఉద్యోగ విరమణ సన్మానసభలో మాట్లాడుతున్న ఈవీ నర్సింహారెడ్డి

విద్యాభివృద్ధికి సంఘాలు కీలకపాత్ర పోషించాలి

పీఆర్టీయూ నేత కమలాకర్‌రావు పదవీ విరమణ సభలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు తమ వంతు పాత్రను పోషించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఆకాంక్షించారు. ఈ దిశలో సంఘాలు కృషిచేయాలని కోరారు. పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు ఉద్యోగ విరమణ సన్మానసభను శుక్రవారం దోమల్‌గూడలోని పింగలి వెంకటరాంరెడ్డి కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు, పీఆర్టీయూ సంఘ బాధ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఆరు సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కమలాకర్‌రావు అందించిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బీ మోహన్‌రెడ్డి, పూల రవీందర్, పేరి వెంకట్‌రెడ్డి, గుర్రం చెన్నకేశవరెడ్డి, టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎనుగుల సత్యనారాయణ, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దేవాదులకు మళ్లీ ప్రారంభోత్సవమట!

- 2001లో చంద్రబాబు.. 2007లో సోనియా రిబ్బన్ కట్
- మళ్లీ సోనియాతో ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటన
- శిలాఫలకాలే తప్ప నీళ్లిచ్చింది లేదు
- సమ్మక్కసాగర్ కట్టేదాకా పథకానికి నీళ్లే లేవు

హైదరాబాద్, ఆగస్టు30 (నమస్తే తెలంగాణ): దేవాదుల ప్రాజెక్టును సోనియాగాంధీ చేత ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వరంగల్ వేదికగా ప్రకటించడంపై ఇరిగేషన్ నిపుణులు, తెలంగాణవాదులు నవ్వుకుంటున్నారు. దేవాదుల ప్రాజెక్టును ఎన్నిసార్లు ప్రారంభిస్తారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ పథకానికి కాంగ్రెస్ శిలాఫలకం వేసింది తప్ప ఏనాడూ నీళ్లివ్వలేదని, ఇప్పుడు మళ్లీ ప్రారంభిస్తామని ఎందుకు ప్రగల్భాలు పలుకుతున్నారని ప్రశ్నిస్తున్నారు. గోదావరి తలాపునే ఉన్నా గొంతు తడవని దుస్థితి ఉమ్మడి వరంగల్ జిల్లాది. ఉద్యమ నేత కేసీఆర్ గులాబీ జెండా ఎత్తి పిడికిలి బిగించిన అనంతరం నాటి సీఎం చంద్రబాబు 'జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల' పథకాన్ని 2001లో తెరమీదికి తెచ్చారు. హడావుడిగా 2003లో శిలాఫలకం వేశారు. కానీ తట్టెడు మట్టి కూడా తీయలేదు. తర్వాత 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 'మొదటిదశ' పనులు పూర్తిచేయకుండానే 2, 3వ దశ పనులను తెరమీదికి తెచ్చింది. 2007లోనే పథకాన్ని పూర్తి చేయాలి లక్ష్యంగా పెట్టుకున్నది. మొదటిదశ పనులన్నీ పూర్తయ్యాయని చెప్పి 2008లో అప్పటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ చేతుల మీదుగా గంగారం ఇన్‌టేక్ పాయింట్ వద్ద అట్టహాసంగా ప్రారంభింపజేసింది. 2012 నాటికి దేవాదుల మొదటిదశ ఎత్తిపోతలు ప్రారంభమైనా ఏనాడూ పూర్తిస్థాయిలో నీరిచ్చింది లేదు. ఇక 2, 3వ దశ పనులకు అతీగతి లేదు. కానీ ఇప్పుడు మళ్లీ దేవాదుల పథకాన్ని సోనియాగాంధీ చేతుల మీదుగా ప్రారంభింపజేస్తామని తాజాగా మంత్రి ఉత్తమ్‌కుమార్ ప్రకటించడంపై రాజకీయ ప్రముఖులు, నీటిపారుదల రంగ నిపుణులు విమర్శలు గుప్పిస్తున్నారు.

సమ్మక్కసాగర్‌తోనే దేవాదులకు జీవం..

దేవాదులనుంచి ఏటా 38.18 టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు కాంగ్రెస్ ప్రణాళిక రూపొందించింది. వరంగల్‌కు తాగునీటికి 2.84టీఎంసీలు కేటాయించింది. మిగిలిన 35.34 టీఎంసీలను సాగుకు వినియోగించాలని నిర్ణయించింది. టీఎంసీ నీటితో 15,360 ఎకరాలకు నీరందించాలని నిర్ణయించింది. దేవాదుల ద్వారా ఆశించిన ప్రయోజనాలు నెరవేరలేదు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం కేసీఆర్ ఈ ప్రాజెక్టుపై పూర్తి గా సమీక్షించారు. 267 రోజుల పాటు నీటిని ఎత్తిపోసేలా ప్రాజెక్టును తీర్చిదిద్దిన కేసీఆర్, గతంలోనే ఉమ్మడి వరంగల్ సాగు, తాగునీటి అవసరాలకు అంకితం చేశారు.

ఉత్తమ్ సీఎం అవుతరు

నా నాలుకపై మచ్చలున్నయ్ నేను చెప్పానంటే అయి తీరుతది

రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): 'నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భవిష్యత్తులో ఎప్పుడో ఒకసారి తప్పకుండా ముఖ్యమంత్రి అవుతరు. నా నాలుకపై మచ్చలు ఉన్నయి. నేను అన్నది అవుతది. భవిష్యత్తులో ఆయన సీఎం అయ్యే అవకాశం ఉన్నది' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జోస్యం చెప్పారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో పార్లమెంట్ స్థాయి నీటి పారుదల పనులపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రజలు మూసీ కాలుష్యంతో బాధపడుతున్నారని, హైదరాబాద్ కాలుష్యమే గాక జిల్లాలోని రసాయన కంపెనీ వ్యర్థాలు మూసీలో కలుస్తున్నాయని చెప్పారు. మూసీని ప్రక్షాళన చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని పేర్కొన్నారు. బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వల మీద అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలపై తాను సంతృప్తిగా లేనని, వాటిని రీ డిజైన్ చేయాలని సూచించారు.

20రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ కార్యదర్శులు

హైదరాబాద్, ఆగస్టు30 (నమస్తే తెలంగాణ): 20 రాష్ట్రాలకు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులను నియమిస్తూ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణకు ఏఐసీసీ సెక్రటరీగా పీసీ విష్ణునాథ్, జాయింట్ సెక్రటరీగా విశ్వనాథన్‌ను నియమించింది. తెలంగాణకు చెందిన కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ సెక్రటరీగా నియమించింది. ఇక ఏపీ సెక్రటరీ గణేశ్‌కుమార్ యాదవ్, జాయింట్ సెక్రటరీగా పాలక్‌వర్మను ఏఐసీసీ ప్రకటించింది.

ఏడు మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : ఏడు మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ వ్యవసాయశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటి వరకు 39 మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. మహబూబ్‌నగర్, జగిత్యాల జిల్లాలోని వెల్గటూరు, కామారెడ్డి జిల్లాలోని గాంధారి, సదాశివనగర్, ఎల్లారెడ్డి, ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, మద్దులపల్లి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించింది.

'వాహన్'లోకి ఆర్టీఏ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : ఒకే దేశం-ఒకే పోర్టల్ పేరిట కేంద్రం.. రవాణాశాఖలో తీసుకొచ్చిన వాహన్ పోర్టల్‌లో మరో రెండు వారాల్లో రాష్ట్రం చేరబోతున్నది. 2019లోనే పోర్టల్ అందుబాటులోకి వచ్చినా సీఎఫ్‌ఎస్‌టీ సాఫ్ట్‌వేర్ సులభతరంగా ఉండటంతో అప్పటి ప్రభుత్వం ఆ వైపుగా ఆలోచించలేదు. ప్రస్తుతం సీఎఫ్‌ఎస్‌టీకి బదులుగా వాహన్ పోర్టల్‌లో ఆర్టీఏ చేర్చడానికి ప్రణాళికలు రచించా రు. తొలుత సికింద్రాబాద్ నుంచి పోర్టల్ సేవలు ప్రారంభించనున్నారు. ఇప్పటికే రవాణాశాఖ రాష్ట్ర వ్యాప్తంగా జారీ చేస్తున్న ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ కేంద్ర రవాణాశాఖ నిబంధనల మేరకు ఉన్నాయి. ఇది అందుబాటులోకి వస్తే దేశంలో ఎక్కడి నుంచైనా ఆర్టీఏ సేవలు పొందవచ్చు.

'టామ్‌కామ్'లో దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): సౌదీ అరేబియాలోని వేర్‌హౌజ్ అసోసియేట్స్ ఉద్యోగాలకు టామ్‌కామ్ ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నిర్వాహకులు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 7013361343, 9985483931 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. మల్లెపల్లి క్యాంపస్ ఐటీఐ కాలేజీలో 4న ఎన్‌రోల్‌మెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

5,748 స్కూళ్లలో సెల్ఫ్ డిఫెన్స్

హైదరాబాద్, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): సర్కారీ స్కూళ్లలోని బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. 5,748 బడుల్లో సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను అమలుచేయనున్నారు. 3 మాసాలపాటు అందించే శిక్షణ ఈ నెల నుంచి ప్రారంభంకానుంది. సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు శిక్షణ కొనసాగుతుంది. మార్గదర్శకాలతోపాటు, రూ.7.32 కోట్ల నిధులను విద్యాశాఖ అధికారులు మంజూరుచేశారు. మార్షల్ ఆర్ట్స్‌తోపాటు, సెల్ఫ్ డిఫెన్స్, పౌష్టికాహారాన్ని తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రతపై బాలికలకు ప్రత్యేక అవగాహన కల్పిస్తారు. కుంగ్ ఫూ, కరాటే, జూడో లాంటి మార్షల్ ఆర్ట్స్‌లోని ముఖ్యమైన సెల్ఫ్ డిఫెన్స్ చిట్కాలపై శిక్షణ ఉంటుంది.

4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 31 ఆగస్టు 2024
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

మహిళలపై చిన్నచూపు దేశానికే అరిష్టం

వేదాలలో ప్రవచించిన ధర్మార్థ కామ మోక్షాలు సిద్ధించాలంటే వివాహ వ్యవస్థ, అందులో ముఖ్యంగా లింగ సమానత్వం ఉండాలన్నది ధర్మ సిద్ధాంతం. సమానత్వం ఎప్పుడు సిద్ధిస్తుంది? స్త్రీలు, పురుషులు ఇద్దరికీ ఒకరి మీద ఇంకొకరికి ప్రేమ, ఆదరం, గౌరవం ఉన్నప్పుడు అది సాధ్యమవుతుంది. వివాహంలో భార్యాభర్తల మధ్య, కుటుంబంలో స్త్రీలు, పురుషుల మధ్య, సమాజంలో కూడా ఈ రెండు వర్గాల మధ్య ఇటువంటి గౌరవం, వారి ఆవశ్యకత గురించి అవగాహన లోపిస్తే దేశం ఎలా ఉంటుంది? ఇదిగో ఇప్పుడు మనం బతుకుతున్న భారతదేశంలా ఉంటుంది. స్త్రీల పట్ల క్రూరంగా ఉన్నవాడెవడూ బాగు పడలేదు, పడడు కూడా!



కనకదుర్గ దంటు
89772 43484

ఒక దేశం సుభిక్షంగా ఉండి, ప్రగతి పథంలో పయనించాలంటే ఆ దేశ రాజ్యాంగం, దానిని పటిష్ఠంగా అమలుపర్చాల్సిన నాయకులు ధర్మబద్ధంగా ఉండాలి. నియమాలు చిన్నాభిన్నం చేసి, వ్యవస్థలను నిర్వీర్యం చేసి తమ ఇష్టానుసారం ప్రవర్తిస్తే ధర్మం మాట పక్కనపెట్టి, న్యాయం కూడా జరగదు. దీనికి సరైన ఉదాహరణ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు, 5 నెలల జైలు జీవితం. చివరికి ఆధారాలు చూపని ఈడీ, సీబీఐలను ముక్కచీవాట్లు పెట్టి ఆవిడకి బెయిలు మంజూరు చేసిన సుప్రీం కోర్టు నిర్ణయం, నరేంద్ర మోదీ ప్రభుత్వ ఎంత దిగజారుడు రాజకీయాలు చేస్తుందో ప్రపంచానికి చాటిచెప్పింది. వీరత్వంతో పాండవులను గెలవలేమని గ్రహించిన దుష్ట చతుష్టయం (దుర్యోధనుడు, శకుని, దుశ్శాసనుడు, కర్ణుడు) మోసంతో గెలిచి, వారిని వనవాసానికి పంపారు. కానీ, చివరి గెలుపు ఎవరిది? ధర్మం ఎవరివైపు ఉందో వారిదే!

నిర్భయ ఉదంతం (2012) అడ్డుపెట్టుకొని 2014లో ఎన్నికలు గెలిచిన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంలో స్త్రీల పరిస్థితి ఎలా ఉంది? నిజానికి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగు లేకపోతే ఎక్కువ వేదన, కష్టం అనుభవించేది స్త్రీలే. కార్పొరేట్ పక్షపాత మోదీ పాలనలో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వారి స్థితి ఎంత దిగజారిందో గణాంకాలే చెప్తున్నాయి. ధరలు నియంత్రించటంలో కాంగ్రెస్ విఫలమైందని దప్పుకొట్టి అధికారం చేజిక్కించుకున్న బీజేపీ పాలనలో ధరలు 2014లో ఉన్న కంటే సుమారు 70 శాతం పెరిగాయి. పోనీ, సామాన్యుల సంపాదన ఏమైనా పెరిగిందా అంటే అదీ లేదు, దేశం బాగు పడిందీ లేదు. 45 శాతం ఉన్న యువతకు ఉద్యోగాలు సృష్టించలేదు, విద్యారంగం నాశనమైంది. మరి కేంద్ర ప్రభుత్వం విపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాల నిధులు కూడా మింగి వెలగబెడుతున్నదేమిటి? 148 కోట్ల జనాభా ఉన్న దేశంలో పది మంది అపర కుబేరులుంటే చాలదు. సామాన్యుల కనీస అవసరాలు తీరాలి. ఈ సామాన్య కుటుంబాలలో స్త్రీల పరిస్థితి మరింత దిగజారింది. బీజేపీ పాలిత రాష్ట్రాలలో కూడా ప్రభుత్వ పాఠశాలలలో బాలికల శాతం ఘోరంగా తగ్గిపోయింది. 'బేటీ బచావ్, బేటీ పఢావ్', కాస్తా 'బేటీ ఛిడావ్' అయిపోయి అత్యాచారాలు పెరిగాయి. అహంకారంతో నేరాలు చేస్తున్న తమ అనుయాయులకు బీజేపీ శిక్షలు వేయకపోగా, సన్మానాలు చేస్తున్నది.



బలమైన ప్రత్యర్థులైన కేజ్రీవాల్‌ను నియంత్రించటానికి సిసోడియాను, కేసీఆర్ మీద పగ తీర్చుకోవడానికి కవితను అన్యాయంగా జైలులో పెట్టిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు ఏ శిక్ష వేయాలి? ఎన్నికల అధికారులను, ఈవీఎంలను అడ్డం పెట్టుకొని అధికారం చేజిక్కించుకోవచ్చు. కానీ, ప్రజల మన్నన పొందగలరా? అసలు దేశంలోని స్త్రీలందరూ ఒకసారి తమ పట్ల బీజేపీ ప్రభుత్వం ఎట్లా ప్రవర్తిస్తుందో గమనిస్తున్నారా? అర్థం చేసుకుంటున్నారా? 148 కోట్ల భారత జనాభాలో సుమారు 66 కోట్ల మంది హిందూ స్త్రీలకు ఏమైనా మంచి చేసే విధానాలు ప్రవేశపెట్టలేదు కానీ, మత విద్వేషంతో 10 కోట్ల మంది ముస్లిం స్త్రీల 'తలాక్' చట్టం సవరించేశారు. ఈ ద్వేష భావనలు కాకుండా దేశంలోని స్త్రీలందరికి ఉపయోగకరమైన 30 శాతం ఉద్యోగ నియామకాల బిల్లు తేవచ్చు కదా! అంటే మోదీ ముస్లిం స్త్రీలకు సహాయం చేద్దామని కాదు ఆ చట్టం తెచ్చింది. వారి కుటుంబాలలో చిచ్చు పెట్టడానికి! ఒక విధానమే కాదు, దాని వెనుకనున్న ఆలోచన కూడా మంచిదై ఉండాలి.

స్త్రీల పట్ల మోదీకి ఉన్న చిన్నచూపు తరచూ బయటపడుతూనే ఉన్నది. స్త్రీ ద్వేషం, మత ద్వేషం ఉన్నవాడు భారత్ లాంటి వైవిధ్యభరిత సంస్కృతి ఉన్న దేశానికి అధినేతగా తగినవాడేనా? ఆలోచించండి. మానవ విలువలు నాశనం చేసే ఇటువంటి నకారాత్మక ఆలోచనలు ఉన్నవాడు అసలు నాయకత్వానికి పనికివస్తాడా? అందుకే మోదీని గుజరాత్ ముఖ్యమంత్రిని చేయడాన్ని వాజపేయి వ్యతిరేకించారు. ఇక గుజరాత్ ముఖ్యమంత్రిగా ముస్లింల పట్ల, వారి మహిళల పట్ల జరిగిన అన్యాయాలకు అంతే లేదు. ఎదిరించిన జర్నలిస్టుల నిర్బంధం, అమిత్ షా కేసు చేస్తున్న జడ్జి ఆకస్మిక, అనుమానాస్పద మరణం ఏం సూచిస్తున్నాయి? మహిళా రెజ్లర్ల నిరసన, వారి పట్ల మోదీ చూపిన నిరాదరణ ఆయన స్త్రీ ద్వేషాన్ని ప్రతిబింబించటం లేదా? మణిపూర్‌లో జరిగిన అత్యాచారం, అనాచారాల్ని ఇప్పటిదాకా మోదీ ఖండించలేదు. ఆ రాష్ట్రానికి మొహం చాటేశాడు. ఈయన దేశానికి ప్రధాని అనటానికే సిగ్గు పడాలి ప్రజలు!

తనకంటే గొప్పగా, ఇంకే నాయకుడూ దేశంలో చేయనంత బ్రహ్మాండమైన పరిపాలన అందించిన కేసీఆర్‌ను లొంగదీయాలంటే దుర్యోధన మంత్రంగా ఆయన కూతురిని బాధపెట్టడం ఎంతవరకు న్యాయం? కవితను నిర్బంధించిన ఒక్క కారణమైనా నిరూపితమైందా? అయిదు నెలలు ఆవిడను బాధపెట్టినందుకు, నిరాధారంగా నిర్బంధించినందుకు మోదీ మీద ఏ కేసు వేయాలి? న్యాయం, చట్టం, ధర్మం అందరి పట్ల ఒక్కటే అయితే, ఈ అన్యాయం ఎట్లా సరిదిద్దుతారో కేంద్ర ప్రభుత్వం చెప్పాలి. ఈ అధర్మ పాలనను ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. న్యాయ పోరాటం చేయాలి. అధికార దుర్వినియోగం చేసే వారికి తగినరీతిలో బుద్ధి చెప్పాలి.

అట్టడుగున మనం.. అగ్రపథాన చైనా

భారత్, చైనా.. ప్రపంచంలోనే అత్యధిక జనాభాను కలిగి ఉన్న మొదటి రెండు దేశాలు. రెండు దేశాలు కూడా భారీ భూభాగం, ప్రాచీన నాగరికత, అణ్వస్త్ర సామర్థ్యం, శక్తిమంతమైన సైన్యం, బలమైన రాజకీయ భౌగోళిక ప్రాముఖ్యాన్ని కలిగి ఉన్నాయి. అయితే ఈ సారూప్యతలు ఇక్కడితోనే ముగుస్తాయి. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా చైనా ఉండగా.. భారత్ మాత్రం ఇప్పటికీ ఎదుగుతున్న ఆర్థిక శక్తిగానే ఉండటమే అందుకు కారణం. 1980లలో ఆర్థిక వ్యవస్థల పరిమాణం పరంగా రెండు దేశాల మధ్య పెద్దగా వ్యత్యాసం లేదు. వాస్తవానికి ఆ సమయంలో భారత తలసరి ఆదాయం చైనా కంటే ఎక్కువే. అయితే 2024లో జీడీపీ, తలసరి ఆదాయం, ప్రపంచ ఎగుమతుల్లో వాటా పరంగా చూస్తే భారత్ కంటే చైనా చాలా ముందంజలో ఉన్నది.



ప్రిన్స్ త్యాగి



జీడీపీ: ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం.. 2024లో చైనా ఆర్థిక వ్యవస్థ విలువ 18.53 ట్రిలియన్ డాలర్లు. ఇది భారత జీడీపీ 3.93 ట్రిలియన్ డాలర్ల కంటే సుమారుగా ఐదింతలు ఎక్కువ. 1980ల నుంచి చూసుకుంటే చైనా జీడీపీ 61 రెట్లు పెరిగి 303 బిలియన్ డాలర్ల నుంచి 18.53 ట్రిలియన్ డాలర్లకు ఎగబాకింది. అదే సమయంలో 21 రెట్లు మాత్రమే పెరిగిన భారత జీడీపీ 189 బిలియన్ డాలర్ల నుంచి 3.93 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. గత పదేండ్లలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే హయాంలో 93 శాతం పెరిగిన భారత జీడీపీ 2.04 ట్రిలియన్ డాలర్ల నుంచి 3.93 ట్రిలియన్ డాలర్లకు చేరింది. అదే సమయంలో 76 శాతం పెరిగిన చైనా జీడీపీ 10.5 ట్రిలియన్ డాలర్ల నుంచి ప్రస్తుత స్థితికి చేరింది.

2004-14 మధ్యకాలంలో యూపీఏ హయాంలో భారత జీడీపీ 188 శాతం పెరిగి.. 704 బిలియన్ డాలర్ల నుంచి 2,039 బిలియన్ డాలర్లకు చేరింది. అదే సమయంలో చైనా జీడీపీ 440 శాతం పెరిగి 1.95 ట్రిలియన్ డాలర్ల నుంచి 10.5 ట్రిలియన్ డాలర్లకు ఎగబాకింది.


తలసరి జీడీపీ: ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే 2024లో చైనా తలసరి జీడీపీ 25,015 డాలర్లుగా ఉన్నది. ఇది భారత జీడీపీ 10,123 డాలర్ల కంటే రెండున్నర రెట్లు అధికం. 1980లలో భారత తలసరి ఆదాయం 582 డాలర్లుగా ఉన్నది. ఇది అప్పటి చైనా తలసరి ఆదాయం 307 డాలర్ల కంటే సుమారు రెండు రెట్లు ఎక్కువ. 1980ల నుంచి చైనా తలసరి ఆదాయం 82 రెట్లు పెరిగింది. అదే సమయంలో భారత తలసరి ఆదాయం 17 రెట్లు మాత్రమే పెరగడం గమనార్హం. మోదీ హయాంలో గత పదేండ్లలో భారత తలసరి ఆదాయం 95 శాతం పెరిగింది. 2014లో 5,187 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయం 2024 నాటికి 10,123 డాలర్లకు చేరుకున్నది. అదే సమయంలో చైనా తలసరి ఆదాయం 100 శాతం పెరిగి.. 12,496 డాలర్ల నుంచి 25,015 డాలర్లకు ఎగబాకింది. 2004-14 మధ్యకాలంలో మన్మోహన్ సింగ్ హయాంలో 93 శాతం పెరిగి.. 2,681 డాలర్ల నుంచి 5,187 డాలర్లకు చేరింది. అదే సమయంలో చైనా జీడీపీ 185 శాతం పెరగడం గమనార్హం.

జీడీపీలో ప్రభుత్వ స్థూల అప్పు: 2024లో భారత జీడీపీలో ప్రభుత్వ స్థూల అప్పు 82.5 శాతం ఉండగా.. చైనా ప్రభుత్వ స్థూల అప్పు 88.6 శాతం ఉన్నది. 1995లో భారత స్థూల అప్పు 71 శాతం ఉండగా.. చైనా స్థూల అప్పు 21.6 శాతం ఉండేది. 2004-14 మధ్యకాలంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ అప్పు 84.9 శాతం నుంచి 67.1 శాతానికి తగ్గింది. 2014-24 మధ్యకాలంలో బీజేపీ హయాంలో ప్రభుత్వ అప్పు 67.1 శాతం నుంచి 82.5 శాతానికి ఎగబాకింది.

ఎగుమతులు: వరల్డ్ బ్యాంకు డాటా ప్రకారం.. చైనానే ప్రపంచంలోనే అతిపెద్ద ఎగుమతిదారు. వస్తువులు, సేవల రూపంలో 2023లో చైనా చేసిన ఎగుమతుల విలువ 3.5 ట్రిలియన్ డాలర్లు. మెక్‌కిన్సీ నివేదిక ప్రకారం.. ఇది ప్రపంచ ఎగుమతుల్లో సుమారు 14 శాతం. అదే సమయంలో 0.78 ట్రిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులతో భారత్ పదో స్థానంలో ఉన్నది. ఈ లెక్కన భారత్‌తో పోలిస్తే చైనా ఎగుమతులు సుమారుగా ఐదింతలు ఎక్కువ కావడం గమనార్హం.

ద్రవ్య క్రమశిక్షణ పాటిస్తూనే, మౌలిక వసతుల అభివృద్ధి, దేశీయ తయారీపై దృష్టి సారిస్తూ ఈ వృద్ధిని ఇలాగే కొనసాగిస్తే.. భారత్ కూడా ప్రపంచ శక్తిగా, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాల్లో ఒకటిగా నిలవగలదని నిపుణులు సూచిస్తున్నారు.

వరల్డ్ బ్యాంకు డాటా ప్రకారం.. చైనానే ప్రపంచంలోనే అతిపెద్ద ఎగుమతిదారు. వస్తువులు, సేవల రూపంలో 2023లో చైనా చేసిన ఎగుమతుల విలువ 3.5 ట్రిలియన్ డాలర్లు. మెక్‌కిన్సీ నివేదిక ప్రకారం.. ఇది ప్రపంచ ఎగుమతుల్లో సుమారు 14 శాతం.




వివక్షకు గురైన సమూహంలోనే వివక్షకు గురికావడమనేది వేరే దేశాల్లో అయితే చాలా అరుదు. కానీ, మన దేశంలో సహజాతి సహజం. ఈ దేశంలోని హిందూ వర్ణ వ్యవస్థ, దాని ప్రధాన భాగమైన నిచ్చెన మెట్ల కులవ్యవస్థలే దానికి కారణం. ఈ నిచ్చెన మెట్ల కులవ్యవస్థలో కిందకి పోతున్నకొద్దీ వివక్షకు గురవుతున్న సమూహంలోని సభ్యుల మధ్య అసమానత్వం ఇంకా స్పష్టంగా కనబడుతూనే ఉంటుంది.

పంచుకోవడంలో.. పంచాయితీ ఎందుకు?



దిలీప్.వి
84640 30808



వెనుకబడిన వర్గాల్లో కంటే దళిత కులాల్లో అసమానత్వం స్పష్టంగా కనపడుతుంది. అందుకే ఎస్సీ వర్గీకరణను ఉద్దేశించి బాలగోపాల్ 'ఇది దోపిడీ, అణచివేతలకు సంబంధించిన అంశం కాదు. ఇది అణచివేతకు గురైన సమూహంలోనే అసమానతలకు సంబంధించిన అంశం. దీని మూలాలు హిందూ వర్ణ వ్యవస్థలో, దాని ప్రధాన భాగమైన నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో ఉన్నాయ'ని అన్నారు. అణచివేతకు గురైన సమూహంలోని అసమానతకు గురయ్యే వర్గం.. ఆ అసమానతలకు వ్యతిరేకంగా సామాజిక సమానత్వం కోసం పోరాడటమనేది ఒక చైతన్యవంతమైన చర్యగా చూడాలి. సామాజిక న్యాయసాధన దిశగా జరిగే పోరాటంగా చూడాలి. అట్లా చూసినప్పుడే ఇటీవల సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేయవచ్చని ఇచ్చిన తీర్పుని అర్థం చేసుకుంటారు, స్వాగతిస్తారు.

ఈ దేశంలో వివక్షకు గురైన ఎస్సీ కులాల్లోనే ఎంతటి వివక్షను పాటిస్తారనేది దళిత వాడలను ఎరిగిన ఎవరికైనా సులభంగా అర్థమైతది. ఈ వాస్తవాన్ని మరుగునపెట్టి ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు రాగానే ఈ తీర్పు అన్యాయం, దీని వల్ల దళితుల ఐక్యత దెబ్బతింటుందని కొందరు గగ్గోలు పెడుతు న్నారు. నిన్నటివరకు సామాజిక చింతనాపరులుగా ఉన్నవాళ్లు, సామాజిక న్యాయాన్ని కోరుకుంటున్నామనే వాళ్లు ఆ తీర్పు రాగానే వాళ్లలో ఉన్న సంకుచిత తత్వాన్ని బయటపెట్టుకుంటున్నారు. చట్టసభల్లో మాలలకు అన్యాయం జరుగుతుందని గగ్గోలు పెడుతున్నారు. అలాంటి వాళ్లందరికీ ఒక ప్రశ్న. వర్గీకరణ అంశం ముందుకు వచ్చినపుడే ఒక వర్గానికి అన్యాయం జరుగుతుందని గుండెలు బాదుకోవడం ఎందుకు? ఏ సమాజంలోనైనా ఎక్కువగా ఫలాలు అనుభవించిన సమూహం వాటిని వదులుకోవడానికి అంత సులభంగా ఒప్పుకోదు. జనా భా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉండాలన్నపు డు వ్యతిరేకించిన అగ్ర వర్ణ వ్యవస్థలన్నీ.. మండల్ కమిషన్‌ను వ్యతిరేకించిన అన్ని సందర్భాల్లో ఇదే నిజమైంది. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే సందర్భంలో కొందరు అట్లానే మాట్లాడుతున్నారు.

'వర్గీకరణ వల్ల దళిత సమాజం చీలిపోతుంది. ఇది పాలకవర్గాల కుట్ర' అని మాట్లాడుతూ చాలా మంది భయాన్ని వ్యక్తం చేస్తున్నట్టు, మొత్తం దళిత సమాజంపై ప్రేమ ఉన్నట్టు మాట్లాడుతున్నారు. వర్గీకరణ పాలక వర్గాల కుట్ర కావచ్చు. కానీ, దానివల్ల సామాజిక న్యాయం దక్కాల్సిన సమూహాలకు దక్కుతుందా లేదా? అనేది చూడాలి. దళితులను వర్గీకరణతో విభజించి, అనైక్య పరుస్తారని భయమెవరికన్న ఉంటే అది అపోహ మాత్రమే.

రాజకీయ రంగాల్లో రాజ్యాంగంలో విధించిన పరిమితి మేరకు మాత్రమే సీట్లిచ్చి అన్ని పాలకవర్గాలు చేతులు దులుపుకొంటున్నాయి. వారి వారి రిజర్వేషన్ల వరకే వారిని పరిమితం చేస్తున్నారు. నిజానికి వర్గీకరణ వల్ల మాలమాదిగల ఐక్యత పోతుందనుకునే నాయకులు దళితవర్గాల ఐక్యత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో క్యాబినెట్ మంత్రిత్వ శాఖల్లో కూడా 'మా వాటా ప్రకారం మాకు మంత్రిత్వ శాఖలు ఇవ్వాల'ని ఒక ఉమ్మడి ఉద్యమం తీసుకురండి. రాష్ట్రాలకు ముఖ్యమంత్రులను, దేశ ప్రధానిగా వ్యక్తులను ఎన్నుకునేటప్పుడు రొటేషన్ పద్ధతిలో దళితులకు కూడా అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేయండి. దీనిద్వారా దళిత జాతి మొత్తాన్ని రాజ్యాధికారం దిశగా నడిపించవచ్చు. దళితజాతి ఐక్యతను చాటవచ్చు.

ఈ దేశంలో ఎస్సీ ఎస్టీల అభివృద్ధి కోసమని కేటాయిస్తున్న అరకొర నిధులను కూడా ప్రభుత్వాలు పక్కదారి పట్టిస్తున్నాయి. అంతే కాకుండా సంక్షేమ పథకాలు, ఇతరత్రా అభివృద్ధి పనులకు కూడా సబ్‌ప్లాన్ నిధుల్లో నుంచే ఖర్చుపెట్టి ఎస్సీల అభ్యున్నతికి ఎంతో ఖర్చు పెడుతున్నామని ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకొంటున్నాయి. దళితుల ఐక్యతను చాటుకోవాలంటే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా వినియోగించేటట్టు ఐక్య ఉద్యమాలు చేసి ఐక్యతను చాటుకోవచ్చు.

ఈ దేశంలో ఉన్నత విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు తీసేయడానికి కుట్రలు జరుగుతున్నవి. వాటిని అడ్డుకోవడానికి ఐక్య ఉద్యమాలు చేయవచ్చు. దేశంలో ఉన్నత విద్యను మొత్తంగానే ప్రైవేటీకరణ చేసి, విద్యాసంస్థల్లో ఎటువంటి రిజర్వేషన్లు లేకుండా చేసేందుకు ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థల్లో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ఉద్యమం చేయండి. దీనిద్వారా దళిత వర్గాల ఐక్యతే కాదు, మొత్తం బహుజనవర్గాల ఐక్యతను చాటుకోవచ్చు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడమంటే సామాజిక న్యాయభావనను వ్యతిరేకించడమే. నిజానికి సామాజిక న్యాయ వర్గీకరణ వల్ల ఐక్యత దెబ్బతింటుందని మాట్లాడేవాళ్లందరూ ఒక విషయం ఆలోచించాలి. ఏ సమూహాలైతే అన్యాయానికి గురవుతున్నాయో ఆ సమూహాలతో న్యాయమైన పంపిణీ చేసుకొని ఇంకా దక్కాల్సిన రాజ్యాంగ ఫలాల కోసం ఉమ్మడిగా కలిసి కొట్లాడినప్పుడు మాత్రమే నిజమైన ఐక్యత సాధించగలుగుతారు. ఎస్సీ వర్గీకరణను మాత్రమే కాదు, ఏ వర్గీకరణను కూడా ఉత్త పంపకంగా చూడకూడదు. వివక్షాపూరితమైన, అసమానతకు గురవుతున్న సమూహాల్లోని ప్రజలలోనే వివక్షకు గురవుతున్న సమూహాల సామాజిక న్యాయకాంక్షగా చూసినప్పుడే వర్గీకరణలో గల న్యాయమైన సూత్రాన్ని అర్థం చేసుకోగలుగుతారు.



నేడు పీవోడబ్ల్యూ మహాసభలు

మహిళల హక్కుల కోసం ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) అర్ధ శతాబ్దకాలంగా పనిచేస్తున్నది. 1974లో ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థినుల చొరవతో ఆవిర్భవించిన ఈ సంఘం మొదట మహిళలపై వేధింపులు, అసభ్య సాహిత్యానికి, వరకట్న హత్యలకు వ్యతిరేకంగా పోరాడింది. ఆ తర్వాత అధిక ధరలు, అవినీతి, నిరుద్యోగానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాలుపంచుకున్నది. పురుషాధిక్యతకు వ్యతిరేకంగా పోరాడే మహిళా సంఘాలు అవసరమని.. కార్మిక, కర్షక వర్గాలతో కలిసి పోరాడాలనే ఉద్దేశంతో ఏర్పడిన అభ్యుదయ మహిళా సంఘం ఆ తర్వాత ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ)గా మారింది.


ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు పురుషాధిపత్యానికి వ్యతిరేకంగా, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో సమానత్వం కోసం, శ్రామికవర్గ మహిళల విముక్తి కోసం పోరాడుతూనే ఉన్నది. మహిళల ఆర్థిక స్వావలంబన మహిళా సాధికారతను, సమానత్వ హక్కును ప్రభావితం చేస్తుంది. ఈ నేపథ్యంలో శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం రోజురోజుకు తగ్గిపోతున్నది. పలు రంగాల్లో పురుషులతో సమానంగా వేతనాలు పొందడం లేదు. ఆశావర్కర్లుగా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులుగా లక్షలాది మంది మహిళలు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. మోదీ సర్కార్ తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలు కార్మికవర్గ హక్కులను కాలరాస్తున్నాయి. వ్యవసాయం కార్పొరేటీకరణ వల్ల రైతులు భూములను కోల్పోతున్నారు. తద్వారా వ్యవసాయ రంగంలో మహిళల ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయి.

దేశంలో మహిళా హక్కులపై గతంలో ఎన్నడూ లేనంతగా దాడులు జరుగుతున్నాయి. ఇంటాబయట మహిళలు ఎదుర్కొంటున్న హింస, దౌర్జన్యాలకు అంతులేకుండా పోతున్నది. మల్ల యోధులపై లైంగికవేధింపులకు పాల్పడిన బీజేపీ నేత, మాజీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు చేయడానికి పోరాడాల్సి వచ్చింది. ఆయనపై పోరాడిన సాక్షిమాలిక్ తనకు తానుగా పోటీల నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వినేశ్ ఫోగట్ కేవలం 100 గ్రాముల బరువు కారణంగా కుట్రపూరితంగా ఒలింపిక్స్‌లో అనర్హత వేటుకు గురయ్యారు. బిల్కిస్ బానోపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన దుర్మార్గులకు క్షమాభిక్ష పెట్టడమే కాకుండా సన్మానాలు చేస్తున్నారు. మణిపూర్‌లో మహిళలపై దాడులు, నగ్న ఊరేగింపులు జరుగుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా పోరాడుతున్న మానవ హక్కుల కార్యకర్త అరుంధతి రాయ్ లాంటివారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలైనా మహిళలకు ఇచ్చిన అనేక వాగ్దానాలను నెరవేర్చలేదు. తక్కువ ధరకే గ్యాస్, ఉచిత విద్యుత్తు, పింఛన్లు, రేషన్‌కార్డులు, మహిళలకు ఆసరా లాంటి హామీలను ఇప్పటికీ అమలు చేయలేదు. రాష్ట్రంలో మహిళలు, పసిపిల్లలు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్లపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయి. వీటిని వెంటనే అరికట్టాల్సి ఉన్నది.

స్త్రీల వైద్యం, విద్య, ఉద్యోగ, వివాహ తదితర అంశాలకు సంబంధించి పితృస్వామిక ఆధిపత్య బంధనాలను ముందుకుతెస్తున్న మోదీ కార్పొరేటీకరణ, మనువాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉన్నది. మోదీ ఫాసిస్టు పాలనా విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక అవకాశాలను రక్షించుకోవడానికి పోరాటాలను బలోపేతం చేయాల్సిన తరుణంలో ప్రగతిశీల మహిళా సంఘం తెలంగాణ రాష్ట్ర ఏడో మహాసభలను నిర్వహిస్తున్నది. మహిళా ఉద్యమ కర్తవ్యాలను నిర్దేశించుకోబోతున్న ఈ సభలు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగనున్నాయి. ప్రముఖులు పాల్గొననున్న ఈ మహాసభలను విజయవంతం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యవర్గం విజ్ఞప్తి చేస్తున్నది.

(ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా ప్రచురించిన కరపత్రం నుంచి)



శాంతిస్థాపకుడు మణిపూర్‌లో శాంతిని స్థాపించలేరా?

దాదాపుగా 16 నెలలుగా మణిపూర్ రాష్ట్రం అల్లర్లతో అట్టుడుకుతున్నది. అక్కడ శాంతి, సామరస్యం, సాధారణ పరిస్థితులు కనిపించడం లేదు. విశ్వసనీయతను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ కోల్పోయారు. ప్రపంచం మొత్తం తిరిగి శాంతిస్థాపకుడి పాత్ర పోషించేందుకు ప్రయత్నిస్తున్న మోదీ.. కాలిపోతున్న మణిపూర్‌కు వెళ్లి, అక్కడ ఎందుకు శాంతిని స్థాపించలేకపోతున్నారు?

- జైరామ్ రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నేత